thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 186 | కరీంనగర్ శనివారం, 13 సెప్టెంబర్ 2025 | ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం | వెల - 1.00

## నీట్ పరీక్షలో డబ్బుదే కీలక పాత్ర: స్టాలిన్

చెన్నై : 'నీట్' పరీక్షలో ఆద్యంతం డబ్బు కీలక పాత్ర పోషిస్తోందని తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శించారు. 2025 యూజీ వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షలో అవినీతికి పాల్పడి, అర్హత లేని వారికి ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు ఇప్పిస్తామని నగదుతీసుకుని మోసగించారంటూ మహారాష్ట్రకు చెందిన జాతీయ పరీక్షా ఏజెన్సీ అధికారి, పలువురువైద్యులపై సీబీఐ కేసు నమోదుచేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీఎం స్టాలిన్ తన ఎక్స్‌లో స్పందిస్తూ... "నీట్ అనేది మెరిట్ గురించి కాదు, మార్కెట్ గురించి అని నిరూపించే మరో కేసు. అందుకే మేము 'నీట్' నీట్ కాదని గట్టిగా చెబుతున్నాము. నీట్ ప్రారంభం నుంచి చివరి వరకు డబ్బు మాత్రమే ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నీట్ పరీక్షా వ్యవస్థ ఒక నైతిక కుంభకోణం" అని పోస్ట్ చేశారు.

# శత్రు శిబిరంలో తిరుగుబాటు చేసిన ఆ ముగ్గురు .!!

## -ముగ్గురికి ముగ్గురు పార్టీలోనే నేలకొరిగారు
## -వారికి రవిత్రయంగా గుర్తింపు
## -అగ్ర నేతలుగా ఎదిగి ఆపైన ఎన్కౌంటర్
## -ఒడిశా చీఫ్ మోడెం బాలకృష్ణ హాతం





చురకలు ప్రత్యేక ప్రతినిధి :హైదరాబాద్ మావోయిస్ట్ పార్టీలో రవిత్రా యంగా పేరున్న ముగ్గురి చరిత్ర లో నిన్నటి వరకు ఉన్న మోడెం బాలకృష్ణ ఒడిశా,ఛతీస్ఘడ్ రాష్ట్రాల సరిహద్దులో హత మయ్యారు.పటేల్ సుధాకర్ రెడ్డి శాఖమూరు అప్పారావు,మోడెం బాలకృష్ణలది ప్రత్యేక ఆకర్షణ ఉండేది.వ్యాస్ హత్యకేసు సమయంలో ఈ ముగ్గురి పేరు మ్రోగి పోయింది.గు నేలనంతా హోరెత్తించిన "జంగు సైరనూదిరో జైలులో మాయన్నలు" పాటకు స్ఫూర్తినిచ్చిన పోరాటానికి నాయకత్వం వహించింది ముగ్గురు విప్లవకారులు. 90వ దశకంలో అరెస్టయి హైదరాబాద్ జైల్లో ఉన్న అప్పటి పీపుల్స్ వార్ నాయకులు చారిత్రాత్మక పోరాటాన్ని నిర్మించారు. "రవిత్రయం" (శాఖమూరి అప్పారావు ఏరవి, పటేల్ సుధాకర్ రెడ్డి ఏ సూర్యం, మోడెం బాలకృష్ణ ఏ భాస్కర్) శత్రుశిబిరాన్ని కూడా పోరాట కేంద్రంగా ఎలా మలచవచ్చో ఆచరణలో చూపించారు. తమ పోరాటం వల్ల దేశ వ్యాప్తంగా జైలు మాన్యువల్‌లో మార్పులు వచ్చాయి.ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర కమిటీ వెస్ట్రన్ బ్యూరో ఇన్‌చార్జ్ మోడెం బాలకృష్ణ సహా 10 మంది చనిపోయారు. బాలకృష్ణ మృతితో చారిత్రాత్మక జైలు పోరాటం నడిపిన నాయకత్వం అందరూ అమరులయ్యారు. వరంగల్ జిల్లా మడికొండకు చెందిన బాలకృష్ణ ఉద్యమ ప్రస్థానం హైదరాబాద్ రాడికల్ విద్యార్థి ఉద్యమం నుండి మొదలైంది. సుల్తాన్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో ఎస్.ఎస్.సి, మలక్‌పేట జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదివారు. ఆ సమయంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో క్రియాశీలక పాత్ర పోషించాడు. 1983లో పీపుల్స్ వార్ పార్టీలో చేరిన బాలకృష్ణను భద్రచలం ప్రాంతంలో పనిచేసే క్రమంలో 1984లో మొదటిసారి పోలీసులు అరెస్టు చేశారు. రెండు సంవత్సరాలు వరంగల్ సెంట్రల్ జైల్లో ఉన్న బాలకృష్ణ విడుదల తరువాత మళ్లీ పార్టీ కార్యకలాపాల్లో భాగమయ్యారు. 1987లో మహబూబ్ నగర్‌లో పోలీసులు మరోసారి బాలకృష్ణను అరెస్టు చేశారు. ఈ సారి మూడేళ్ల పాటు ముషీరాబాద్ జైల్లో ఉన్నారు. బాలకృష్ణ విడుదల కోసం అప్పటి టీడీపీ ఎమ్మెల్యే మండవ వెంకటేశ్వరరావును పీపుల్స్ వార్ కిడ్నాప్ చేసింది. దీంతో 1990లో రాజకీయ ఖైదీగా ఉన్న బాలకృష్ణ జైలు నుంచి విడుదల య్యారు.విడుదల తరువాత 1991లో మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శిగా, దక్షిణ తెలంగాణ రీజినల్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యా డు. 1993లో మరోసారి అరెస్టయ్యాడు. దాదాపు ఆరు సంవత్సరాల పాటు చంచల్ గూడ జైలులో ఉన్న బాలకృష్ణ 1999లో విడుదల య్యాడు. భాస్కర్ ఏ మనోజ్ ఏ బాలన్నఏ రామచంద్ర పేర్లతో పనిచేసిన బాలకృష్ణ తరువాత కాలంలో మావోయిస్టు పార్టీ ఒడిశా స్టేట్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించాడు. కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నియ్యాడు. నాలుగున్నర దశాబ్దాలుగా సాగుతున్న అలుపెరగని విప్లవ బాటసారి పయనం ఒడిశా - చత్తీస్ గఢ్ సరిహద్దులో అర్థాంతరంగా ఆగింది.ఇలా ఉంటే ఇదే గారియా బాద్ జిల్లాలో గతంలో భారీ ఎన్కౌంటర్ అయింది అందులో సీసీ మెంబర్ చలపతి సహా 18 మంది మావోలు హతం కాగా,ఇప్పుడు మోడెం బాలకృష్ణ వెంట 10 మంది సభ్యులు ఇద్దరు నేతలు మరణించారు. అలాగే గడిచిన మూడు నెలల్లో మూడు సార్లు ఏ ఓ బి లో ఘటనల్లో ముఖ్య నేతలు మృతి చెందారు.గణేష్, చలపతి, మోడెం బాలకృష్ణ.ఛతీష్గడ్ లో జనరల్ సెక్రటరీ గంగన్న,జార?ండ్ లో సీసీ నెంబర్ మాంజి అనే ముఖ్యా నాయకులు వరుసగా ప్రాణాలు కోల్పోతున్నారు.పదుల సంఖ్యలో రాష్ట్ర,జిల్లా,ఏరియా కమిటీ సభ్యులను కాగర్ ఆపరేషన్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం చంపుతున్నది

# భారత్‌ను చైనాకు దూరం చేసే అమెరికా వ్యూహం



అమెరికా రాయబారి సెర్గీ గోర్ చేసిన వ్యాఖ్యలు ఒక దిశగా స్పష్టమైన సంకేతాన్ని ఇస్తున్నాయి. భారత్–అమెరికా సంబంధాలు వాణిజ్య వివాదాల మధ్య నిలకడగా ఉన్నప్పటికీ, దీని అసలైన సారాంశం జియోపాలిటికల్ వ్యూహంలోనే దాగి ఉంది.

**చైనా అంశం ప్రధాన కేంద్రం..** భారత్‌ను చైనాకు దూరం చేసి అమెరికాకు దగ్గర చేయడం అనేది వాషింగ్టన్‌కు అత్యవసరంగా మారింది. కారణం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా పెరుగుతున్న ఆధిపత్యం. క్వాడ్, ఆర్థిక ఒప్పందాలు, రక్షణ రంగ సహకారం అన్నీ ఈ ప్రధాన లక్ష్యం చుట్టూనే తిరుగుతున్నాయి.

**వాణిజ్య ప్రయోజనాల సమీకరణ...**గోర్ స్పష్టంగా చెప్పినట్లే అమెరికా తన చమురు, పెట్రోలియం, ఎల్ఎన్‌జీకి భారత్‌ను ప్రధాన మార్కెట్‌గా మార్చుకోవాలనుకుంటోంది. 140 కోట్ల జనాభాలో మధ్యతరగతి వర్గం పెరుగుతున్నది అమెరికా కంపెనీలకు అపారమైన అవకాశాలు కల్పిస్తుంది. అంటే వ్యూహం కేవలం భద్రతా కూటములకే పరిమితం కాదు.. వాణిజ్య ప్రయోజనాలు కూడా అంతే ప్రాధాన్యం పొందుతున్నాయి.

**అడ్డంకులు – పరిష్కారం?...** ప్రస్తుతం సుంకాలు, టారిఫ్ వివాదం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతను పెంచుతున్నాయి. అయితే ఇరువైపులా వాటిని పరిష్కరించుకోవాలన్న దృక్పథం కనిపిస్తోంది. వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, అమెరికా ప్రతినిధులు జరిపే సమావేశాలు ఒక ఒప్పందానికి మార్గం సుగమం చేయవచ్చు.

**క్వాడ్ సదస్సు – ట్రంప్ పర్యటన...** నవంబరులో భారత్‌లో జరగనున్న క్వాడ్ సదస్సుకు ట్రంప్ హాజరవుతారని సంకేతాలు రావడం, అమెరికా భారత్‌పై చూపుతున్న ప్రాధాన్యాన్ని బలపరుస్తోంది.

ఇది కేవలం దౌత్య పరమైనది కాకుండా చైనాకు వ్యతిరేకంగా కూటమి నిర్మాణానికి బలమైన దశ అవుతుంది.

**జీ7 ఒత్తిడి – కొత్త సవాలు...** రష్యా యుద్ధం ముగింపునకు భారత్, చైనాపై అదనపు సుంకాలు విధించాలని అమెరికా ఒత్తిడి తెచ్చిన వార్తలు, భారత్‌కు సంక్లిష్ట పరిస్థితిని సృష్టిస్తున్నాయి. ఒకవైపు రష్యాతో సాంప్రదాయ సంబంధాలు, మరోవైపు అమెరికా ఒత్తిడి – భారత్ వ్యూహాత్మక సమతౌల్యాన్ని పరీక్షిస్తున్నాయి. అమెరికా స్పష్టంగా భారత్‌ను చైనాకు దూరం చేసే మిషన్‌లోకి దిగింది. దౌత్యం, వాణిజ్యం, రక్షణ రంగాలన్నీ ఈ ప్రధాన వ్యూహం చుట్టూ తిరుగుతున్నాయి. అయితే భారత్ తన స్వీయ ప్రయోజనాలను కాపాడుకునే విధంగా జాగ్రత్తగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే రష్యా, అమెరికా, చైనా మధ్య సమతౌల్యం సాధించడం ఢిల్లీకే పెద్ద సవాలు.




## గోదావరి, కృష్ణా పుష్కరాలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్

హైదరాబాద్, సెప్టెంబరు 12 : గోదావరి, కృష్ణా పుష్కరాల నిర్వహణపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇవాళ(శుక్రవారం) కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ అభివృద్ధిపై పలు కీలక సూచనలు చేశారు. శాశ్వత ప్రాతిపదికన సెంట్రిక్ ఘాట్స్ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రముఖ ఆలయాలను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని శాశ్వత ఘాట్స్ నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహకంలోని ఆలయాలను క్షేత్రస్థాయిలో సందర్శించి అనువైన వాటిని ఎంపిక చేయాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతోపాటు ఇతర ప్రముఖ ఆలయాలను సందర్శించి ప్రత్యేకంగా జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర పరిధిలోని జాతీయ రహదారుల సమీపంలో ఉన్న గోదావరి పరివాహక ఆలయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రస్తుతం ఉన్న ఘాట్స్‌ను విస్తరించడంతోపాటు రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. పుష్కరాల సమయంలో దాదాపు రెండు లక్షల మంది ఒకేసారి ఘాట్స్ వద్ద స్నానమాచరించేందుకు వీలుగా ఉండేలా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రతీ ఆలయానికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరుగా ఘాట్స్ డిజైన్లు రూపొందించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గోదావరి పుష్కరాల్లో పర్యాటక శాఖ, నీటిపారుదల శాఖ, దేవాదాయ శాఖ సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.




# 15వ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ ప్రమాణం..

## హాజరైన పలువురు ప్రముఖులు

భారత 15వ ఉప రాష్ట్రపతిగా చంద్రాపురం పొన్నుసామి రాధాకృష్ణన్ ఇవాళ ఉదయం సరిగ్గా 10.11 నిమిషాలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు.


ముందుగా జాతీయ గీతాలాపన చేసిన తరువాత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర మంతులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, అశ్విని వైష్ణవ్, తాజా మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఇతర ఎన్డీఏ పక్ష నేతలు హాజరయ్యారు. అదేవిధంగా విపక్షం నుంచి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఇండియా కూటమి సభ్యులు ఈ కార్యక్రమానికి అటెండ్ అయ్యారు. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. భారత ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ పక్ష నేతలు అభినందలు తెలిపారు.

**ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్.. రాజకీయ ప్రస్థానం ఇదే..** ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. నూతన రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు.

ఈ క్రమంలో ఆయన రాజకీయ నేపథ్యం గురించి తెలుసుకుందాం. ఆయన పూర్తి పేరు చంద్రపురం పొన్నుసామి రాధాకృష్ణన్. తమిళనాడుకి చెందిన రాజకీయ నాయకుడు. మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. జార?ండ్ గవర్నర్‌గా కూడా పని చేసిన రాధాకృష్ణన్ ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవాన్ని కలిగి ఉన్నారు. ఆయన విస్తృత రాజకీయ ప్రయాణం ఎంపీగా, పార్టీ నాయకుడిగా, నిర్వాహకుడిగా, గవర్నర్‌గా విభిన్న బాధ్యతలను కలిగి ఉంది. దేశంలోని అత్యంత అనుభవజ్ఞులైన రాజకీయ వ్యక్తుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు.

**16ఏళ్ల వయసులోనే..** సీపీ రాధాకృష్ణన్ 1957 అక్టోబర్ 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. ఆయన రాజకీయ ప్రయాణం చిన్న వయసులోనే ప్రారంభమైంది. 16ఏళ్ల వయసులో తొలిసారి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)లో చేరారు. తర్వాత 1974లో భారతీయ జనసంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడయ్యారు. ఆ తర్వాత బీజేపీని స్థాపించడంతో అందులో చేరారు. 1998 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడు కోయంబత్తూర్ స్థానం నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేసి 1.5 లక్షల ఆధిక్యంతో విజయం సాధించారు. డీఎంకే నేత రామనాథన్‌ను నాడు ఓడించారు. ఆ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి గెలిచిన ముగ్గురు బీజేపీ ఎంపీల్లో రాధాకృష్ణన్ ఒకరు. రాజకీయ మార్పుల కారణంగా 1999లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఆయన 55వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. సిపి రాధాకృష్ణన్ రాజకీయ ప్రయాణం 1974లో భారతీయ జనసంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా ఎన్నికతో ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బిజెపి కార్యదర్శిగా నియమితులయ్యారు. 1998- 1999 - కోయంబత్తూరు నుండి లోక్‌సభ ఎంపీగా ఎన్నికయ్యారు. టెక్స్ టైల్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గా చేశారు. పిఎస్‌యులపై పార్లమెంటరీ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఫైనాన్స్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్ గా ఉన్నారు. స్టాక్ ఎక్స్ చేంజ్ స్కామ్ స్పెషల్ పార్లమెంటరీ కమిటీ మెంబర్ గా ఉన్నారు. 2004లో యూఎన్ జనరల్ అసెంబ్లీలో భారత్ కు ప్రాతినిధ్యం వహించారు. బీజేపీ తమిళనాడు శాఖకు 2004, 2007లో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. బీజేపీకి అత్యంత నమ్మకస్తుడిగా గుర్తింపు. అందుకే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక. 2004 2007 మధ్య బిజెపి రాష్ట్ర నాయకత్వంలో సి.పి. రాధాకృష్ణన్ ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆయన తమిళనాడులో బిజెపి అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సమయంలో, ఆయన 93 రోజుల పాటు 19వేల కిలోమీటర్ల రథయాత్రను ప్రారంభించారు.

నదుల అనుసంధానం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు, అంటరానితనాన్ని ఎదుర్కోవడం, మాదకద్రవ్యాలను అరికట్టడం వంటి అంశాలపై గళమెత్తారు. రాధాకృష్ణన్ సేవలను గుర్తించిన మోదీ సర్కార్ 2023లో జారండ్ గవర్నర్‌గా నియమించింది. దాదాపు ఏడాదిన్నర అక్కడ పనిచేశారు. తర్వాత గతేడాది మార్చిలో తమిళసై సౌందర రాజన్ రాజీనామాతో తెలంగాణ, పుదుచ్చేరి బాధ్యతలను ఆయనకే అప్పగించారు. కానీ, జులైలో మహారాష్ట్రకు పూర్తి స్థాయి గవర్నర్‌గా నియమించారు.




# 15 నుంచి వృత్తి విద్యా కళాశాలల బంద్

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయకపోతే ఈనెల 15 నుంచి కళాశాలలను నిరవధికంగా బంద్ చేయనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని కలిసిన సమాఖ్య సభ్యులు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు బంద్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి రోజును ఇంజినీర్స్ డేగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ రోజును బ్లాక్ డేగా ప్రకటిస్తూ ఇంజినీరింగ్, ఫార్మా, నర్సింగ్, ఎంబీఏ, ఎంసీఏ సహా వృత్తి విద్యా కళాశాలలు బంద్ నిర్వహిస్తాయని తెలిపారు. డిగ్రీ, పీజీ కాలేజీలు 16వ తేదీ బంద్ చేపట్టనున్నట్టు ప్రకటించాయి. రూ.10వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకాయిలు ఉన్నాయని, వాటిలో ఇప్పటికే టోకెన్లు విడుదల చేసిన రూ.1200కోట్లు అయినా ఈనెల 30వ తేదీ నాటికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కళాశాలలు బంద్ కొనసాగిస్తే దాదాపు పది లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో ఉన్నత విద్యా మండలి, ప్రభుత్వం తక్షణం బకాయిలను విడుదల చేయాలని కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.




## సింగరేణి బోర్డు కీలక నిర్ణయం.. ఖనిజాల తవ్వకాలపై ఫోకస్..

హైదరాబాద్: సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఖనిజాల తవ్వకాల్లో కూడా పాల్గొనాలని సింగరేణి బోర్డు నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణిలో బొగ్గు నిల్వలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. తద్వారా సింగరేణి సంస్థకు నష్టం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు ఆయన ఇవాళ(శుక్రవారం) మీడియాతో మాట్లాడారు.. సింగరేణి బోర్డు బొగ్గు తవ్వకాలు పెంచడంతో పాటు ఇతర మినరల్స్ మైనింగ్ చేయాలని నిర్ణయం తీసుకుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాయచూరు, దేవదుర్గ ప్రాంతాల్లో కాపర్ అండ్ గోల్డ్ మైనింగ్ యాక్షన్‌లో సింగరేణి పాల్గొందని గుర్తు చేశారు. దాని వల్ల సింగరేణి 37.75శాతం వాటాను దక్కించుకుందని హర్షం వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయని చెప్పారు. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు వ్యక్తులకు వెళ్తాయని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు వెళ్లాయని గుర్తు చేశారు. అందుకే సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనాలని సూచించారు. దాంతో సింగరేణిలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని వివరించారు. సింగరేణి గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్‌లో భాగస్వామ్యం అవుతోందని పేర్కొన్నారు. దేశానికి క్రిటికల్ మినరల్స్ అందించడంలో భాగస్వామ్యం ఉండాలనే లక్ష్యంతో సింగరేణి ముందుకు వెళ్తుందని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

## గ్రూప్ -1 అభ్యర్థులు తెలంగాణ భూమి పుత్రులు: బూర నర్సయ్య గౌడ్

హైదరాబాద్: గ్రూప్-1 అభ్యర్థులు తెలంగాణ భూమి పుత్రులని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ సర్కార్ ఒక్కసారి పరీక్ష నిర్వహించి పేపర్ లీక్ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 21 నెలలు అవుతున్నా గ్రూప్ 1 ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆక్షేపించారు. సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. గ్రూప్-1 పరీక్షను తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేదంటే మిలియన్ మార్చ్ తరహాలో ఉద్యమిస్తామన్నారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే యూపీఎస్సీ, ప్రధాని మోదీని ఆదర్శంగా తీసుకోవాలని హితవుపలికారు. " జాబ్ క్యాలెండర్‌కు పాతరేశారా? నిరుద్యోగులకు ఇస్తామన్న నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి మర్చిపోయారా? రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి. యూనివర్సిటీలను ఇంటిగ్రేటెడ్ స్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పి.. ఇంటర్మీడియట్ స్థాయికి దిగజార్చారు." అని నర్సయ్యగౌడ్ విమర్శించారు.




## అతి భారీ వర్షసూచన.. ఈ జిల్లాల వారు జాగ్రత్త..

తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. అలాగే ఆదివారం మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉ ందని పేర్కొంది. తెలంగాణలోని ఆదిలావాద్, మహమూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో శుక్రవారం అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.ఈ జిల్లాలకు అధికారులు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. అదేవిధంగా శనివారం నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. భారీ వర్షాల ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కిలీమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు




ఆదిలాబాద్, సెప్టెంబరు 12 : మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను హామీలు ఇవ్వనని.. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందో లేదో తెలియదని షాకింగ్ కామెంట్స్ చేశారు. అందుకే తాను హామీలు ఇవ్వనని చెప్పుకొచ్చారు. తన వంతుగా ప్రయత్నం మాత్రం చేస్తానని పేర్కొన్నారు మంత్రి జూపల్లి కృష్ణారావు. తన నియోజకవర్గంలోనూ హామీలు ఇవ్వనని తెలిపారు. ప్రజలకు ఏం పనులు కావాలో వాటిని మాత్రమే చేస్తానని స్పష్టం చేశారు. ఇవాళ (శుక్రవారం) బోథ్‌లో ఇందిరమ్మ నమూనా గృహం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో మంత్రి జూపల్లి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అయితే, మంత్రి జూపల్లి చేసిన ఈ వ్యాఖ్యలపై టీపీసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని కాంగ్రెస్ శ్రేణులు మాట్లాడుకుంటున్నారు.



# బాంబే హైకోర్టుకూ బాంబు బెదిరింపులు

ముంబై (మహారాష్ట్ర), సెప్టెంబర్ 12: ఢిల్లీ హైకోర్టుకు బాంబు బెదిరింపుల అనంతరం ఇవాళ (శుక్రవారం) బాంబే హైకోర్టుకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో, న్యాయవాదులు, ఇతర కోర్టు సిబ్బందిని కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయమని అధికారులు కోరారు. దీనిపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. బాంబే హైకోర్టు న్యాయవాది మంగళ వాఘే మాట్లాడుతూ.. 'ఈరోజు బాంబే హైకోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో కోర్టును ఖాళీ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు' అని తెలిపారు.

బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు కోర్టు ప్రాంగణాన్ని ఖాళీ చేయమని పోలీసులు కోరినట్లు మరో న్యాయవాది తెలిపారు. బాంబు బెదిరింపు హెచ్చరికతో కోర్టు ప్రాంగణం, చుట్టుపక్కల పరిసరాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. హెచ్చరికలు వచ్చిన వెంటనే హైకోర్టులోని అన్ని బెంచీలు వెంటనే లేచి బయటకు పరుగులు తీశారు. దీంతో కోర్టులో గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. న్యాయ మూర్తులు, న్యాయవాదులు, ప్రజలు భయంతో కోర్టు కాంప్లెక్స్ నుంచి బయటకు పరుగులు తీశారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లు సహా భద్రతా దళాలు ఆ ప్రాంతానికి హుటాహుటీన చేరుకుని చర్యలు చేపట్టాయి. ముందు జాగ్రత్త చర్యగా అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లను రంగంలోకి దించారు. స్నిఫర్ డాగ్‌లతో కూడిన బృందాలు కోర్టు ప్రాంగణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. అటు, ఢిల్లీ హైకోర్టుకు నేడు బాంబు బెదిరింపులు రావడంతో కోర్టు ప్రాంగణంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. హైకోర్టులో బాంబులు పెట్టినట్లు సెక్యూరిటీ సిబ్బందికి బెదిరింపు మెయిల్ వచ్చింది. అగంతకులు పంపిన మెయిల్‌లో హైకోర్టు ఆవరణలో మూడు ప్రదేశాల్లో RDX అమర్చినట్లు పేర్కొన్నారు. బాంబు పెట్టిన నిందితులకు పాక్, ఐసిస్‌తో సంబంధాలున్నట్లు ప్రస్తావించారు. దీంతో ఈ వ్యవహారం మరింత టెన్షన్ క్రియేట్ చేసింది. వెంటనే అలర్ట్ అయిన అధికారులు రంగంలోకి దిగారు. కోర్టు కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. బాంబు బెదిరింపులతో స్థానిక ప్రజలు సైతం తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

అయితే ఇప్పటివరకూ ఎటువంటి అనుమానాస్పద వస్తువును స్వాధీనం చేసుకోలేదు. బెదిరింపు ఈ-మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందో తెలుసుకోవడానికి, దాని వెనుక ఉన్న వారిని గుర్తించడానికి దర్యాప్తు జరుగుతోందని అధికారులు తెలిపారు. 'పవిత్ర శుక్రవారం పేలుళ్లకు పాకిస్థాన్ కుట్ర పన్నింది. జడ్జి గది/కోర్టు ప్రాంగణంలో 3 బాంబులు అమర్చారు. మధ్యాహ్నం 2 గంటలలోపు ఖాళీ చేయండి. మధ్యాహ్నం ఇస్లామిక్ ప్రార్థనల తర్వాత జడ్జి ఛాంబర్ పేలిపోతుంది' అనే సబ్జెక్ట్‌తో సదరు ఈమెయిల్ ఉంది. పంపినవారి ఈ-మెయిల్ ఐడీ 'kanimozhi.thevidiya@outlook.com' గా గుర్తించారు.



## ఉస్మాన్‌సాగర్ గేట్లు ఎత్తివేత.. మూసీలో భారీగా పెరిగిన వరద ఉద్ధృతి

హైదరాబాద్: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద పోటెత్తడంతో ఉస్మాన్ సాగర్ జలాశయం నిండుకుండలా మారింది. దీంతో జలమండలి అధికారులు ఉస్మాన్ సాగర్ (గండిపేట) జలాశయం ఆరు గేట్లను నాలుగు అడుగుల మేర పైకి ఎత్తి 2652 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న మూసీలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలోకి 2000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని అధికారులు తెలిపారు. మరోవైపు గేట్లు ఎత్తడంతో మూసీలో వరద ఉద్ధృతి మరింత పెరిగింది. నార్సింగి, మంచిరేవుల మధ్య ఉన్న కల్వర్టు పైనుంచి ఈ వరద నీరు ప్రవహించడంతో అధికారులు ఇరువైపులా రాకపోకలను నిలిపివేశారు. మూసీలో వరద ప్రవాహం అధికంగా ఉండటంతో మున్సిపల్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు.




## సైదాపూర్‌లో భారీ వర్షం

సైదాపూర్: కరీంనగర్ జిల్లా సైదాపూర్ పరిధిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. న్యాళ చెరువు, ఆకునూరు ఊర చెరువు సహా పలు కుంటలు వరదనీటితో నిండిపోయాయి. దీంతో పలు గ్రామాల్లో పంటపొలాలు నీటమునిగాయి. సోమారంలో ఆదర్శ పాఠశాల పరిసరాలు జలమయమయ్యాయి. అక్కడి వసతి గృహం చుట్టూ మోకాలి లోతు నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని బొమ్మకల్ వద్ద కల్వర్టుపై వరద ఉద్ధృతి అధికంగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
వెనుకేపల్లి తుమ్మలచెరువు మత్తడి పడుతుండడంతో అటువైపు రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైదాపూర్ తహశీల్దార్ శ్రీనివాస్, ఎస్సై తిరుపతి కోరారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం రాత్రి సైదాపూర్‌లో 102 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## మ్యాన్‌హోల్‌లో చిన్నారి పడిపోయిన ఘటన.. స్పందించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్: మ్యాన్‌హోల్ తెరిచిన ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఈవిషయంపై ఉదయం ప్రాథమిక విచారణ చేపట్టామని ఆయన తెలిపారు. మ్యాన్‌హోల్ ఘటనకు హైడ్రా పూర్తి బాధ్యత వహిస్తుందని వెల్లడించారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ ఇన్‌ఛార్జి ఘటనకు బాధ్యుడన్నారు. మ్యాన్‌హోల్ మూత మూసేందుకు అవసరమైన చర్యలు తక్షణమే తీసుకున్నామని తెలిపారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**అసలేం జరిగిందంటే..** యాకుత్‌పుర పరిధి రెయిన్‌బజార్ డివిజన్, మౌలాకా ఛిల్లా బస్తీలో తెరిచి ఉంచిన గుంతలో ఓ చిన్నారి పడిపోయిన ఘటన కలకలం రేపింది. బుధవారం మధ్యాహ్నం 1.30కు గుంతలో పూడికతీత పనులు చేయడానికి హైడ్రా సిబ్బంది మూతను తొలగించారని స్థానిక బల్దియా సహాయ ఇంజినీరు నరేశ్ తెలిపారు. తరువాత మూత సంగతి పట్టించుకోకుండా ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. గురువారం ఉదయం 8.45 గంటలకు పాఠశాలకు వెళుతున్న చిన్నారి అదే దారిలో నడుస్తూ గుంతలో పడిపోయింది. ఆమె తల్లి, స్థానికులు చిన్నారిని గుంతలో నుంచి పైకి లాగారు. గుంత తక్కువ లోతులో ఉండడంతో ప్రాణాలతో బయటపడింది. ఈ వీడియో వైరల్ కావడంతో రెయిన్‌బజార్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు.



మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ నూతన ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకార వేడుకలో హాజరవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఆయన అకస్మాత్తుగా పదవి నుంచి వైదొలగిన తర్వాత, ప్రజల కళ్లకు దూరంగా ఉండటం అనేక సందేహాలకు తావిచ్చింది. అధికారికంగా "ఆరోగ్య సమస్యల"ను

## తనస్థానంలోని పదవికి ప్రమాణస్వీకారం.. హాజరై ఆశ్చర్యపరిచిన జగదీప్ ధనఖడ్

కారణం చెప్పినప్పటికీ, విపక్షాలు మాత్రం కేంద్ర ప్రభుత్వంతో ఉన్న విభేదాలే ఆయన రాజీనామాకు ప్రధాన కారణమని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఆయన మళ్లీ ప్రజల ముందు ప్రత్యక్షమవడం పలు రాజకీయ సంకేతాలను పంపిందని విశ్లేషించవచ్చు.

**ఆరోగ్య వాదనకు బలం చేకూర్చడం...** ధన్‌ఖడ్ తన రాజీనామా సమయంలో చెప్పిన "ఆరోగ్య సమస్యలు" అనే కారణంపై విపక్షాలు అనుమానాలు వ్యక్తం చేశాయి. ఆయన పబ్లిక్‌లో కనిపించకపోవడం ఈ అనుమానాలను మరింత పెంచింది. అయితే, ఇప్పుడు ప్రమాణస్వీకార వేడుకకు హాజరవడం ద్వారా ఆయన శారీరకంగా దృఢంగా, ఆరోగ్యంగా ఉన్నారని ప్రజలకు ఒక సంకేతం పంపారు. దీనివల్ల, ఆయన రాజీనామా వెనుక ఆరోగ్య సమస్యలు ప్రధాన కారణం కాదనే విపక్షాల ఆరోపణలు బలహీనపడ్డాయి. అయినప్పటికీ, రాజీనామా తర్వాత ఎందుకు పూర్తిగా కనిపించలేదనే ప్రశ్న మాత్రం మిగిలిపోయింది.

**కేంద్రంతో విభేదాలు లేవనే సంకేతం...** ధన్‌ఖడ్ రాజీనామా వెనుక జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన వంటి అంశాలపై కేంద్రంతో విభేదాలు ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపించాయి. ఇప్పుడు ఆయన రాష్ట్రపతి భవన్‌లో జరిగిన అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం, అది కూడా ప్రభుత్వ అధిష్టానం మరియు కొత్త ఉ పరాష్ట్రపతి సమక్షంలో కనిపించడం ద్వారా కేంద్ర ప్రభుత్వంతో తనకు పెద్దగా విభేదాలు లేవని, ఇంకా వారి మద్దతుదారుడిగానే ఉన్నానని నిరూపించుకోవడానికి ప్రయత్నించినట్లుగా కనిపిస్తోంది. ఇది విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టడానికి అధికార పక్షానికి కూడా ఒక అవకాశంగా ఉపయోగపడింది.

**రాజకీయ వ్యక్తిత్వంగా కొనసాగుతున్నారనే సంకేతం...** సాధారణంగా పదవి నుంచి వైదొలగిన తర్వాత మాజీ ఉపరాష్ట్రపతులు లేదా ఇతర ప్రముఖులు పూర్తిగా ప్రజల కళ్లకు దూరంగా ఉండటం అరుదు. ధన్‌ఖడ్ చాలా కాలం పాటు అదృశ్యమయ్యారు. అయితే, ఇప్పుడు ఆయన మళ్లీ ప్రజా వేదికలలో కనిపించడం, ముఖ్యంగా ఒక ఉన్నత స్థాయి అధికారిక కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా తాను పూర్తిగా రాజకీయాల నుంచి వైదొలగలేదని, ఒక రాజకీయ వ్యక్తిత్వంగా కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. ఈ హాజరు ఆయన భవిష్యత్తులో మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు ఉన్నాయనే ఊహాగానాలకు కూడా దారితీసింది. ధన్‌ఖడ్ హాజరు కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదు, దాని వెనుక అనేక రాజకీయ సందేశాలు ఇమిడి ఉన్నాయి. ఇది విపక్షాల విమర్శలకు సమాధానం ఇవ్వడమే కాకుండా, తన ఆరోగ్య పరిస్థితిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయడానికి ఉపయోగపడింది. అయితే, ఆయన రాజీనామా వెనుక అసలు కారణాలు ఇప్పటికీ ముసుగులోనే ఉన్నాయి. ఆరోగ్య సమస్యల వల్లనా, లేక రాజకీయ విభేదాల వల్లనా అనే ప్రశ్నకు స్పష్టమైన జవాబు దొరకనప్పటికీ, ఆయన తిరిగి ప్రత్యక్షమవడం భారత రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామంగా చూడవచ్చు. కొత్త ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పదవీ స్వీకరణతో కొత్త అధ్యాయం మొదలవగా, ధన్‌ఖడ్ ప్రత్యక్షం ఆ రాజకీయ నాటకంలో ఒక కొత్త అంశాన్ని జోడించింది.

# పితృఋణం తీర్చడం పుత్రుల కర్తవ్యం - మహాలయ (పితృ) పక్షాలు



బాద్రపద మాసములో కృష్ణ పక్షమును మహాలయ పక్షము అంటారు. ఈ పక్షమున అన్ని వర్గముల వారు తమ పెద్దలు మరణించిన తిథిని బట్టి ఆయా తిథులలో తర్పణ శ్రాద్ధకర్మలు చేయుదురు. ఉత్తరాయణము దేవతల కాలము గనుక ఉత్తమ కాలమని, దక్షిణాయణము పితృకాలము, కనుక అశుభ కాలమని మన పూర్వుల విశ్వాసము. ఈ మహాలయ పక్షములో ప్రతి దినమును గాని, ఒకనాడు గాని శ్రాద్ధము చేయవలెను. అట్లు చేసినవారి పితరులు సంవత్సరము వరకును సంతృప్తులగుదురని స్కాంద పురాణము నాగర ఖండమున ఉంది. సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించగానే పితరులు తమ పుత్ర, పౌత్రుల దగ్గరకు వస్తారని చెప్ప బడింది. మహాలయ అమావాస్య నాడు వారు తమ సంతతి ద్వారం దగ్గరే నిలబడతారు. ఆ రోజు వారికి శ్రాద్ధ కర్మ నిర్వర్తించక పోతే దీవెనకు బదులుగా శపించి వెళ్ళి పోతారు అని పెద్దలు అంటారు. మహాలయ పక్షం/శుద్ధ పూర్ణిమ పితృ పక్షంలో వరుసగా పదిహేను రోజులు పితృ దేవతలు పూజలకు ఉద్దేశించినవి. పితృ దోషం అంటే ఒక శాపం. గత జన్మలో ఎవరైనా వృద్ధులకు కాని, తల్లి తండ్రులకు కాని కష్టం కలిగించి ఉంటే లేదా వ్యక్తికి తీవ్రమైన అనారోగ్య సమస్యలు కష్టాలు కలుగుతూ ఉంటే దానికి కారణం ఆ వ్యక్తి యొక్క తల్లి దండ్రులు లేదా పూర్వీకుల చేత చేయబడిన దోషాలు కారణ మవుతాయి. పూర్వీకులు చేసిన కొన్ని దోషాల వలన వారి తర్వాతి తరం వారు కష్టాల పాలవడం పితృ దోషాలకు గురికావడం జరుగుతుంది. జాతక చక్రంలో ఇటువంటి దోషాలను గుర్తించ వచ్చు. పితృదోషాల వలన అనేక రకాలైన సమస్యలు కలుగు తాయి. ఉదాహరణకు ముఖ్యమైన పనులు పూర్తి కాక ముందే ఆటంకాలు, వైఫల్యాలు ఎదురు కోవడం, గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలగడం. కుటుంబంలో స్త్రీకి చిన్న వయసులో వైధవ్యం ప్రాప్తించడం, కుటుంబం లోని వ్యక్తికి మానసిక స్థితి సమతుల్యత లేకుండా ఉండడం, ముఖ్యంగా సంతానా భాగ్యం లేక పోవడం, పుట్టిన సంతానం జీవించక పోవడం, సంతానం వలన తీవ్ర సమస్యలు వంటివి. ప్రతి మనిషీ తన జీవితంలో పితృఋణం తీర్చాలి. దీనివలన పితరులు తృప్తి చెందుతారు. వారికి ముక్తి లభిస్తుంది. తమ సంతానం పితృ ఋణం తీర్చక పోతే వారికి ముక్తి లభించదు. మహాలయ పక్షం రోజుల్లో వారసులు వదిలే తర్పణాలు పితృ దేవతలకు ఆకలి దప్పులు తీరుస్తాయి. సంతృప్తి చెందిన పితృ దేవతలు ఆశీర్వాదం వంశీకుల ఉన్నతికి కారక మవుతుంది. ఈ పక్షం రోజుల్లో ఇతర శుభ కార్యాలేవి ఆరంభం చేయ కూడదు. మహాలయ అమావాస్య రోజున తర్పణ కార్యక్రమం చేశాక దేవతా పూజలకు శ్రీకారం చుట్టాలి. ఈ పక్షం రోజుల్లో శ్రాద్ధ కర్మ నిర్వర్తించటం చేత పితరులకు తృప్తి కలుగుతుంది. భాద్రపద బహుళ పాడ్యమి నుండి అమావాస్య వరకు ఊర్ధ్వరశ్మి నుండి పితృప్రాణం భూమిపై వ్యాపించి ఉంటుంది. పితరులను ఉద్దేశించి, వారి ఆత్మను తృప్తి పరచటానికి శ్రద్ధతో అర్పించేదే శ్రాద్ధం. ఆత్మ శరీరాన్ని వదిలి వెళ్ళాక దాని సూక్ష్మాతి సూక్ష్మ అంశం అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది. వారి వారి కర్మాను సార ఫలం లభిస్తుంది. పితృ ఋణం నుండి ముక్తి పొందటం చాలా కష్టం. తల్లి దండ్రులు సంతానం కోసం ఎంత తపిస్తారో వెల కట్టడం సాధ్యం కాదు. పితృ గణాల శ్రాద్ధ కర్మ గౌరవ ప్రదంగా చేయటం సంతానం తప్పని సరి విధి. శ్రాద్ధ కాలం ప్రారంభమైందని తెలియగానే పితృదేవతలు తమ తమ వారిని స్మరించుకుంటూ మనోమయ రూపంలో శ్రాద్ధ స్థలం చేరుకుంటారు. నిజానికి, ప్రతి మాసంలోను అమావాస్య, పితరుల పుణ్య తిథిగా భావించ బడినా, మహాలయ అమావాస్యకు విశేష ప్రాముఖ్యత ఉంటుంది. ఆ రోజు సమస్త పితృ దేవతా విసర్జనం జరుగుతుంది. తమ పితరుల పుణ్య తిథి వివరాలు తెలియని వారు, పితృ పక్షంలో ఆ తిథి నాడు కారణ వశాన శ్రాద్ధం పెట్టలేని వారు మహాలయ అమావాస్య నాడు శ్రాద్ధం, దానం, తర్పణం చేస్తారు. ఎవరూ శ్రాద్ధ విముఖులు కాకూడదు. శ్రాద్ధ మహిమను శాస్త్రాలు విస్తృతంగా పేర్కొన్నాయి. శ్రాద్ధం చేయటం వల్ల సంతానం ప్రాప్తిస్తుందని స్కాంద పురాణంలో చెప్ప బడింది. ఆదర పూర్వకంగా శ్రాద్ధ కర్మతో సంతోష పెడితే వారు తమ సంతత వారి ఆయువు, విద్య, ధనం, సంతానం, సమస్తం కలిగి ఉండేట్టు ఆశీర్వదిస్తారు. శ్రాద్ధ కర్మలో నువ్వులు, గూడ మిశ్రిత అన్నం సమర్పించిన దానం అక్షయం అవుతుంది. అన్ని దానాల లోను అన్న దానం ప్రధానమైనది. అన్న దానం ఎప్పుడు చేసినా మంచి ఫలితాన్నే ఇస్తుంది. కాని ఈ మహాలయ పక్షంలో చేసే అన్నదానం వలన అనంత కోటి యజ్ఞ ఫలితం ప్రాప్తిస్తుంది. ఏ రోజు శ్రాద్ధ కర్మ చేస్తే ఎటువంటి ఫలితం లభిస్తుందని వివిధ పురాణాల ఆధారంగా తెలుస్తుంది. ప్రతి సంవత్సరం చేసే శ్రాద్ధం కన్నా అతి ముఖ్యమైన శ్రాద్ధాలు ఈ మహాలయ పక్షం పదిహేను రోజులు చేయలేని వారు ఒక్క మహాలయమైన చేసి తీరాలి. ఆర్థిక ఆభావం వలన విద్యుక్తంగా శ్రాద్ధ కర్మలు చేయలేక పోతే, పితృ పక్షంలో కేవలం శాకంతో శ్రాద్ధం చేయవచ్చు. అది కూడా వీలు కాక పోతే గోవుకు గ్రాసం పెట్టవచ్చు, అదీ చేయలేని వారు ఒక నిర్జన ప్రదేశంలో నిల్చొని అపరాన్న సమయంలో రెండు చేతులు ఆకాశం వైపు పైకి ఎత్తి, పితృ దేవతలకు నమస్కరించ వచ్చు. శ్రాద్ధ కర్మ చేత పితృ దేవతలకు సంతృప్తి కలిగించిన వ్యక్తికి భౌతికంగా సుఖ సంతోషాలు, పరలోకంలో ఉత్తమ గతులు లభిస్తాయని శాస్త్రాల ద్వారా తెలుస్తోంది. **రామకిష్టయ్య సంగనభట్ల...9440595494**

# ప్రాణ రక్షణలో ప్రాథమిక చికిత్స ప్రాముఖ్యత




.ప్రపంచంలో ప్రతి రోజూ అనేక ప్రమాదాలు, సహజ విపత్తులు, రోడ్డు ప్రమాదాలు, గుండెపోటులు, కాలిన గాయాలు, మూర్ఛలు, నీటిలో మునిగే సంఘటనలు వలన అనేక ప్రాణాలు ముప్పుకు గురవుతుంటాయి. అలాంటి సమయంలో వైద్య సహాయం తక్షణమే అందుబాటులో ఉండకపోవచ్చు. ఆసుపత్రి లేదా వైద్యుడు చేరే వరకు గాయపడిన వారికి కనీస సంరక్షణ అందించేది ప్రాథమిక చికిత్స. ప్రాథమిక చికిత్స వల్ల ప్రాణాన్ని నిలబెట్టుకోవడం మాత్రమే కాకుండా గాయపడిన వారి స్థితి మరింత దిగజారకుండా నివారించడం కూడా సాధ్యమవుతుంది. అందువల్ల ప్రథమ చికిత్స ప్రతి పౌరుడు నేర్చుకోవలసిన నైపుణ్యం. ఈ అవగాహన పెంచి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను శిక్షణ కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ రెండవ శనివారం ప్రపంచ ప్రాథమిక చికిత్స దినోత్సవం జరుపుకుంటారు. ఈ ఏడాది అది సెప్టెంబర్ 14న జరగనుంది. ఈ దినోత్సవాన్ని 2000వ సంవత్సరంలో అంతర్జాతీయ రెడ్‌క్రాస్ మరియు రెడ్ క్రెసెంట్ సొసైటీల సమాఖ్య ప్రారంభించింది. లక్షలాది మంది తక్షణ సహాయం అందక ప్రాణాలు కోల్పోతున్నారని గమనించి ఈ కార్యక్రమాన్ని ప్రపంచ స్థాయిలో చేపట్టారు. ప్రాథమిక చికిత్స అనేది కేవలం గాయాన్ని కడిగి కట్టడమే కాదు. గుండె ఆగిపోతే కార్డియోపల్మోనరీ రీససిటేషన్ (%జూ=%) చేయడం, ఊపిరాడక ఇబ్బంది పడుతున్నవారికి సహాయం చేయడం, తీవ్రమైన రక్తస్రావాన్ని ఆపడం, ఎముకలు విరిగితే కదలకుండా ఉంచడం, షాక్‌లోకి వెళ్ళినవారిని వెచ్చగా ఉంచడం వంటి ఎన్నో చర్యలు ఇందులో భాగమవుతాయి. ఈ చర్యలు సరైన సమయంలో తీసుకుంటే ప్రాణరక్షణ సాధ్యం అవుతుంది. ప్రపంచ ప్రాథమిక చికిత్స దినోత్సవం ప్రతి ఏడాది ఒక అంశంపై దృష్టి సారిస్తుంది. స్కూల్ ఫస్ట్ ఎయిడ్, రోడ్డు భద్రత, కమ్యూనిటీ ఫస్ట్ ఎయిడ్, పిల్లలు, వృద్ధుల సంరక్షణ, సహజ విపత్తుల్లో తక్షణ చికిత్స వంటి అంశాలను ఇప్పటివరకు ప్రాధాన్యంగా తీసుకున్నారు. 2025లో ఈ దినోత్సవం కొత్త సాంకేతిక పద్ధతులు, డిజిటల్ అవగాహన, యువత భాగస్వామ్యంపై దృష్టి కేంద్రీకరించింది. సమాజంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక స్థాయిలో అయినా ప్రాథమిక చికిత్స శిక్షణ పొందేలా చేయడం, అత్యవసర పరిస్థితుల్లో భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి సహాయం చేయగలిగే సామాజిక స్ఫూర్తిని పెంపొందించడం దీని లక్ష్యం. భారతదేశంలో ప్రాథమిక చికిత్స అత్యవసరత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల వలన సుమారు 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. వీరిలో గణనీయమైన వంతు తక్షణ వైద్య సహాయం అందకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు. సరైన సమయంలో ప్రథమ చికిత్స అందితే ఈ సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు. భారత రెడ్‌క్రాస్ సొసైటీ, అనేక స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది, గ్రామీణ ప్రజలకు కూడా ప్రాథమిక చికిత్స శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ ఈ శిక్షణ ప్రతి ఇంటివరకు చేరేలా చేయడం అత్యవసరం. ప్రతి ఇంటిలో, ప్రతి వాహనంలో, ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి. ప్రాథమిక చికిత్స అనేది కేవలం వైద్యులకే పరిమితం కాదు. ప్రతి పౌరుడు నేర్చుకోవలసిన ప్రాణరక్షణ నైపుణ్యం ఇది. ఒక్క చిన్న చర్య సరైన సమయంలో తీసుకుంటే ఒక ప్రాణాన్ని కాపాడవచ్చనే స్ఫూర్తి సమాజంలో వ్యాప్తి చెందాలి. ఒక ప్రాణాన్ని కాపాడే సామర్థ్యం ప్రతి ఒక్కరిలో ఉండాలన్న అవగాహన పెరిగితేనే సమాజం మరింత సురక్షితంగా ఉంటుంది. అందుకే "ప్రతి ఇంట్లో ఒక ప్రథమ చికిత్స నిపుణుడు" ఉండాలని పిలుపునిస్తూ సెప్టెంబర్ 14న జరుపుకునే ప్రపంచ ప్రాథమిక చికిత్స దినోత్సవం మనందరికీ సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుంది. ఇది కేవలం ఒక రోజు గుర్తింపు మాత్రమే కాదు, ప్రతి రోజూ అవసరమయ్యే జీవన శైలి. ప్రథమ చికిత్సను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి, ఆచరించాలి, తద్వారా విలువైన ప్రాణాలను రక్షించగల సామాజిక శక్తిని పెంపొందించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**


# నేపాల్ దేశంలో అనూహ్య సంక్షోభం



నేపాల్ చరిత్రలో 239 ఏళ్లపాటు కొనసాగిన రాచరిక పాలన దేశ రాజకీయాలను ఒకే వంశాధిపత్యం కింద కట్టిపడేసింది. ఆ కాలంలో రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య అవకాశాలు లేకపోవడంతో ప్రజల వాణి నిశ్శబ్దంలో నలిగిపోయింది. 2008లో రాజ్యాన్ని అధికారికంగా రద్దు చేసి ప్రజాస్వామ్య గణతంత్రాన్ని ప్రకటించడంతో కొత్త దశ ఆరంభమైనప్పటికీ, గత 27 ఏళ్ల ప్రజాస్వామ్య ప్రయాణం మాత్రం స్థిరత్వాన్ని అందించలేక పోయింది. ప్రధానులు వరుసగా మారిపోవడం, కూటమి ప్రభుత్వాలు కూలిపోవడం, అంతర్గత విభేదాలు పెరగడం ప్రజల్లో తీవ్ర నిరాశను కలిగించాయి. కేవలం రెండు దశాబ్దాల్లోనే 13 కంటే ఎక్కువ ప్రధానులు పదవిలోకి వచ్చి వెళ్లడం రాజకీయ అస్థిరతకు బలమైన సాక్ష్యం. మావోయిస్టు తిరుగుబాట్లు, వర్గపోరాటాలు, సైన్యపు పాత్రపై అనుమానాలు ఈ సంక్షోభాన్ని మరింత పెంచాయి. ప్రజా ఉద్యమాల సమయంలో సైన్యం కీలక పాత్ర పోషించినప్పటికీ, తాజాగా జరిగిన సంఘటనల్లో ప్రభుత్వ భవనాలు, పార్లమెంట్, జైళ్లపై దాడులు జరుగుతున్నా సైన్యం ప్రేక్షకపాత్రలో మిగిలిపోవడం విశ్లేషకుల సందేహాలకు కారణమైంది. కేవలం 34 గంటల వ్యవధిలో ప్రభుత్వం కూలిపోవడం వెనుక బాహ్య శక్తుల పరోక్ష ప్రమేయం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. గత 27 ఏళ్లలో ప్రభుత్వం 28 సార్లు మారడం ఒక భయానక రాజకీయ అస్థిరతకు ప్రతీక. ప్రజాస్వామ్యం పేరుతో ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేకపోవడం వల్ల రాజకీయ వ్యవస్థపై నమ్మకం క్షీణిస్తోంది. ఆర్థిక రంగంలోనూ ఈ అస్థిరత తీవ్ర ప్రతికూలతను మిగిల్చింది. స్థూల ఉత్పత్తి పెరుగుదల నిలకడగా కొనసాగక పోవడం, నిరుద్యోగం పెరగడం, లక్షలాదిమంది యువకులు విదేశాలకు వలస వెళ్ళడం సమస్యలను మరింత తీవ్రతరం చేశాయి. పెట్టుబడులు నిలిచిపోవడం, అభివృద్ధి ప్రాజెక్టులు అర్థాంతరంగా ఆగిపోవడం ప్రజలకు మరో భారం అయ్యింది. అంతే కాకుండా నేపాల్ భూభౌగోళిక పరిస్థితి, భారతదేశం – చైనా వ్యూహాత్మక పోటీలు కూడా ఈ సంక్షోభంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఇరు దేశాలు తమకు అనుకూలమైన శక్తులను మద్దతు ఇస్తూ నేపాల్ అంతర్గత రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం సోషల్ మీడియా వేదికలను నియంత్రించే ప్రయత్నం మరింత భగ్గుమన్నది. సెప్టెంబర్ తొలి వారంలో ప్రభుత్వం 26 సోషల్ మీడియా యాప్‌లను నిషేధించగా, ఇప్పటికే అసంతృప్తితో ఉన్న యువత పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టింది. కాఠ్మాండు సహా అనేక ప్రాంతాల్లో ఘర్షణలు చెలరేగాయి. పోలీసులు లాఠీచార్జీలు, టియర్‌గ్యాస్, రబ్బరు బుల్లెట్లు వాడగా నిరసనలు మరింత హింసాత్మక మయ్యాయి. ప్రభుత్వ భవనాలు, జైళ్లపై దాడులు జరిగి, ఖైదీలు తప్పించుకోవడం పరిస్థితిని మరింత కల్లోలంలోకి నెట్టింది. ఈ ఘర్షణల్లో 20 నుండి 30 మంది వరకు ప్రాణాలు కోల్పోగా, 600 నుండి 1000 మందికి పైగా గాయపడ్డారు. వందలాది మంది అరెస్టయి వ్యాపారం, రవాణా, ప్రజా జీవనం పూర్తిగా స్థంభించి పోయింది. ఈ పరిణామాల మధ్య ప్రధానమంత్రి కె.పీ. శర్మ ఓలి రాజీనామా చేయవలసి వచ్చింది. అలాగే చాలామంది ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేయడం, కొందరు నేపాల్ నుంచి క్షణాల్లో తప్పించుకు వెళ్లడం యాదృచ్ఛికంగా కాక, అనివార్యంగా జరిగాయి. మాజీ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సుశీలా కర్కీని మధ్యంతర ప్రధానిగా నియమించాలని ప్రజలు డిమాండ్ చేశారు. పరిస్థితులు అదుపు తప్పడంతో నేపాల్ ఆర్మీ కీలక భవనాల భద్రతను స్వాధీనం చేసుకుని కాఠ్మాండు వీధుల్లో సైనిక గస్తీలు పెంచింది. ఈ ఉద్యమం కేవలం సోషల్ మీడియా నిషేధానికి వ్యతిరేకంగా మాత్రమే కాక, అవినీతికి వ్యతిరేకంగా వ్యవస్థ మార్పు కోసం జరుగుతున్న పోరాటంగా పరిణమించింది. ముఖ్యంగా యువతలో రాజకీయ నాయకత్వం అవినీతిపరమైందన్న భావన బలపడింది. పారదర్శకత లేకపోవడం, ఎన్నికల ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందన్న ఆరోపణలు పెరిగాయి. అందువల్లే ఈ ఉద్యమాన్ని 2006లో జరిగిన "జన ఆందోళన్"తో పోలుస్తున్నారు. ఆ సమయంలో రాజు గ్యానేంద్ర పాలనను ప్రజలు కూలదోయగా, ఇప్పుడు అదే తరం మరోసారి మార్పు కోసం వీధుల్లోకి రావడం చరిత్రాత్మకంగా భావించబడుతోంది. అంతర్జాతీయ వేదికలపై కూడా నేపాల్ పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. భారతదేశం ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ శాంతియుత పరిష్కారం కోరింది. చైనా సరిహద్దు భద్రత కోసం నేపాల్‌లో స్థిరత్వం అవసరమని స్పష్టం చేసింది. అమెరికా, యూరోపియన్ యూనియన్ నిరసనకారుల స్వేచ్ఛను గౌరవించాలని, బలప్రయోగం ఆపాలని హెచ్చరించాయి. ఐక్యరాజ్యసమితి అవసరమైతే మానవహక్కుల కమిషన్ ద్వారా విచారణ జరిపేందుకు సిద్ధమని ప్రకటించింది. సార్క్ దేశాలు ఈ సంక్షోభం ప్రాంతీయ శాంతి భద్రతపై ప్రభావం చూపకుండా చర్చలు జరపాలని సూచించాయి. భవిష్యత్తులో నేపాల్ ముందున్న సవాళ్లు విస్తారమైనవే. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేసి పారదర్శక ఎన్నికలు జరపడం అత్యవసరం. నిరసనల్లో జరిగిన ప్రాణనష్టం, పోలీసు దౌర్జన్యాలపై న్యాయపరమైన విచారణ తప్పనిసరి. యువత అభిప్రాయాలను గౌరవిస్తూ వారిని పాలనా ప్రక్రియలో భాగస్వామ్యం చేయడం అవసరం. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడం, ప్రజల నమ్మకాన్ని తిరిగి సాధించడం కీలకం. ఈ క్రమంలో పొరుగు దేశాలు, అంతర్జాతీయ సమాజం సహకరించాల్సిన అవసరం ఉంది. ఈ సంక్షోభం నేపాల్‌లో తరాల మార్పుకు సంకేతం. ఇది కేవలం ఒక ప్రభుత్వ పతనం కాదుబీ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలనే, అవినీతిని నిర్మూలించాలనే, యువతకు కొత్త భవిష్యత్తును అందించాలనే సామాజిక ఆకాంక్షను ప్రతిబింబిస్తోంది. సైన్యం తాత్కాలిక భద్రతా బాధ్యతలు చేపట్టినా ప్రజాస్వామ్య వ్యవస్థ పునరుద్ధరణే ఈ ఉద్యమానికి తుదిలక్ష్యం. అంతర్జాతీయ సహకారం, ముఖ్యంగా భారతదేశం మద్దతుతో నేపాల్ మరోసారి స్థిరమైన ప్రజాస్వామ్యాన్ని సాధించాలి.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# సోషల్ మీడియాతో రెండు రోజులలో నలుగురు పీఎంలు రాజీనామా !




సోషల్ మీడియా పవర్ ఏంటో తెలుస్తోందా లేక దాని ప్రభావాన్ని అంచనా వేయడంలో విఫలం చెందుతున్నారా తెలియదు కానీ ఇది అక్షరాల నిజం. ఏకంగా రెండు రోజుల వ్యవధిలో నలుగురు ప్రధాన మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు అంటే సోషల్ మీడియా పదునైన కత్తి అని అర్థం అవుతూనే ఉంది. నిజానికి సోషల్ మీడియా అంటే లైట్ తీసుకున్న వారికి సైతం ఇపుడు అది ఎంత శక్తివంతమైనదో పూర్తిగా బోధపడింది అని అంటున్నారు.

**నేపాల్ ని వణికించేలా :** ప్రభుత్వాలు పాలకులు కనుక ఉదాశీనంగా వ్యవహరించినా లేక చూసీ చూడనట్టుగా నిర్లక్ష్యంగా పోయినా కూడా అసలు ఊరుకునే తరం ఈ రోజు లేదు. మరీ ముఖ్యంగా సోషల్ మీడియా సైన్యం ఏ మాత్రం స్పేర్ చేయదు అని అంటున్నారు. జనరేషన్ జెడ్ ముందు ఎవరైనా ఎంతటి వారు అయినా కుప్ప కూలిపోతారు అని చెప్పడానికి తాజా ఉదాహరణ నేపాల్ లో ప్రభుత్వం నేలమట్టం కావడం. ఏకంగా దేశ ప్రధాని తన పదవికి రాజీనామా చేసి దేశమే విడిచిపోవడం. సలసల మండే నెత్తురు లాంటి జనరేషన్ జెడ్ తో పెట్టుకుంటే ఏమవుతుందో కళ్ళకు కట్టినట్లుగా నేపాల్ ఉదంతంతో ప్రపంచం చూసింది అని అంటున్నారు

**ప్రధానులనే తరిమి కొడుతున్నారు :** ఇది వింత పోకడ లేక కొత్త దూకుడా అన్నది కనుక కాస్తా పక్కన పెడితే జనరేషన్ జెడ్ వీర ప్రతాపం ఇది అని చెప్పక తప్పదు. తరాల మధ్య అంతరాలు ఎంత ఉన్నా ఇంత స్పీడ్ ని చూసిన తరం అయితే ఇప్పటిదాకా ప్రపంచంలో ఎక్కడా లేదు. కానీ తొలిసారి చూసింది. దేశ ప్రధానులనే తరిమి కొట్టిన అరుదైన సందర్భాన్ని కూడా కళ్ళారా చూసింది. అసలు ఈ విధంగా ప్రపంచంలో పరిస్థితులు కానీ పరిణామాలు కానీ మారాయి అంటే ఏమి జరుగుతోంది సోషల్ మీడియా జనరేషన్ ఎంత బలమైనది అన్నది ఆలోచించాల్సిందే అని అంటున్నారు.

**యువత ఒక సునామీ :** యువతరాన్ని తక్కువ అంచనా వేయరాదు. అందునా జనరేషన్ జెడ్ అంటేనే కొత్త ప్రపంచం. ఏలికలకు వారితో కనెక్షన్ ఎంత వరకూ ఉంది అన్నది కూడా తెలియదు. అంతే కాదు ఒక బిగ్ గ్యాప్ అన్నది ఉంది. ఈ వ్యత్యాసాల మధ్య తరాల అంతరాల మధ్య వారి భావనలను కనుక సరిగ్గా అర్థం చేసుకోకపోతే మాత్రం ఏకంగా కొంపలు కావు, దేశాలే అంటుకుపోతాయి. దానికి నిట్ట నిలువు ఉదాహరణయే నేపాల్ మారణ కాండ.

**వీటి విషయంలో అలెర్ట్ :** ఇక నిరుద్యోగ సమస్య ప్రపంచంలో ఉంది. అయితే ఎక్కువ తక్కువలు చూసుకోవాలి. యువతలో అశాంతికి ఇక్కడే బీజం పడుతుంది. ఖాళీగా ఉన్న వారు చేసే పనులు ఎవరూ ఊహించలేరు సమాజానికి ఎంతో శక్తిగా ఉండాల్సిన యువత కనుక ఏ పనీ లేకుండా ఉంటే ఆ పాపం నేరం సమాజానిదే. అంతే కాదు ఏలిన వారిదే ఆ నేరం అవుతుంది. అందుకే ఏ దేశంలో పాలకులు అయినా పూర్తిగా నిరుద్యోగ సమస్యను అడ్రస్ చేయాల్సి ఉంటుంది. లేకపోతే మాత్రం యువతరం ఆగ్రహం కట్టలు దాటుతుంది. అది సునామీనే తలపిస్తుంది అని చెప్పాలి అంతే కాదు అవినీతి అక్రమాలను ఆ తరం అసలు ఊహించలేదు, ఏ మాత్రం సహించలేదు, తట్టుకోలేదు కూడా. దాంతో దాని మీద కూడా అంతా బాగానే ఉంది ఎవరూ ఏమీ అనుకోరులే అని విచ్చలవిడితనం చేస్తే తగిన శాస్తి చేసేందుకు నవతరం ఎపుడూ సిద్ధంగా ఉంటుంది.

**తిరగబడితే బడిత పూజే :** యువత పైకి ప్రశాంతంగా కనిపించే సముద్రంలోని బడబాగ్ని లాంటి వారు. అది ఎపుడు ప్రజ్వరిల్లుతుందో ఎవరికీ తెలియదు. ఆ నిప్పుని ఏ నీరూ ఆపలేదు సరికాదా లావా మాదిరిగా విరుచుకుపడే ఆ అగ్ని కీలక ముందు మాడి మాసి అయిపోతారు. ఇపుడు నేపాల్ లో అదే జరుగుతోంది. ఇక చూస్తే కేవలం రెండు రోజుల వ్యవధిలో నేపాల్, ఫ్రాన్స్, జపాన్, థాయిలాండ్ ఇలా నలుగురు ప్రధానులు తమ పదవులు వదులుకున్నారు. ఇదంతా సోషల్ మీడియా అధికార పీఠాల మీద కసిగా కొట్టిన అతి పెద్ద చావు దెబ్బగా అభివర్ణిస్తున్నారు. ఇది ఇక్కడితో ఆగుతుందా రానున్న రోజులలో ఎన్ని దేశాలలో ఇలాంటి సంఘటనలు చూడాల్సి వస్తుందో ఎవరూ చెప్పలేరు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే తాము పై నుంచి దిగి వచ్చిన దేవతలమని ఎవరూ భావించుకోకూడదు, తాము ప్రజలకు సేవ చేసే వారమని గుర్తించి మంచి పనులు చేయాలి, అభివృద్ధికి అంకితం కావాలి. లేకపోతే పీఠాలే కాదు దేశాలనే తెచ్చి అగ్గిలో కడిగేస్తుంది జనరేషన్ జెడ్. తస్మాత్ జాగ్రత్త.

చురకలు

## సంపాదకీయం

# అగ్రరాజ్యంలో ఐఫోన్ పై వ్యతిరేకత.. ఎందుకంటే?

ఐఫోన్.. ప్రతి సామాన్యుడు కల.. నిజానికి ఆండ్రాయిడ్ ఫోన్ లలో ఎన్నో అధునాతన ఫీచర్లు అందుబాటులోకి వచ్చినా.. చాలామంది మాత్రం ఐఫోన్ ను ఒక అందనంత ద్రాక్ష లాగే చూస్తూ ఉంటారు. ఐఫోన్ ని సొంతం చేసుకోవాలని ఎన్నో ప్రయత్నాలు కూడా చేస్తూ ఉంటారు. సాధారణంగా పల్లెటూర్లలో ఎవరి దగ్గరైనా ఐఫోన్ ఉందంటే వామ్మో అని వింతగా చూసిన సందర్భాలు కూడా ఇప్పటికీ తారస పడుతూనే ఉంటాయి. అంత డిమాండ్ తెచ్చుకున్న ఐఫోన్ కి ఇప్పుడు అగ్రరాజ్యంలో వ్యతిరేకత ఏర్పడుతుండడంతో అందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచ దేశాలలో అగ్రరాజ్యంగా పేరు సొంతం చేసుకున్న అమెరికాలో ఇప్పుడు ఐఫోన్ పై వ్యతిరేకత తీవ్రస్థాయిలో నెలకొంది. ఉన్నట్టుండి ఇలా వ్యతిరేకత ఏర్పడడానికి గల కారణం ఏమిటి అనే విషయానికి వస్తే.. ఏ దేశంలో అయినా సరే ఐఫోన్ కొత్త సిరీస్ వస్తుందంటే.. ఆ హడావిడి మామూలుగా ఉండదు. ఫోన్ ను దక్కించుకునేందుకు కస్టమర్లు ముందు రోజు రాత్రి నుంచే షాపుల ముందు పడిగాపులు కాసిన దృశ్యాలు కూడా ఎన్నో ఉన్నాయి. అందులో భాగంగానే ఎప్పటిలాగే ఇప్పుడు ఐఫోన్ 17 సిరీస్ ఘనంగా లాంచ్ అయ్యింది. దీంతో ఆపిల్ పార్కులో ఒకటే హంగామా.. మరికొన్ని రోజుల్లో బుకింగ్స్ కూడా మొదలవుతున్నాయి. అలా సెప్టెంబర్ 19 నుంచి మార్కెట్లోకి అందుబాటులోకి రాబోతున్న ఈ ఐఫోన్ 17 సిరీస్ ధరలు కూడా భారీగానే ఉండనున్నాయి. ఇకపోతే ఇదంతా బాగానే ఉన్నా.. ఇప్పుడు మాత్రం అమెరికా నుంచి ఎక్కువగా ఈ ఐఫోన్ 17 సిరీస్ ఫోన్స్ పై ఆసక్తి చూపించడం లేదు అనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి కారణం కూడా లేకపోలేదు.. విషయంలోకి వెళ్తే.. ఆపిల్ చరిత్రలోనే తొలిసారి నాజూకైనా ఫోన్ ను రిలీజ్ చేస్తున్నట్టు ఐఫోన్ ప్రకటించింది. దీనికి 'ఐఫోన్ ఎయిర్' అని పేరు కూడా పెట్టారు. ఇది చూడడానికి స్లిమ్ గానే ఉన్నప్పటికీ బ్యాటరీ లైఫ్ మాత్రం కంపెనీ చెబుతున్న రేంజ్ లో లేదు అనేదే ప్రధాన ఆరోపణ. ఆల్ డే బ్యాటరీ లైఫ్ అని ఆపిల్ చెబుతోంది. కానీ గట్టిగా వాడితే నాలుగు గంటలకు మించి చార్జింగ్ రావడం లేదు అని వాషింగ్టన్ పోస్ట్ తన రివ్యూ లో చెప్పుకొచ్చింది. దీనికి తోడు చరిత్రలోనే తొలి నాజూకైనా ఫోన్ అని ప్రకటించడంతో.. ఇప్పటికే ఎన్నో కంపెనీలు ఈ సైజు కంటే అతి సన్నని రేంజ్ లోనే ఫోన్లను అందుబాటులోకి తీసుకొచ్చాయని దీనిపై సెటైర్లు కూడా వేస్తున్నాయి. నిజానికి ఈ ఐఫోన్ 17 సిరీస్ నుండి ఫోల్డబుల్ మోడల్ వస్తుందని అందరూ భావించారు. కానీ స్లిమ్ మోడల్ వస్తుందని ఎవరు ఊహించలేకపోయారు. పైగా శాంసంగ్ కి పోటీగా ఫోల్డ్ చేసుకునే ఐఫోన్ వస్తుందని ఎంతో మంది ఎదురు చూసినా.. అది జరగకపోయేసరికి యూఎస్ యూజర్ లందరూ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై శాంసంగ్ కూడా పరోక్షంగా సెటైర్లు వేసింది. ఇకపోతే అమెరికాలో ఈ ఆపిల్ ఐఫోన్ లపై వ్యతిరేకత ఏర్పడడానికి మరో కారణం కూడా ఉంది. అదేంటంటే ఐఫోన్ 17 సిరీస్ లో ప్రో మాక్స్ ను తమ ఫ్లాగ్ షిప్ మోడల్ గా ప్రకటించింది. కానీ ఈ మోడల్ వెనుక భాగం చూస్తే మాత్రం గూగుల్ పిక్సెల్ ఫోన్ ను తలపిస్తోంది. దీంతో విమర్శలు చెలరేగుతున్నాయి. ధరల శ్రేణి పై ఎప్పటిలాగే విమర్శలు వస్తున్నా.. ఏఐ ఆధారిత ఫీచర్స్ చూపించి ధరలు ఇంకాస్త పెంచారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తానికైతే ఐఫోన్ మోడల్స్ పై ఈసారి అమెరికాలో ప్రశంసల కంటే విమర్శలు ఎక్కువ వినిపిస్తున్నాయి. మరి ఇప్పటికైనా ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని.. ఆపిల్ వినూత్నంగా ఆలోచనలు చేస్తుందేమో చూడాలి. ఏది ఏమైనా టెక్ చరిత్రలో ఇలా తొలిసారి ఐఫోన్లపై వ్యతిరేకత నెలకొనడం నిజంగా ఆశ్చర్యకరమని చెప్పవచ్చు.

# మన సుకవి... మనసు కవి ఆత్రేయ - సెప్టెంబర్ 13...ఆచార్య ఆత్రేయ వర్ధంతి




1921 మే 7 న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సూళ్ళూరుపేట మండలంలో గల మంగళంపాడు గ్రామంలో ఆత్రేయ జన్మించారు. తండ్రి కృష్ణమాచార్యులు. తల్లి సీతమ్మ. చిన్నప్పటినుండి నాటకంలోని పద్యాలను రాగయుక్తంగా చదివేవారు. సమాజంలో మధ్య తరగతి కుటుంబ సమస్యలను తీసుకుని మనోహరమైన నాటకాలుగా మలిచారు. 'ప్రవర్తన', 'ఎన్.జి.వో' నాటకాలు ఆంధ్ర నాటక కళా పరిషత్ అవార్డులను గెలుచు కున్నాయి. విశేషంగా రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రదర్శనలు జరిగాయి. అలాగే 'కప్పలు' బాగా ప్రాచుర్యం పొందిన నాటకం. రాయలసీమ క్షామ పరిస్థితులను వివరించే 'మాయ' నాటకం, స్వాతంత్ర్యానంతరం దేశంలో చెలరేగిన హిందూ ముస్లిం హింసాకండను 'ఈనాడు' అనే మూడంకాల నాటకం, విశ్వశాంతిని కాంక్షించే 'విశ్వశాంతి' నాటకాన్ని రచించారు. విశ్వశాంతి నాటకానికి కూడా రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. 'సామ్రాట్ అశోక', 'గౌతమ బుద్ధ', 'భయం' నాటకాలు కూడా వ్రాసారు. ఆత్రేయ పలు చలన చిత్రాలకు సంభాషణలు, పాటలు రాశారు. ఆయన పాటలలో ఎక్కువగా మనసుకు సంబంధించిన ప్రస్తావన ఉండటం వలన అతను మనసు కవి, మన సుకవి అయ్యారు. దీక్ష (1950) చిత్రానికి తొలిసారి గీత రచన, అదే సంవత్సరంలో విడుదలైన సంసారం చిత్రానికి తొలిసారి కథా రచన చేసారు. వాగ్దానం (1961) చిత్రాన్ని నిర్మించి, దర్శకత్వం కూడా చేసాడు. చిన్ని చిన్ని పదాలతో స్పష్టమైన భావాన్ని పలికించడంలో ఆత్రేయ ఘనాపాఠి. తెలుగు పాటను ఆస్వాదించే అందరి మనసులను దోచుకున్న ఈ మనసు కవి 1989, సెప్టెంబర్ 13 న ఈ లోకాన్ని వదిలి పోయారు. ఆత్రేయ తాత్విక ధోరణితో రాసిన సంభాషణలు జీవిత తత్వాన్ని గుట్టు విప్పుతాయి. జీవితాన్ని కాచి వడబోసిన నగ్నసత్యాలు. ప్రతి వ్యక్తి జీవితానికి మార్గ దర్శకాలు. "వెలుగు నీడలు" చిత్రంలో ఇటువంటి ఓ అద్భుత సంభాషణ తనదైన శైలిలో రాసి ఓ సన్నివేశానికి ఆత్రేయ జీవం పోసారు. సెంటిమెంటల్ అనే పదానికి భావగర్భితమైన, కరుణ రసముగల, శృంగార భావములుగల అర్థాలున్నాయి. సినిమా పరిభాషలో సెంటిమెంటల్ డైలాగ్స్ అంటే పరస్పర ప్రేమాను రాగాలను, ఆత్మీయానుబంధాలతో, కరుణరస భరితంగా ఒకరికొకరు సంభాషించు కోవడం. సెంటిమెంటల్ డైలాగ్స్ రాయడంలో ఆత్రేయది అందెవేసిన చెయ్యి. ఆత్రేయకు లేడీస్ సెంటిమెంట్లు లేకపోయినా లేడీస్ సెంటిమెంట్ డైలాగ్స్ బాగా రాస్తారని చెప్పుకుంటారు. ఆత్రేయ గొప్ప వేదాంతి. ప్రతి విషయాన్ని వాస్తవిక దృష్టితో ఆలోచించి సంభాషణలను సమకూర్చాడు. "వేదాంతం, వైరాగ్యం ఒంటపడితే చాలా ప్రమాదం. వాటి జోలికిపోకుండా ఉంటే చాలా మంచిది. అవి మనిషిలోని కార్య దీక్షను, గట్టి విశ్వాసాలను దెబ్బతీస్తాయి" అని ఆత్రేయ అనే వారు. శృంగార రసం శృతి మించితే అశ్లీలం అవుతుంది. ఇటువంటి కొన్ని సన్నివేశాలకు రచయిత పచ్చిగా రాయక తప్పదు. నేను రాయను అని మడికట్టుకు కూర్చుంటే సినీ రచయితగా చిత్ర పరిశ్రమలో ఏ రచయితా నిలబడ లేడు. ఈ కారణమే ఆత్రేయను బూత్రేయ అని కూడా పేరు మూట గట్టుకునేలా చేసింది. 'దీక్ష' (1950) చిత్రానికి తొలిసారి అతను పాటలు రాశారు. "పోరా బాబు పో.." అంటూ సాగే పాట ప్రేక్షకులను, సినీ మేకర్స్‌ని బాగా ఆకట్టుకోవడం ఆత్రేయ పాటల్లోని మాధుర్యం ఏంటో సినిమా పరిశ్రమకు తెలిసింది. అదే ఏడాదిలో విడుదలైన 'సంసారం' చిత్రానికి తొలిసారి కథా రచన కూడా చేశారు. దీంతో దర్శక, నిర్మాతలంతా ఆత్రేయతో పాటలు రాయించేందుకు క్యూ కట్టారు. 'అర్థాంగి' చిత్రంలో 'రాక రాక వచ్చావు చందమామా..', 'తోడి కోడళ్ళు' చిత్రంలో 'కారులో షికారుకెళ్లి...', 'శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం'లో 'శేషశైలవాసా శ్రీ వెంకటేషా...', 'మంచి మనసులు'ల్లో 'శిలలపై శిల్పాలు చెక్కినారు...', 'మూగ మనసులు' చిత్రంలో 'ముద్దబంతి పువ్వులో...' 'డాక్టర్ చక్రవర్తి'లో 'నీవులేక వీణ ...', 'అంతస్తులు'లో 'తెల్ల చీర కట్టుకున్నది ఎవరి కోసము...', 'ప్రేమ్‌నగర్'లో 'నేను పుట్టాను ఈ లోకం మెచ్చింది. నేను ఏడ్చాను ఈ లోకం నవ్వింది. నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది...', 'మరోచరిత్ర'లో 'ఏ తీగ పువ్వునో ఏ కొమ్మ తేటినో...', 'ఇంద్ర ధనస్సు'లో 'నేనొక ప్రేమ పిపాసిని నీవొక ఆశ్రమ వాసివి...', 'అంతులేని కథ'లో 'కళ్ళల్లో ఉన్నదేదో కన్నులకు తెలుసు...', 'మరో చరిత్ర'లో 'విధి చేయు వింతలన్నీ...', 'ఇది కథ కాదు'లో 'సరిగమలు గలగలలు...', 'స్వాతిముత్యం'లో 'చిన్నారి పొన్నారి కిట్టయ్య...' తోపాటు 'తేనే మనసులు', 'ప్రైవేట్ మాస్టర్', 'బ్రహ్మచారి', 'మట్టిలో మాణిక్యం', 'బడి పంతులు', 'పాపం పసివాడు', 'భక్త తుకారం', 'బాబు', 'జ్యోతి', 'అందమైన అనుబంధం', 'గుప్పెడు మనసు', 'ఆకలి రాజ్యం', 'అభిలాష', 'కోకిలమ్మ', 'అభినందన', 'ప్రేమ' వంటి చిత్రాల్లో 400లకుపైగా పాటలు రాసి తెలుగు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పాటలన్ని భావోద్వేగాల సమాహారంగా ఉండటంతో ఆత్రేయను 'మనసు కవి'గా ప్రేక్షకులు, అభిమానులు అభివర్ణించారు. ఎంతటి బరువైన భావాలనైనా అర్థవంతమైన తేలికైన పదాలతో పలికించడంతో ఆత్రేయ దిట్ట. మూడున్నర దశాబ్దాల సినీ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను చవిచూశారు. పాటల్లో తన అనుభవాలను పొదిగి, గుండె బరువును దించుకునే వారని ఆయన సన్నిహితులు పలు సందర్భాల్లో చెప్పారు. రాయక నిర్మాతలనూ రాసి ప్రేక్షకులనూ ఏడిపిస్తాడని ఆయన పై ఓ ఛలోక్తి. కానీ ఆత్రేయ... రాస్తూ నేనెంత ఏడుస్తానో ఎందరికి తెలుసు అనేవారు. తెలుగు సినిమా పాటలను మామూలు వాడుక మాటలతోనే రాయగలిగిన ప్రతిభా శాలి ఆత్రేయ. ఉదాహరణకు, తేనె మనసులు సినిమాలో ఈ రెండు పాటలు "ఏవమ్మా నిన్నేనమ్మా ఏలా ఉన్నావు," "నీ ఎదుట నేను వారెదుట నీవు, మా ఎదుట ఓ మామా ఎప్పుడుంటావు." అలాగే ప్రేమనగర్ సినిమాలో "నేను పుట్టాను ఈలోకం మెచ్చింది,, నేను ఏడ్చాను ఈ లోకం నవ్వింది, నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది." పాట,, "తేట తేట తెలుగులా తెల్లవారి వెలుగులా" పాట. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ చిట్టా అనంతమే అవుతుంది. మరోచరిత్ర సినిమాకి రాసిన పాటలు ఏ తీగ పువ్వునో...ఏ కొమ్మ తేటినో... పదహారేళ్లకు...నీలో నాలో బలే బలే మగాడివోయ్ ...నీ అన నీ దానినోయ్...అనే పాటలు ఇప్పటికి శ్రోతలని అలరిస్తూనే ఉన్నాయి. కృష్ణ, శారదలు నటించిన "ఇంద్రధనుస్సు" సినిమాలోని పాట "నేనొక ప్రేమ పిపాసిని నీవొక ఆశ్రమ వాసివి" అనే పాట ఆత్రేయకు అత్యంత ఇష్టమైన పాటగా చెబుతారు. అతన్ను ఒకసారి ఏదో సందర్భంలో ఈ పాట నా జీవితానికి సంబంధించిన పాట అని చెప్పారు. మనసును గూర్చి ఆత్రేయ రాసినన్ని పాటలు వేరొకరు రాసి ఉండలేదు. అందుకనే ఆయనను మనసు కవి అనేవారు. ఆత్రేయ పాటల రచయిత మాత్రమే కాకుండా, అనేక సినిమాలకు మాటల రచయితగా కూడా ఉన్నారు. ముఖ్యంగా ప్రేమనగర్ సినిమా విజయంలో ఆత్రేయ రాసిన పాటలు, మాటలు ముఖ్యభూమిక వహించిందంటే అతిశయోక్తి కాదు.

**రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# భారత యూనియన్లో విలీనానికి నైజాం విముఖత వైనం - సెప్టెంబర్ 13 న సైనిక చర్య నేపథ్యం

దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణ కాండకు తెగబడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 13 నెలలపాటూ... తెలంగాణ ప్రజలు చూడని నరకం లేదు. కనీసం తినడానికి తిండి, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు. పొట్ట కూటికోసం వర్తక వ్యాపారాలకై వచ్చిన శ్వేత జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724-1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించరాని వైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసు కున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచి వేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాధరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి, వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజి, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉధృతం అయిన వేళ . . .రజాకార్ల ఆగడాలు, భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన అన్ని చర్చలూ విఫలమయ్యాయి. భారత దేశంలో విలీనానికి నిజాం అంగీకరించలేదు. రజాకార్ల ఆగడాలు మితిమీరి పోయాయి. మరోవైపు కమ్యూనిస్టుల సాయుధ పోరాటం సాగుతోంది. హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు. 1946 - 1948ల మధ్య హైదరాబాదు రాజ్యంలో నెలకొన్న పరిస్థితులు అత్యంత ఉద్రిక్తమైనవి. హైదరాబాదుకు స్వతంత్ర ప్రతిపత్తి కావాలని ఆశిస్తూ, దాన్ని ప్రత్యేక దేశంగా గుర్తించాలని నిజాం ప్రతిపాదించాడు. ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సైనిక విభాగమైన రజాకార్లకు చెందిన ఖాసిం రజ్వి రంగంలోకి దిగడం దానివల్లనే జరిగింది.


**యథాతథ స్థితికి ఒప్పందం...** వాస్తవ పరిస్థితిని నిజాం రాజుకు అర్థమయ్యేలా చెప్పడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఫలించి, 1947 నవంబర్ 29న యథాతథ స్థితి ఒప్పందం కుదిరింది. 1947 ఆగష్టు 15కు పూర్వపు పరిస్థితికి ఒక సంవత్సరం పాటు కట్టుబడి ఉండాలనేది ఈ ఒప్పంద సారాంశం. నవాబు స్వయంగా ఢిల్లీకి వెళ్లి సర్దార్ పటేల్‌ను కలిసి, 1947 నవంబర్ 29వ యథాతథ ఒప్పందంపై మౌంట్‌బాటన్ నిజాం నవాబు సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా హైదరాబాదులో భారత్ తరపున ఏజంట్ జనరల్‌గా కె.ఎం.మున్షీ నియమితుడయ్యాడు. అయినా నైజాం, ఆయన నియమిత



సైన్యం ఆగడాలు ఆగలేదు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఆదివాసీలు ఏకమై ఎదురు తిరిగారు. ఎంతో మంది ఉద్యమ నేతలు, కళాకారులు... అందరూ తమ ప్రాణాలు ఫణంగా పెట్టారు. ఉద్యమం అత్యంత తీవ్ర స్థితికి చేరిన స్థితిలో, కేంద్ర ప్రభుత్వం నిజాం సంస్థాన్ని ఇండియాలో కలిపేయమని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి సూచించగా, ఈ క్రమంలోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13 న సైనిక చర్య ప్రారంభమైంది. భారత సైన్యం విడివడి విజయవాడ, బీదర్ వైపుల నుండి నలు వైపులా ముట్టడికి ముందుకు సాగాయి. ఓటమిని తప్పించుకో లేని నిజాం, దిక్కు తోచక, లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న భారత ఏజెంట్ మున్షీని కలిసి, లొంగు బాటు నిర్ణయాన్ని ప్రకటించాడు. బొల్లారం వద్ద నిజాం, సర్దార్ పటేల్ ముందు తలవంచి, లొంగి పోవడంతో, సైనిక చర్య సెప్టెంబర్ 17 న సఫలీకృతమైంది. తద్వారా హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్లో విలీనమైంది. నిజాం ప్రధాన మంత్రి లాయక్ అలీని తొలగించి, ఖాన్ రజ్వీని ఖైదు చేశారు. తర్వాత లాయక్, రజ్వీ పాకిస్తాన్ పారి పోయారు. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే. ఎన్. చౌదరి, సైనిక గవర్నర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు . ఎం. కె. వెల్లోడి ముఖ్యమంత్రి గా, నియుక్తు లైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు , భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, యాభై లక్షల రూపాయల భరణం చెల్లింపు కు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగింప బడేందుకు, ప్రభుత్వం అంగీకరించింది. అలా 1956 అక్టోబర్ 31 వరకు నిజాం రాజ్ ప్రముఖ్ గా కొనసాగారు. **రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# తెలుగు ప్రతిభా దీప్తి - ఇంజనీరింగ్ శిఖరం వేపా కృష్ణమూర్తి - వేపా కృష్ణమూర్తి - తెలుగు ఇంజనీరింగ్ ప్రతిభకు చిరస్మరణీయ నిదర్శనం - సెప్టెంబర్ 13.. వేపా కృష్ణమూర్తి జయంతి

వేపా కృష్ణమూర్తి (సెప్టెంబర్ 13, 1910 %-% సెప్టెంబర్ 9, 1952) ఆధునిక భారతదేశ నిర్మాణంలో విశిష్టమైన స్థానం సంపాదించిన గొప్ప తెలుగు ఇంజనీరు. తక్కువకాల జీవితం గడిపినా, తన మేధస్సు, కృషి, దూరదృష్టి వల్ల దేశ అభివృద్ధికి అంకితమైన మహోన్నత సేవలను అందించారు. ముఖ్యంగా నదుల అనుసంధానం, ఆనకట్టల నిర్మాణం, జలవనరుల వినియోగంలో ఆయన చూపిన ప్రతిభ అపూర్వం. 1910లో శ్రీకాకుళం జిల్లా పార్వతీ పురంలో వేపా అచ్యుతం వెలనాటి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కృష్ణమూర్తి, బాల్యం నుంచే గణితం, శాస్త్ర విజ్ఞానాలపై ఆసక్తి చూపించారు. ప్రాథమిక విద్యను మచిలీపట్నంలో పూర్తిచేసి, మద్రాస్ విశ్వ విద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. చదువులో ప్రతిభ కనబరిచి యూనివర్సిటీ బంగారు పతకాన్ని సాధించారు. ఆ కాలంలో అరుదైన ఇండియన్ స్టేట్ సర్వీసెస్ పరీక్షలో దేశవ్యాప్తంగా రెండవ ర్యాంక్ సాధించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. తరువాత ఇంగ్లాండ్‌లో శిక్షణ పొంది ఆధునిక ఇంజనీరింగ్ పద్ధతులు, నీటిపారుదల, నదుల నిర్వహణ విధానాల్లో లోతైన పరిజ్ఞానం సంపాదించారు. 1932లో రైల్వే శాఖలో ఉద్యోగం ప్రారంభించి విద్యుత్ సరఫరా విభాగంలో వినూత్న ఆలోచనలు ప్రతిపాదించారు. ఆయన రూపకల్పన చేసిన పథకాలు విశేషంగా ప్రశంసించ బడ్డాయి. తరువాత ప్రజా నిర్మాణాల శాఖలో చేరి తన కృషితో అతి తక్కువ కాలంలోనే ఉన్నత స్థానాలను అధిరోహించారు. 1946లో కేవలం 38 ఏళ్ల వయసులోనే హైదరాబాద్ రాష్ట్రానికి ముఖ్య ఇంజనీరుగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన సాంకేతిక పటిమ, పరిపాలనా నైపుణ్యం మరింతగా వెలుగులోకి వచ్చాయి. ఆయన ప్రధాన కృషిలో కృష్ణా నది ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రణాళికలు విశిష్టమైనవి. పాత అనికట్ వరదలతో దెబ్బతిని విచ్ఛిన్నమవుతున్న సమయంలో ప్రాజెక్టు పునర్నిర్మాణ అవసరాన్ని స్పష్టంగా ప్రతిపాదించారు. ఆధునిక పద్ధతులతో కొత్తగా ఆనకట్ట నిర్మించాలని సూచించారు. ఈ ఆలోచన ఆధారంగానే తరువాత ప్రసిద్ధి చెందిన ప్రకాశం బ్యారేజ్ నిర్మాణం జరిగింది. 1954%-%1957 మధ్యకాలంలో రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్ట్ లక్షల ఎకరాలకు సాగునీరు అందించి, డెల్టా ప్రాంత వ్యవసాయాభివృద్ధికి పునాది వేసింది. ఆయన చూపిన దూరదృష్టి లేకపోతే ఇంత విస్తృత స్థాయిలో నీటి పారుదల సౌకర్యాలు సాధ్యమయ్యేవి కావు. దురదృష్టవశాత్తు, 1952 సెప్టెంబర్ 9న ఆయన తన విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయారు. వరదలతో ప్రమాదకరంగా మారిన కృష్ణానదిలో పరిస్థితిని పరిశీలించేందుకు లాంచీ ద్వారా వెళ్లిన సమయంలో గండిలో చిక్కుకుని మరణించారు. ఆ క్షణం ఆయన వ్యక్తిగతంగా విషాదకరమైనా, దేశ నిర్మాణానికి త్యాగబాధక ఘట్టంగా నిలిచింది. వేపా కృష్ణమూర్తి కేవలం ఇంజనీరు మాత్రమే కాకుండా,




సమాజ ప్రయోజనాలకోసం సాంకేతికతను వినియోగించాలన్న సంకల్పంతో కృషి చేసిన దూరదృష్టి గల మేధావి. నదుల అనుసంధానం ఆలోచనను ముందుగానే ప్రతిపాదించి, నీటి కొరతను అధిగమించడానికి శాశ్వత పరిష్కార మార్గాలను సూచించారు. గ్రామీణాభివృద్ధి, సాగునీరు, తాగునీటి వనరుల అందుబాటు కోసం చేసిన ఆయన ప్రయత్నాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. కేవలం 42 ఏళ్ల వయసులోనే ఆయన జీవితం ముగిసి పోయినా, తెలుగు ఇంజనీరింగ్ ప్రతిభకు ఆయన చిరస్థాయి స్ఫూర్తిగా నిలిచారు. ఆయన జీవితం ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది – జ్ఞానం, విజ్ఞానం వ్యక్తిగత ప్రగతి కోసం మాత్రమే కాకుండా, సమాజ హితానికి వినియోగించ బడాలి. వేపా కృష్ణమూర్తి త్యాగం, సేవ, దూరదృష్టి నేటికీ ఇంజనీర్లకు ఆదర్శం, తెలుగు గర్వకారణం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# యాప్'రే'!

హైదరాబాద్ : నగర శివారు చందానగర్ ఖజానా జ్యువెలరీ దుకాణంలో దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్తలు తీసుకుంది. పథకం అమలు చేయాలని నిర్ణయించుకున్నాక సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. సిగ్నల్ యాప్‌లో సంప్రదింపులు జరిపి అందినంత దోచుకొని పారిపోయారు. సైబరాబాద్ పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పుణెలో దాగిన నిందితులను అరెస్ట్ చేశారు.
బెంగళూరు అడ్డాగా చేసుకున్న ఇద్దరు నైజీరియన్లు రెండేళ్లుగా పోలీసులకు పట్టుబడకుండా నగరంలోని 100 మందికి డ్రగ్స్ చేరవేశారు. స్నాప్‌చాట్‌లో గ్రూపు ఏర్పాటు చేసి దర్జాగా దందా చేశారు. వీరి వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసిన యువకుడు పట్టుబడినప్పుడు లభించిన ఆధారాలతో హైదరాబాద్ నార్కొటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్‌న్యూ) పోలీసులు అసలు గుట్టును పసిగట్టారు.
అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్ల నుంచి దొంగల ముఠాలు, సైబర్ మాయగాళ్ల వరకూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అస్త్రాలుగా వాడుకుంటున్నారు. నిందితులను పట్టుకున్నా సరైన సాక్ష్యాలు లభించక కేసుల నుంచి తేలికగా బయటపడుతున్నారు. గోవాలో ఉంటూ 16 ఏళ్లుగా ఒక నైజీరియన్ డ్రగ్‌డాన్‌గా ఎదిగాడు. దేశవ్యాప్తంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకొని 'డెడ్‌డ్రాప్' పద్ధతిలో మత్తుపదార్థాలు సరఫరా చేశాడు. విదేశీ ఫోన్ నంబర్లు, యాప్‌లు, కోడ్ భాష ఉపయోగించి ఎక్కడా తన పేరు, రూపం తెలియకుండా దందా నడిపాడు. ఏడాదిపాటు శ్రమించిన హెచ్‌న్యూ పోలీసులు తాజాగా అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



**పట్టుకోవడం పోలీసులకు సవాలే..**
సైబర్ నేరస్థులు టెలిగ్రామ్ యాప్ వేదికగా 90శాతం మోసాలకు పాల్పడుతున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజ్, ఇన్వెస్ట్‌మెంట్‌ఫ్రాడ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలంటూ రూ.లక్షలు కాజేస్తున్నారు. స్నాప్‌చాట్, సిగ్నల్‌యాప్‌లను డ్రగ్స్ లావాదేవీలకు వినియోగిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ యాప్‌ల్లో జరిగే చాటింగ్, ఫోన్‌కాల్స్, సందేశాలు 'ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ ' విధానంలో గోప్యంగా ఉంటాయి. కొన్ని యాప్‌ల్లో చేసే చాటింగ్ అవతలి వ్యక్తులు చూడగానే మాయమవుతాయి. కేసు నమోదు చేసి ఆధారాల కోసం యాప్‌ల్లో జరిగిన మంతనాలను సేకరించటం క్లిష్టమవుతోందని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. డ్రగ్స్ ముఠాలు విదేశీ సిమ్‌కార్డులతో వాట్సప్ గ్రూపులు రూపొందించి మత్తుపదార్థాలు చేరవేస్తున్నారు. దీనికి తగినట్టుగానే పోలీసు యంత్రాంగం కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను సమకూర్చుకుంటోంది.

# ఉపకార వేతనం.. ప్రతిభకు ప్రోత్సాహం

వెల్గటూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు కేంద్రం 2008 నుంచి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పేరుతో ఉపకార వేతనాలను అందిస్తుంది. ఎనిమిది తర్వాత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా విద్యార్థులు మధ్యలో చదువు మానేయకుండా ఇంటర్ వరకు కొనసాగించేలా ఉపకార వేతనాలు అందిస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అయింది. మొదటి విభాగంలో: మానసిక సామర్థ్య పరీక్షకు సంబంధించి 90 మార్కులకు 90 ప్రశ్నలుంటాయి. ఇందులో రీజనింగ్, అర్థమెటిక్ సామర్థ్యం, పదాల భిన్న పరీక్ష, అంకెలు, అక్షరాల ఎనాలజీ, కోడింగ్-డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్‌చిత్రాలు, అద్దం, నీటి ప్రతిబింబాలకు సంబంధించి ప్రశ్నలుంటాయి.
రెండో విభాగంలో: 7, 8 తరగతుల సిలబస్ నుంచి 90 మార్కులకు 90 ప్రశ్నలుంటాయి. వీటిలో గణితం 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవశాస్త్రాల నుంచి 35 మార్కులు, సాంఘికశాస్త్రం నుంచి 35 మార్కుల చొప్పున ఉంటాయి. పరీక్ష తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బహుళైచ్ఛిక రూపంలో ఉంటాయి. పరీక్షకు సుమారు 70 రోజుల సమయం ఉన్నందున ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం అయితే లక్ష్మీ



కటాక్షాన్ని అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది.
తుది గడువు: అక్టోబరు 6
పరీక్ష: నవంబరు 23న డివిజన్ కేంద్రాల్లో..
అర్హత: ఏడో తరగతిలో కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదివేవారు.
ఆదాయం: తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.5 లక్షలలోపు
పరీక్షా రుసుం: ఓసీ, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50
కావాల్సినవి: ఆధార్‌కార్డు, స్టడీ, కులం, ఆదాయం ధ్రువపత్రాలు
పరీక్షా విధానం: 180 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో రెండు విభాగాలుంటాయి.
ఎంపికైతే: పరీక్షలో ప్రతిభ కనబరిచి ఎంపికైతే ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు ఉపకార వేతనాలు పొందవచ్చు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల వరకు మొత్తం రూ.48 వేల ప్రయోజనాన్ని పొందుతారు. పదో తరగతి తర్వాత ఈ ఉపకార వేతనం కొనసాగాలంటే 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందాల్సి ఉంటుంది.

# కొట్టుకోకండి.. దూరం కాకండి?



గంగాధర : మునుపెన్నడూ లేనివిధంగా నా (యూరియా) కోసం మీరు (రైతన్నలు) పడుతున్న బాధలు అన్నీఇన్నీ కావు. నా ఉత్పత్తి కొరత కారణంగా ప్రభుత్వ రంగ సంస్థలైన ప్యాక్స్, డీసీఎంఎస్, వ్యవసాయ శాఖ నిర్ణయించిన ప్రైవేటు దుకాణాలకు మాత్రమే నన్ను పరిమితంగా కేటాయిస్తున్నారు. 'నానో' యూరియా పిచికారీ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నా.. అటు వైపు వెళ్లడం లేదు. నాకోసం రోజుల తరబడి వరుసలో నిల్చుంటున్నారు. కూపన్ దక్కించుకోవడానికి రాత్రనక, పగలనక, ఎండనక, వాననక కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పాసుపుస్తకాలు, చెప్పులు వరుసలో పెడుతున్నారు. ఒక్క బస్తా పొందడానికి కొట్టుకోవడం, తిట్టుకోవడం చూస్తుంటే గుండెను పిండేస్తుంది. సైదాపూర్ మండలంలోనైతే రెండు ఊళ్ల ప్రజలు కొట్టుకోవడం బాధ కలిగించింది. ఇలా మానవ సంబంధాలకు దూరం కాకండి
జిల్లాలో వానాకాలంలో 2.62 లక్షల ఎకరాల్లో వరి, 43 వేల ఎకరాల్లో పత్తి, 3500 ఎకరాల్లో మొక్కజొన్న, పది వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. ఇందుకు 43 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశా. ఇప్పటికీ 27 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా జరిగింది.
సామాజిక మాధ్యమాల్లో నాపై చిత్రవిచిత్రంగా రీల్స్ చేయడం ఒకింత ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఇక రాజకీయ నాయకులకైతే నన్ను అస్త్రంగా వాడుకుంటున్నారు. అధికార, ప్రతిపక్షాల నాయకులు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు.
గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో లచ్చయ్య అనే రైతు ఎలాగోలా కష్టపడి రెండు బస్తాలు సంపాదించి, మరుసటి రోజు చల్లేందుకు పొలం వద్దే భద్రపరిచాడు. మర్నాడు వెళ్లి చూసేసరికి అవి కనిపించలేదు. చోరీకి గురయ్యాయని గ్రహించి లబోదిబోమన్నాడు. నా ధర రూ.270 తక్కువే అయినా మీకు అందుబాటులో లేకుండా పోయాను. మీరు కూడా ఆలోచించి విచ్చలవిడిగా నన్ను చల్లకుండా వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకే చల్లితే మంచిది. ముందే నన్ను ఎక్కువ కొని నిల్వ చేసుకోకండి. ఈసారి రైతుల కష్టాలను అనుభవంగా తీసుకుని పాలకులు, అధికారులు వచ్చే పంటకైనా అవసరం మేరకు నన్ను దిగుమతి చేసుకొని రైతులకు అందుబాటులో ఉంచుతారని ఆశిస్తున్నా.

# సొంతింటి కల సాకారమయ్యే త'రుణం'



సారంగాపూర్ : గూడు లేని ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. పనులు వేగంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇసుక తరలింపులో సడలింపునిచ్చినా లబ్ధిదారుల ఆర్థిక సమస్యలతో నిర్మాణాలు మందగించాయి. ఈ నేపథ్యంలో స్వశక్తి సంఘాల ద్వారా రుణాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, గ్రామైక్య సంఘాల ద్వారా లబ్ధిదారులకు రుణాలిస్తున్నారు.

**445 మందికి రుణాలు**
జిల్లావ్యాప్తంగా 445 మంది లబ్ధిదారులకు రూ.71.97 లక్షల రుణాలిచ్చారు. ఇందులో బ్యాంకు లింకేజీ ద్వారా రూ.38.19 లక్షలు, స్త్రీనిధి ద్వారా రూ.18.28 లక్షలు, గ్రామైక్య సంఘాల ద్వారా రూ.15.50 లక్షలు పంపిణీ చేశారు. లబ్ధిదారుల అవసరం మేరకు రుణాలిచ్చేందుకు సెర్ప్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. స్వశక్తి సంఘంలో సభ్యులైన లబ్ధిదారులకు రూ.లక్ష వరకు ప్రత్యేకంగా అందిస్తున్నారు. ప్రభుత్వం మహిళల పేరిట ఇల్లు మంజూరు చేస్తుండగా అన్ని గ్రామాల్లో ఇంటింటికీ స్వశక్తి సభ్యులుండటంతో రుణం సులభంగా మంజూరవుతోంది.

**జిల్లాలో పూర్తయింది ఒక్కటే!**
జిల్లాలో 10,735 ఇళ్లు మంజూరు కాగా ఇందులో పూర్తి స్థాయిలో కేవలం మల్యాల మండలంలో ఒకే ఒక నిర్మాణం పూర్తయింది. 7,197 నిర్మాణాలు ప్రారంభించగా 2,346 బేస్‌మెంట్ లెవెల్, 279 లెంటల్ లెవెల్, 124 స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. అంతకుముందు మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినా అన్ని చోట్లా నిర్మాణాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలు చెల్లిస్తుండగా, బేస్‌మెంట్ పూర్తయ్యాక రూ.లక్ష, లెంటల్ లెవెల్ వరకు మరో రూ.లక్ష, స్లాబ్ పూర్తయిన తరువాత రూ.2 లక్షలు, పనులు ముగిశాక మిగతా రూ.లక్ష జమ చేయనున్నారు. నిర్మాణ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వెంటనే ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నారు.

**గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకునేందుకు సెర్ప్ ద్వారా ప్రత్యేక రుణాలు అందిస్తున్నాం. ఇందుకోసం గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. మహిళా సంఘాల తీర్మానం మేరకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, గ్రామైక్య సంఘాల ద్వారా లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయనున్నారు. రుణం పొందిన మహిళలు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకునే అవకాశం ఉంది.
రఘువరన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# పర్యావరణ హితం.. లాభాల్లో వ్యాపారం



సిరిసిల్ల : సిరిసిల్లకు పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన కోమాకుల వెంకటప్రసాద్ చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని అనుకునేవారు. అదే ఆలోచనతో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవడమే కాక పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. తల్లి టైలర్, తండ్రి ఆర్ఎంపీ వైద్యుడు. మధ్య తరగతి కుటుంబం కావడంతో త్వరగా తన కాళ్లపై తాను నిలబడాలనుకున్నారు. సొంతంగా ఉల్లిపాయల దుకాణం ఏర్పాటు చేసుకొని డిగ్రీ పూర్తిచేశారు. నాలుగేళ్ల క్రితం ప్లాస్టిక్ సంచుల నిర్మూలన కోసం వారి వీధిలోని మహిళలతో కలిసి జ్యూట్ బ్యాగులు తయారు చేస్తూ వారికి ఉపాధి కల్పించారు. ఇలా పర్యావరణ పరిరక్షణకు కృషి చేసినందుకు సిరిసిల్ల పురపాలక సంఘం నుంచి పురస్కారాలు అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా ఏదైనా చేయాలనే ఆలోచన పెరిగి విస్తరాకు ప్లేట్ల ఆలోచనతో ముందుకొచ్చారు..

**మొదలైంది ఇలా..** హైదరాబాద్‌లో 2021లో ఓ శుభకార్యానికి వెళ్లి అక్కడున్న విస్తరాకు ప్లేట్లను చూసి వెంకటప్రసాద్ ఆకర్షితులై తాను అలానే రూపొందించాలనుకున్నారు. ఆ ప్లేటును తనతోపాటు తీసుకొచ్చి దాని గురించి పరిశోధించారు. 'ది అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా (ఎలీప్), నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ఆర్‌డీఐ)లను సంప్రదించారు. నాలుగైదు యూనిట్లను సందర్శించి తయారీ విధానంపై తర్ఫీదు పొందారు. ఎలిప్ నుంచి ఇంక్యుబేషన్‌లో భాగంగా యంత్రాలు అద్దెకు తీసుకొచ్చి విస్తరాకు ప్లేట్ల తయారీ ప్రారంభించారు.
తొలుత ఒడిశా నుంచి అడ్డాకు దిగుమతయ్యేది. కానీ అది ప్లేటుగా తయారయ్యేలోపే రంగు నల్లగా మారేది. అయినా నిరాశ చెందకుండా ప్రత్యామ్నాయం ఆలోచించారు. మోదుగ ఆకుతోనూ విస్తరాకులను రూపొందించొచ్చని తెలుసుకొని జిల్లాలోని పలు గ్రామాలతోపాటు ములుగు జిల్లా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు.
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చాలా గ్రామాల్లో మహిళలు, సర్పంచులు, వ్యవసాయ కూలీలలో కార్యక్రమాలు ఏర్పాటు చేసి విస్తరాకుల మీద ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలతో మాట్లాడి పది సంఘాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వంద మందికిపైగా ఉపాధి పొందుతున్నారు. మొత్తం ఆరు బ్రాంచీలు ఏర్పాటు చేసి అధిక మొత్తంలో మోదుగ విస్తరాకు ప్లేట్లను రూపొందిస్తున్నారు.
ప్రభుత్వం సహకరించాలిరూ.3 లక్షలతో వ్యాపారాన్ని ప్రారంభించగా రూ.30 లక్షల వరకు టర్నోవర్ వస్తోంది. నాతోపాటు జిల్లాకు చెందిన మరో పది మంది యువ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ పార్కుకు స్థలం కేటాయిస్తామంది. ఆ స్థలాన్ని సిరిసిల్లలోనే ఏర్పాటు చేయాలని మేం కోరుతున్నాం. పర్యావరణహితంగా మరిన్ని వస్తువులను రూపొందిస్తాం.
కోమాకుల వెంకటప్రసాద్, యువ పారిశ్రామికవేత్త

# ప్రయాస ప్రాంగణాలు

కోరుట్ల : జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాల్లో అరకొర వసతులతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చాక ప్రయాణికుల సంఖ్య పెరిగింది. సరిపడా బస్సులు సమకూర్చకపోగా, ప్రయాణ ప్రాంగణాలను ఆధునికీకరించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంస్థకు లాభాలను తీసుకొస్తున్న కార్గో సెంటర్లకు వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

**వాహనాలు నిలిపే చోటేదీ!**
జగిత్యాల ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో స్థానిక డిపోతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న బస్సుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ప్లాట్‌ఫాంలు సరిపోవడం లేదు. ప్రాంగణం నుంచి మరుగుదొడ్ల వరకు పైకప్పు లేకపోవడంతో వర్షం కురిసినపుడు ప్రయాణికులు తడవాల్సి వస్తోంది. కార్గో కేంద్రం వద్దనే వాహనాల పార్కింగ్ ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్‌కు వచ్చే ప్రైవేటు వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలం లేకపోవడంతో సమస్యగా మారింది.

**అరకొర ప్లాట్‌ఫాంలు.. అపరిశుభ్రత**
కోరుట్ల ప్రాంగణంలో బస్సులు నిలిపేందుకు ప్లాట్‌ఫామ్‌లు సరిపడా లేకపోవడంతో బొమ్మెన, దేశాయిపేట మార్గాల్లో వెళ్లే బస్సులను మరుగుదొడ్ల ముందే నిలుపుతున్నారు. దుర్గంధంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి, వ్యర్థాలు పేరుకుపోవడంతో చిత్తడిగా మారింది. బస్టాండ్





ఆవరణలోని 6 సీసీ కెమెరాలకు అనుసంధానించిన కంప్యూటర్‌లో స్టోరేజీ నిండిపోవడంతో ఫుటేజీ నిక్షిప్తం చేసే వీల్లేకుండా పోయింది. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏటీఎం కొన్ని నెలలుగా పని చేయడం లేదు. రెండు టీవీలు ఏర్పాటు చేసినా ఆరు నెలల క్రితం తొలగించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపైనే బస్టాండు ఉండటంతో ఖాళీ స్థలంలో దుకాణ సముదాయాలు నిర్మిస్తే ఆర్టీసీకి రూ.లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశమున్నా పట్టించుకోవడం లేదు.

**బస్సుల కోసం చెట్ల కింద నిరీక్షణ**
సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన మెట్‌పల్లి బస్టాండ్ నిర్మాణం శిథిలావస్థకు చేరింది. జగిత్యాల, నిజామాబాద్, నిర్మల్ జిల్లాలకు కూడలిగా ఉండటంతో నిత్యం వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. కేవలం 5 ప్లాట్‌ఫాంలు ఉండటంతో ప్రయాణికులు చెట్ల కింద నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది. అసలే ప్లాట్‌ఫాంలు సరిపోకపోగా అదే చోట కార్గో కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూత్రశాలల మార్గంలో కార్గో పార్సిళ్లను అడ్డుగా పెడుతుండటం అసౌకర్యంగా మారింది. బస్టాండ్ ఆవరణలో మురుగు కాలువలు లేక చిన్నపాటి వర్షానికే బురదమయమవుతోంది.

# మాడవీధి స్థలం.. అప్పగింతకు రంగం సిద్ధం

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ మాడవీధి స్థలాన్ని దేవస్థానానికి అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. భవిష్యత్తులో రూ.350 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు వీలుగా ఈ జాగాను రామాలయానికి ఇచ్చేందుకు రెవెన్యూశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన దస్త్రాలను అధికారులు తయారుచేశారు. అన్నీ అనుకూలిస్తే ఈ స్థలం దస్త్రాలను రామాలయం ఈఓ దామోదర్‌రావుకు బుధవారం అందించనున్నారు. రామాలయానికి దక్షిణం, తూర్పు, పడమర వైపు 43 గృహాలు ఉండగా వీటిని తొలగించారు. పూర్తిస్థాయి ప్యాకేజీలకు రూ.60.20 కోట్లు అవసరమని అంచనా వేశారు. తొలి విడతగా రూ.34.45 కోట్లు కేటాయించారు. ఈ మొత్తాన్ని నిర్వాసితులకు చెల్లించి ఇళ్లను తొలగించి చదును చేశారు. ఇందులో 1.30 ఎకరాల స్థలం ఉండగా రహదారులు పోగా మిగతా స్థలం దేవస్థానం సొంతం కానుంది.

**నత్తనడకే నయం..!**
నిర్వాసితుల కాలనీ నిర్మాణానికి స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో సుమారు మూడున్నర ఎకరాల ఖరీదైన స్థలం కేటాయించారు. ఇందులో తుప్పలు, రాళ్లగుట్టలు ఉండటంతో సుమారు నాలుగు నెలలుగా యంత్రాల సాయంతో చదును చేసే పనులు కొనసాగిస్తున్నారు. ఎక్కువ యంత్రాలను ఉపయోగించే వీలున్నా అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఇలాగే వ్యవహరిస్తే



దసరా నాటికి కూడా పనులు పూర్తవుతాయో లేదో అంతు చిక్కటం లేదు. 43 కుటుంబాలకు సంబంధించి 72 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించాలి. ఇందులోనే రహదారులకు కొంత జాగా వదులుతారు. విద్యుత్తు లైన్లు, తాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉంది. నిర్వాసితులకు రూ.7.50 లక్షల చొప్పున ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించాలి. దేవస్థానం అభివృద్ధి కోసం అందరితో పాటు మా కుటుంబానికి చెందిన ఇంటి స్థలాన్ని అప్పగించాం. నష్టపరిహారం ఇచ్చారు. ఆర్ఆర్ ప్యాకేజీ సత్వరం చెల్లిస్తామని అధికారులు చెప్పి మమ్మల్ని ఖాళీ చేయించారు. ఇప్పుడు దీని ఊసెత్తటం లేదు. కాలనీ నిర్మాణానికి బ్రిడ్జి సెంటర్‌లో స్థలం చూపించినా ఎప్పటికి అప్పగిస్తారో తెలియదు.
**కాకరాల శర్మ, నిర్వాసితుడు**
రామాలయం పక్కన ఇళ్లను తొలగించగా వచ్చిన స్థలాన్ని దేవస్థానం ఈఓకు అప్పగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. నిర్వాసితులకు ఆర్ఆర్ ప్యాకేజీ త్వరలోనే అందుతుంది. వారికి బ్రిడ్జి సెంటర్‌లో కేటాయించిన స్థలాన్ని నివాస యోగ్యంగా మార్చుతున్నాం.
ఎం.వెంకటేశ్వర్లు, తహసీల్దారు, భద్రాచలం

# ఆహ్లాదం ఆవిరి!

హైదరాబాద్ : 'గండిపేట మండలం బండ్లగూడజాగీర్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ 1989లో 123 ఎకరాల్లో ఏర్పాటైంది. లేఅవుట్ నిర్మాణ సమయంలోనే 1,200 గజాలు, 3,200 గజాల విస్తీర్ణం స్థలాన్ని పార్కు కోసం వదిలారు. ఇక్కడ గజం ధర రూ. 90వేల వరకు డిమాండ్ ఉండగా.. సుమారుగా రూ. 40కోట్ల వరకు విలువ ఉంటుందని అంచనా. దీంతో ఇక్కడి పార్కు స్థలాలపై కన్నేసిన కొంతమంది ప్లాట్లుగా విభజించి కొల్లగొట్టే ప్రయత్నాలు చేశారు. స్థానికులు సకాలంలో హైడ్రాకు ఫిర్యాదు చేయడంతో.. ఇటీవలే అధికారులు కంచె నిర్మాణం చేపట్టారు'.

'దర్గాఖలీజ్‌ఖాన్–కిస్మత్‌పూర్ రోడ్డులో ఓ స్థిరాస్తి సంస్థ ఏడెకరాల్లో 60 విల్లాలను నిర్మించింది. సామాజిక అవసరాల కోసం 3,388 గజాల స్థలాన్ని వదలాల్సి ఉండగా.. లేఅవుట్ నిబంధనలను తుంగలో తొక్కి.. ఆ జాగాలోనూ నిర్మాణాలు చేపట్టారు."

గజం రూ. 75వేలు పైమాటే.. గతంలో పంచాయతీగా ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం నగరపాలికగా మార్చి.. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ఓఆర్ఆర్ లోపల ఉండటంతో.. ఇక్కడ గజం కనిష్ఠంగా రూ. 75వేలు.. గరిష్ఠంగా రూ. లక్షకు పైగా డిమాండ్ ఉంది.

హైడ్రాకు ఫిర్యాదులు.. అప్పట్లోనే ఆయా స్థలాల్లో పదిశాతం స్థలాలు



పంచాయతీల పేరిట రిజిస్ట్రేషన్‌లు సైతం చేశారు. కానీ 124 కాలనీల్లోని పార్కు స్థలాలు మాయమయ్యాయి. 'ఈనాడు' క్షేత్రస్థాయిలో పరిశీలించగా.. ఖాళీ జాగాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లినట్లు స్పష్టమైంది. ఇప్పటివరకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. హైడ్రా యంత్రాంగం సైతం వచ్చే ఫిర్యాదులపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపితే.. ఇక్కడ దాదాపు రూ.కోట్లకు పైగా విలువ చేసే స్థలాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

**600 గజాల ఉద్యాన స్థలంలో రక్షణ చర్యలు**

గోపన్‌పల్లిలోని తెలంగాణ సచివాలయ ఉద్యోగుల ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన 600 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా రక్షించింది. లేఅవుట్‌లో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన జాగాలను సొసైటీ నిర్వాహకులు విక్రయించినట్లు హైడ్రాకు ఫిర్యాదులు రావడంతో పరిశీలించారు. ఆక్రమణలు తొలగించి కంచె వేశారు.

# అదనులో 'మీన'మేషాలు!

పెద్దపల్లి : మత్స్యకారుల జీవనోపాధి పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన సమీకృత మత్స్య అభివృద్ధి పథకంలో ఉచిత చేప పిల్లల పంపిణీపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ సంవత్సరం ఇప్పటికీ టెండర్లు పూర్తి కాలేదు. జులైలో ప్రారంభించి ఆగస్టులోపు చెరువుల్లో పిల్లలను వదిలితేనే మంచి దిగుబడి రానుంది. సెప్టెంబరు రెండో వారం సమీపించినప్పటికీ టెండరు దశలో ఉండటం ప్రశ్నార్థకంగా మారింది. **.అన్నీ అడ్డంకులే..**

ఉమ్మడి జిల్లాలో 904 మత్స్య సహకార సంఘాల్లో 58 వేల మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ ఏడాది 3,466 జల వనరుల్లో 6.68 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని లక్ష్యం విధించారు.

పెద్ద సైజు (80 నుంచి 100 ఎంఎం) పిల్లలు, చిన్న సైజు (35–40ఎంఎం) పిల్లలను చెరువుల్లో వదలాలి. ప్రతి సీజన్‌లో పిల్లల పరిమాణం, మోతాదు విషయంలోనూ కచ్చితమైన ప్రామాణికత పాటించడం లేదు.

చిన్న సైజ్, కల్తీ విత్తన పిల్లల పంపిణీ చేయడంతో రవ్వ, బొచ్చ రకాల ఉత్పత్తి పెరగకపోవడంతో నష్టం వస్తుంది. చిన్న సైజ్ పిల్లలు పోషకాహార లోపంతో రెండు కిలోలు ఉండాల్సిన చేప అర కిలోకే పరిమితమవుతోంది.

ప్రస్తుతం చెరువుల్లో వదిలితే ఏప్రిల్, మే నెలల్లో చేతికి రానుంది. అప్పటికి నీటి వనరులు ఎండిపోతాయి. దీంతో చేపలు చనిపోతాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో రెండేళ్ల బిల్లులు గుత్తేదారులకు చెల్లించాల్సి



ఉండటంతో గతేడాది టెండర్లు దాఖలు చేయలేదు. ఈ సారి కూడా ముందుకు రావడం లేదు.

ఈ నెల 12న టెండర్లు తెరవనున్నారు. ఇప్పటి వరకు పెద్దపల్లిలో 2, కరీంనగర్‌లో 3, సిరిసిల్ల 2 చొప్పున దాఖలు చేయగా జగిత్యాలలో ఒక్కటీ రాలేదు.

చేప పిల్లలకు ప్రత్యామ్నాయంగా నగదు బదిలీ అమలు చేయాలని, నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసుకుంటామని మత్స్యకారుల్లో డిమాండ్ పెరుగుతోంది.

మత్స్యకారుల సంఘం జిల్లా డైరెక్టర్ క్రాంతి మాట్లాడుతూ ఆగస్టులోపు పిల్లలను వదలాల్సి ఉండగా, ఇప్పటి వరకు స్పష్టత లేదు అని అన్నారు.

పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ అధికారి నరేశ్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో చేప పిల్లల పంపిణీ టెండర్ ఈ నెల 12న టెండర్లు ఖరారు కావాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో నాణ్యమైన పిల్లలను పంపిణీ చేయనున్నామని చెప్పారు.

# ప్రకృతి ఒడిలో ఆరోగ్యమస్తు




హైదరాబాద్ : సువిశాల ప్రాంగణం.. ఆహ్లాదకర వాతావరణం.. ప్రకృతితో మమేకం చేస్తూ చికిత్సలు.. యోగా సాధన.. పౌష్టికాహారం.. ఇవన్నీ బల్కంపేటలోని కొణిజేటి రోశయ్య ప్రభుత్వ ప్రకృతి చికిత్సాలయం సొంతం. ఏదైనా అనారోగ్య సమస్యతో అక్కడికి వెళ్తే.. పూర్తి ఆరోగ్యంతో బయటకు వచ్చేస్తారు. ఇక్కడంతా ప్రకృతికి సంబంధించిన వైద్యమే ఉంటుంది.

**ఏయే రోగాలకు..**

థైరాయిడ్, మధుమేహం, స్థూలకాయం, చర్మవ్యాధులు, మెడ, నడుము, కీళ్ల నొప్పులు, కీళ్లవాతం, జీర్ణకోశ, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, మలబద్ధకం.

**ప్రత్యేకతలు**

గర్భిణులు సాధారణ ప్రసవమయ్యేలా కొన్ని సాధనలు చేయిస్తారు. స్త్రీ, పురుషుల్లో సంతానోత్పత్తి, గర్భధారణ వంటి సమస్యలకూ చికిత్స అందిస్తారు. ః ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ సౌకర్యం ఉంది.

ఓపెన్ జిమ్, 8 పాత్‌వే(8 దారులతో కూడిన నడకదారి), అత్యాధునిక సదుపాయాలతో న్న భోజనశాల

కిచెన్ గార్డెన్, వంటింటి తోట

మూలికల వనం. థెరిపిస్టులు, హౌస్‌సర్జన్లు ఉన్నారు. నిపుణులతో యోగాసనాలనూ నేర్పిస్తారు. అక్కడే ఉండి చికిత్స పొందడానికి వ్యక్తిగత, షేరింగ్ కాటేజీలు ఉన్నాయి.

**అందించే చికిత్సలు**

మట్టి, జల, మర్దన, తానాబాత్, డీలక్స్ హైడ్రో మసాజ్, యోగా, ప్రాణాయామం, ధ్యాన క్రియలు, వాయు చికిత్స, సూర్యకిరణ్ చికిత్స, ఆథపత్ (ఆకులను వేడి నీటిలో మరిగించి చేసే స్నానం), షెట్‌కర్మల చికిత్స, ఫిజియోథెరఫీలు, ఆక్యూపంచర్.

ప్రాంగణంలో ఉన్న సంస్థలు

ప్రకృతి గాంధీ వైద్య కళాశాల,

వేమన యోగా, ప్రాణాయామం పరిశోధనా సంస్థలు

తెలంగాణ రాష్ట్రానికి చెందిన తెల్లరేషన్ కార్డు ఉంటే రాయితీ ఉంటుంది.

# పేదల కళ్లలో.. కొత్త వెలుగులు!




హైదరాబాద్ : చిరు ఉద్యోగి రాజీవ్‌కు చూపులో అస్పష్టత.. కంటిలో నొప్పితో సరోజనిదేవి ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో సంప్రదించాడు. పరీక్షించిన వైద్యులు కార్నియాలో ఇన్‌ఫెక్షన్ గుర్తించా రు. కార్నియా మార్పిడితో కంటి చూపు నయం చేయవచ్చని చెప్పారు. ప్రైవేటులో చికిత్సకు స్థోమత లేకపోవడంతో సరోజినిదేవి కంటి ఆసుపత్రి అతన్ని ఆదుకుంది. దాతల నుంచి సేకరించిన కార్నియాను రాజీవ్‌కు అమర్చడంతో మునుపటిలా చూపు పొందగలిగాడు.

రాజీవ్ మాత్రమే కాకుండా.. ఏటా వందిమందికిపైనే పేద రోగుల కళ్లల్లో ఈ ఆసుపత్రి కొత్త వెలుగులు నింపుతోంది. వివిధ కారణాలతో కంటి సమస్యలతో ఇబ్బందిపడుతున్న ఎంతోమందికి కార్నియా మార్పిడితో ఆదుకుంటున్నారు. రూ.లక్షల వ్యయం అయ్యే ఈ చికిత్సలను ఉచితంగా అందిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు దాదాపు 50 మంది రోగులకు కార్నియా మార్పిడి చేసి కొత్త జీవితం ప్రసాదించారు. మరో 50 మంది వరకు నిరీక్షణ జాబితాలో ఉన్నారు. తాజాగా ఆర్టీసీతో ఆసుపత్రి ఒప్పందం కుదుర్చుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో సేకరించిన కార్నియాలను సరోజినిదేవి ఆసుపత్రికి చేర్పించేందుకు ఈ సేవలు ఉపయోగపడనున్నాయి. తొలుత సిద్దిపేట్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో కార్నియాల సేకరణకు వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రత్యేక బాక్సుల్లో కార్నియాలను ఉంచి ఆర్టీసీల్లో నగరానికి చేర్చనున్నారు.

**ఎవరికి అవసరం..**

కార్నియా మార్పిడిని కెరాటోప్లాస్టీగా వ్యవహరిస్తారు. ప్రమాదాల్లో కార్నియా దెబ్బతిన్నప్పుడు, స్పష్టత కోల్పోయినప్పుడు లేదా దృష్టి తగ్గినప్పుడు కార్నియా మార్పిడి ద్వారా తిరిగి చూపు వచ్చేలా చేస్తారు. కార్నియాలో మచ్చలు, గాయం, ఇన్‌ఫెక్షన్లతోపాటు కెరాటోకోనస్ వంటి వ్యాధుల వల్ల కార్నియా కుంచించుకుపోయిన సందర్భంలో సైతం కార్నియా మార్పిడి అవసరం అవుతుంది. కార్నియా లోపలి పొర(ఎండోథెలియం) క్షీణించడం, వాపు కారణంగా దృష్టి లోపం తలెత్తినప్పుడు... తీవ్రమైన కార్నియల్ ఇన్‌ఫెక్షన్లు లేదా అల్సర్లు, రసాయన గాయాల కారణంగా కార్నియా మార్పిడి తప్పనిసరి.

**స్వచ్ఛందంగా ముందుకు రావాలి–** డాక్టర్ మోదిని, సూపరింటెండెంట్, సరోజిని దేవి ప్రభుత్వ నేత్ర వైద్యశాల అవసరమైన వారందరికి సరోజినిదేవి ఆసుపత్రిలో కార్నియామార్పిడి చేస్తున్నాం. చనిపోయిన 6 గంటలలోపు సమాచారం ఇస్తే కార్నియాను మా వైద్యులు సేకరిస్తారు. ఆర్టీసీతో ఒప్పందం వల్ల మారుమూల ప్రాంతాల నుంచి కార్నియాలను సులువుగా నగరానికి తరలించవచ్చు. కార్నియాలను ప్రత్యేక బాక్సుల్లో భద్రపరిచి 15 రోజుల్లో వేరొకరికి అమర్చాలి. దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. దాతలు 9121433434లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

# నమో దీదీ.. ఆర్థిక సమృద్ధి



పెద్దపల్లి : పొదుపుతో ఆకాశమే హద్దుగా రాణిస్తున్న మహిళల మరో అడుగు ముందుకు పడింది. సాగులో అన్నదాతకు పెట్టుబడుల భారం తగ్గించేందుకు ఎరువుల పిచికారీలో భాగస్వామ్యం కల్పించాలని నిర్ణయించింది. అతివలకు ఆదాయ వనరులు పెంచేందుకు కేంద్రం 'నమో డ్రోన్ దీదీ' పథకాన్ని అమలు చేస్తోంది. రెండేళ్ల క్రితం ప్రయోగాత్మకంగా పలువురు మహిళలకు డ్రోన్ల వినియోగంపై నైపుణ్య శిక్షణ ఇవ్వగా ఉపాధి పొందుతున్నారు. మరికొందరికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు.

**జీవనోపాధులు మెరుగు**

రెండో విడతగా ఆసక్తి ఉన్న మహిళలను ఎంపిక చేస్తున్నారు. ఇప్పుడు ఉచిత రాయితీ కాకుండా రూ. 8 లక్షలు రాయితీ, రూ. 2 లక్షలు మండల, గ్రామ సమైఖ్య రుణంతో పరికరాలు కొనుగోలు చేయనున్నారు. పిచికారీలో వచ్చిన సొమ్ములో సగం ఆపరేటర్, సహాయకుడు తీసుకుంటే మిగిలిన సగం మండల సమాఖ్యకు దక్కనుంది. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది కరీంనగర్‌లో 7, జగిత్యాలలో 13, పెద్దపల్లిలో 2, రాజన్న సిరిసిల్లలో 9 చొప్పున పంపిణీ చేసేందుకు లక్ష్యం నిర్ధారించారు.

**ప్రోత్సహించి.. శిక్షణ ఇచ్చి**

గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు అత్యధికంగా వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో పంటల సాగులో ముందుంటున్న ఔత్సాహిక మహిళలకు డ్రోన్ల వినియోగంపై నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఏ రకమైన పంటకు ఎలా పిచికారీ చేయాలి, ఎంత మోతాదులో రసాయన ఎరువుల మిశ్రమం కలపాలనే అంశాలను నేర్పిస్తున్నారు. ప్రయోగాత్మకంగా కొందరికి డ్రోన్లను, రూ. 10 లక్షల విలువ చేసే పరికరాలను వంద శాతం రాయితీతో పంపిణీ చేయగా ఉమ్మడి జిల్లాలో ఈ శిక్షణను అందిపుచ్చుకుని పురుగు మందు పిచికారీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**అరుదైన అవకాశం**

సంఘంలో సభ్యురాలిగా చేరి డ్రోన్ ఆపరేటర్‌గా ఎదగడం సంతోషం. రెండేళ్ల క్రితం డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇచ్చి పరికరాలు పంపిణీ చేశారు. పురుగుమందులు పిచికారీ చేస్తూ ఉపాధి పొందుతున్నాం. గతేడాది పీఎం మోదీతో సమావేశంలో పాల్గొనే అవకాశం దక్కడం అదృష్టం. తన్నీరు శ్రీలత, పోత్గల్, ముస్తాబాద్ మండలం

**మహిళల ఆదాయం రెట్టింపు**

స్వశక్తి సంఘాల మహిళల ఆదాయం రెట్టింపు చేసేందుకు డ్రోన్ పరికరాలు పంపిణీ చేస్తున్నాం. పంటల సాగులో ఆధునిక విధానంతో రైతులకు పెట్టుబడుల ఖర్చు తగ్గుతోంది. కూలీల కొరతతోపాటు సమయం ఆదా అవుతుంది. శ్రీనివాస్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి, పెద్దపల్లి

# మూసీ ప్రక్షాళనకు సంయుక్త కార్యాచరణ

హైదరాబాద్ : మూసీ నది ప్రక్షాళనలో జలమండలితోపాటు మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు కీలకంగా వ్యవహరించనున్నాయి. నగర పరిధిలో ఏర్పడే మురుగునీటిని.. వందశాతం శుద్ధిచేయడం లక్ష్యంగా సంబంధిత కేంద్రాలను కీలక ప్రాంతాల్లో జలమండలి ఏర్పాటు చేస్తోంది. అనంతరం మురుగును మూసీలోకి వదులుతారు. జలమండలి, మూసీ కార్పొరేషన్ సంయుక్తంగా వివిధ అంశాలపై దృష్టిసారించాయి. మురుగు శుద్ధి కేంద్రాలకు అనుసంధానించాల్సిన పైపులైన్ల కోసం.. మూసీ కార్పొరేషన్‌తో కలిసి జలమండలి కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రస్తుతం ఓఆర్ఆర్ వరకు నగరంలో రోజుకు 1950 ఎంఎల్‌డీల మురుగు వెలువడుతుండగా.. ఇప్పటికే 772 ఎంఎల్‌డీల సామర్థ్యం కలిగిన ఎస్టీపీలతో శుద్ధి చేస్తున్నారు. మరో 653 ఎంఎల్‌డీల మురుగు శుద్ధి కేంద్రాల్లో కొన్ని అందుబాటులోకి రాగా.. మరికొన్ని తుదిదశలో ఉన్నాయి. 2036 నాటికి నగరంలో ఏర్పడే మురుగును 2800 ఎంఎల్‌డీలుగా అంచనా వేశారు. ఈ క్రమంలో 'అమృత్ 2.0'లో భాగంగా ఏర్పాటు చేయనున్న



39 ఎస్టీపీలను కీలకమైనవిగా జలమండలి భావిస్తోంది. ఇవి ఓఆర్ఆర్‌లోపల ఉన్న కీలకమైన చెరువుల వద్ద ఏర్పాటుకానున్నాయి. వీటిల్లో వంద ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఉస్కబావి వద్ద, 98.5 ఎంఎల్‌డీల సామర్థ్యంతో తిమ్మక్క చెరువు వద్ద నిర్మించనున్నవి అతిపెద్దవి. మిగిలినవి 37ఎంఎల్‌డీల కంటే తక్కువ సామర్థ్యం కలిగినవి. కొత్తవాటిలో కొత్వాలగూడవద్ద ఒక ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఏర్పాటు కానున్నది అతి చిన్న ఎస్టీపీ. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వద్ద ఎస్టీపీల పనులు పురోగతిలో ఉన్నాయి.

# కనెక్షన్.. కరప్షన్

హైదరాబాద్ : ఐటీ కారిడార్‌లో 50 మీటర్ల ఎత్తులో భవనం నిర్మిస్తే ఎలాంటి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) లేకుండానే విద్యుత్తు కనెక్షన్ ఇచ్చారు. అక్కడ ప్రమాదం జరిగిన తర్వాత విషయం తెలిసింది.

బంజారాహిల్స్ బీఎన్‌ఆర్ హిల్స్‌లో జీహెచ్‌ఎంసీ అనుమతి లేకుండానే భవనాలు వెలుస్తున్నాయి. అక్కడ అక్రమంగా విద్యుత్తు కనెక్షన్లు ఇస్తున్నారు. నగరంలో నిర్మించే భవనాల ఎత్తు 10 మీటర్లు దాటితే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తప్పనిసరి. చాలాచోట్ల మూడు అంతస్తులకు అనుమతి తీసుకుని నాలుగైదు అంతస్తులు నిర్మిస్తున్నారు. సెట్‌బ్యాక్‌లు వదలకుండా అపార్ట్‌మెంట్లు కడుతున్నారు. ఇంకొందరు అసలు అనుమతి లేకుండా నిర్మిస్తున్నారు. వీటికి నిబంధనలకు విద్యుత్తు కనెక్షన్లు జారీ అవుతుండటం గమనార్హం.

**ఐదేళ్ల అనుమతులపై ఆరా..**

ఈ అక్రమాలపై శివార్ల నుంచి ఫిర్యాదులు వస్తుండటంతో వాటిపై టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ నిఘా పెట్టారు. హెచ్ఎండీఏ నుంచి 2020–



25 వరకు అనుమతులు, ఆక్యుపెన్సీ ఇచ్చిన సర్టిఫికెట్ల డేటాని డిస్కం సేకరించింది.

**కోర్టు ఆదేశాలతో..**

నిబంధనలు పాటించని నిర్మాణాలకు ఓసీ వచ్చే అవకాశం లేదు. కొందరు నకిలీ ఓసీ సమర్పించి కనెక్షన్లు పొందారు. వీరికి కొంతమంది సిబ్బంది సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. కోర్టుకు వెళ్లి తాత్కాలిక కనెక్షన్ జారీకి అనుమతి తెచ్చుకోవాలని చెప్పి దగ్గరుండి వ్యవహారం నడిపిస్తున్నారు. కోర్టు ఆదేశాల ప్రకారం తొలుత ఆరు నెలలు.. ఈ గడువు తీరిన తరువాత మరో ఆరు నెలలు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. ఆక్యుపెన్సీ లేనిదే కరెంట్ కనెక్షన్లు ఇవ్వొద్దని హైకోర్టు ఆదేశించడంతో ప్రస్తుతం కొత్తవాటి జారీ నిలిచిపోయింది.

# ఏదైనా 22 తర్వాతే

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా వ్యాపారులు, అన్ని వర్గాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్న తేదీ 22. కొత్తగా తీసుకునే బీమా పాలసీలు.. కారు, బైకు, టీవీతో పాటూ ఇతర గృహోపకరణాల వరకు ఏదైనా ఈ నెల 22 వరకు ఆగాల్సిందే అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ తేదీ నుంచి కొత్త జీఎస్‌టీ శ్లాబులను వర్తింపజేస్తుంది. బీమా పాలసీలపై జీఎస్‌టీ 18శాతం నుంచి సున్నాకు తగ్గనుంది. కార్లు, బైకులు, టీవీలపై ఏకంగా లక్ష నుంచి లక్షన్నర రూపాయల వరకు ఆదా కానుంది. కాబట్టి అప్పటివరకు వేచి చూస్తామంటున్నారు కొనుగోలుదారులు. ఇప్పటి లోటు.. అప్పుడు భర్తీ..జీఎస్‌టీ రేట్ల సవరణ ప్రకటన వెలువడిన నాటి నుంచి ధరలు తగ్గే ఆయా ఉత్పత్తుల విక్రయాలు పడిపోయాయి. గతంలో బుక్ చేసుకున్న వారు కూడా రద్దు చేసుకుంటున్నారని వ్యాపారులు అంటున్నారు. కార్ల షోరూంలైతే వెలవెలబోతున్నాయి. దీంతో ఓ కార్ల కంపెనీ సెప్టెంబరు 22 దాకా ఎందుకు.. ఆ ప్రయోజనాలు ఇప్పటినుంచే కల్పిస్తామని హామీ ఇస్తోంది. జీఎస్‌టీ తగ్గింపుతో..వ్యాపారం మరింత ఎక్కువ ఉంటుందని వ్యాపార సంస్థల అంచనా. ఇప్పటి లోటు అప్పుడు భర్తీ అవుతుందనే భరోసాలో ఉన్నాయి.

## పెయ్యదూడలే పుడతాయ్..!

భానుపురి : రాష్ట్ర ప్రభుత్వం మేలుజాతి పశు సంతతి, పాల ఉత్పత్తిని వృద్ధి చేసేందుకు కృషి చేస్తోంది. ఇందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టి పాడి రైతులకు రాయితీపై మేలుజాతి వీర్యం(సైపర్ బ్రీడ్) సరఫరా చేస్తోంది. ఇందుకు ఆడ, పెయ్య దూడలు పుట్టేలా పశు సంవర్ధకశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీటితో జిల్లాలో ఉత్పత్తి పెరగడంతోపాటు పాల వృద్ధి కూడా గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో 1,89,000 వరకు ఆవులు, గేదెలు ఉన్నాయి. సాధారణంగా వీర్యం ఎక్కిస్తే 50 శాతం ఆడ, పెయ్య దూడలు జన్మిస్తాయి. అలా కాకుండా మేలు జాతి వీర్యం వినియోగిస్తే 90 శాతం ఆడ, పెయ్య దూడలు జన్మించే అవకాశం ఉంది. ఇందుకు ప్రభుత్వానికి ఒక్కో ఇంజెక్షన్‌కు రూ.600 ఖర్చు అవుతుండగా, పాడి రైతులకు రాయితీపై రూ.250కే అందిస్తోంది. దీనిపై పశువైద్య



సిబ్బంది, గోపాలమిత్రలు క్షేత్రస్థాయికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ప్రతి పశువైద్యశాల నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి నెలా 30కిపైగా పశువులకు ఇంజెక్షన్లు వేయాలని లక్ష్యం నిర్ణయించారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని పశువైద్య కేంద్రాల్లో మేలుజాతి వీర్యాన్ని అందుబాటులో ఉంచడంతో ఏడాదిలో మేలుజాతి పశువులు, పాల ఉత్పత్తి పెరిగే అవకాశాలున్నాయి. పాల ఉత్పత్తి పెరుగుతుంది: శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారి, సూర్యాపేట

జిల్లాలోని పశువుల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాల ఉత్పత్తికి మంచి తరుణం. దీంతోపాటు మేలు జాతి రకం పశువులు కూడా పెరిగే అవకాశం ఉంది. రైతులు ముందుకొచ్చి సహకరించాలి.

## స్థానిక ఎన్నికలకు సిరా సీసాలు

భానుపురి: ఎన్నికల్లో ఓటు వేసింది.. వేయనిది తేల్చేందుకు చేతి వేలికి గుర్తుపెడతారు. ప్రతి పోలింగ్ సమయంలో సిరా చుక్కను వేలికి రాస్తారు. అలాంటి గుర్తుపెట్టే రంగు సిరా సీసాలు జిల్లాకు కేటాయించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వీటిని వినియోగించనున్నారు. స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఉపయోగించేందుకు సిద్ధంగా ఉన్న సిరా సీసాల్ని తీసుకెళ్లాలంటూ పంచాయతీరాజ్ డైరెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మన జిల్లాకు కేటాయించిన వాటిని హైదరాబాద్‌లోని ప్రింటింగ్, స్టేషనరీ విభాగం నుంచి ఈ నెల 18న జడ్పీ అధికారులు తేనున్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్‌ను అధికారులు పూర్తిచేశారు. ఈ మేరకు 1740 గ్రామ పంచాయతీలలోని 20,880




వార్డుల ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టారు. కేంద్ర ఎన్నికల సంఘం ఖరారు చేసిన తాజా ఓటర్ల జాబితాను అనుసరించి స్థానిక ఎన్నికలకు ఓటర్ల జాబితా మ్యాపింగ్ చేశారు. మండల పరిషత్తు కార్యాలయాల్లో గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఈ ప్రక్రియ చేపట్టారు. గ్రామ పంచాయతీల వారీగా ఓటర్ల జాబితా ఖరారైన తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వారీగా జాబితా రూపొందిస్తారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు ఎన్ని అవసరముంటాయో పరిశీలించి ఆర్డర్ పెట్టి తీసుకొస్తామని జడ్పీ సీఈవో అప్పారావుకు తెలిపారు.

## విద్యార్థి ప్రతిభకు.. విజ్ఞాన్ మంథన్

సంగారెడ్డి : విద్యార్థుల పరిశోధనలు, ప్రయోగాలపై దృష్టి సారించేలా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా విజ్ఞాన భారతి, విజ్ఞాన్ ప్రసార్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) సంయుక్త ఆధ్వర్యంలో విజ్ఞాన్ మంథన్ పేరిట ప్రతిభా పరీక్ష ప్రతి ఏటా నిర్వహిస్తోంది. ప్రస్తుతం దరఖాస్తులు ఆహ్వానించారు.

**దరఖాస్తు ఇలా..**6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు ప్రతిభ పరీక్ష రాసేందుకు అర్హులు. విద్యార్థులు %http://vvm.org.in% వెబ్‌సైట్‌లో సెప్టెంబరు 30 వరకు దరఖాస్తు చేయాలి. రూ.200 రుసుం చెల్లించాలి. జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహిస్తారు. అక్టోబరులో లెవల్–1 పరీక్షలు జరుగుతాయి.పరీక్షా విధానం..సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి పెంచేలా చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యం. 6, 7, 8 తరగతుల విద్యార్థులు జూనియర్, 9, 10, 11 తరగతుల వారు సీనియర్ విభాగంలో జరిగే పరీక్షలకు హాజరుకావాలి. తెలుగు, ఆంగ్లం, హిందీతో పాటు 14 భాషల్లో పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. అధునాతన చరవాణి, ట్యాబ్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ఏదైనా వినియోగించుకోవచ్చు. జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిస్తే ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్ ఇస్తారు. ఉపకార వేతనాలు ఇలా..3పాఠశాల స్థాయిలో 18 మందిని ఎంపిక చేస్తారు. జిల్లా స్థాయిలో ఒక్కో పాఠ్యాంశానికి ముగ్గురి చొప్పున రాష్ట్రస్థాయికి పంపిస్తారు. ఈ దశలో విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల ఉపకార వేతనం, ధ్రువపత్రం, జ్ఞాపిక ఇస్తారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయికి పంపిస్తారు. ఇక్కడ విజేతలకు తొలి బహుమతిగా రూ.26 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.10 వేలు అందిస్తారు. భాస్కర స్కాలర్‌షిప్ పేరిట ఏడాది పాటు నెలకు రూ.2 వేలు చెల్లిస్తారు.

# భద్రాచలం కొండ.. అభివృద్ధికి అండ



భద్రాచలం : రామాలయం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. నూతన నిర్మాణాలకు ప్రణాళిక తయారు చేయాలని మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల, పొంగులేటి భావిస్తున్నారు. భద్రాచలాన్ని యాదగిరి గుట్ట తరహాలో అభివృద్ధి చేయాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గతంలో నిర్వహించిన సమీక్షల్లో ప్రస్తావించారు. దీంతో దేవాదాయశాఖలో కదలిక వచ్చింది. ఇలాంటి నిర్మాణాలలో విశేష అనుభవమున్న సీనియర్ ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ, స్థపతి వల్లినాయగంలను ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఉంటున్న వీరిద్దరితో పాటు ఇదే రంగంలో అనుభవం ఉన్న ఇంజినీర్ల సలహాలు, సూచనలు తీసుకునే అవకాశం ఉంది. రెండ్రోజుల్లో సర్వే పనులు మొదలు కానున్నాయి.

**సువిశాల ప్రాంగణం కోసం...**

కోవెలకు మూడు వైపులా ఉన్న 41 ఇళ్ల నిర్వాసితులకు పరిహారంతో పాటు కాలనీ ఏర్పాటుకు రూ.60.20 కోట్లు అవసరం ఉండగా ఇప్పటికే రూ.34.45 కోట్లు మంజూరయ్యాయి. ముప్పై మందికి పైగా నిర్వాసితులు తమ ఇళ్లను ఖాళీ చేయగా మిగతావారు వారంలో చేస్తారు. ఇలా స్వాధీనం చేసుకున్న 1.3 ఎకరాల్లో మళ్లీ ఆక్రమణలకు ఆస్కారం లేకుండా బోర్డులు, కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మిథిలా ప్రాంగణం 3 ఎకరాలు ఉంది. 2 ఎకరాల్లో ప్రధాన ఆలయ పరిసరాలున్నాయి. దీనికి ఆనుకుని మాడవీధి విస్తరణ కోసం 1.3 ఎకరాలు కలవనుంది. ఈ మొత్తం 6.3 ఎకరాల్లో బృహత్తర ప్రణాళిక అమలు చేయనున్నారు.

**ఆధ్యాత్మిక పర్యాటకం**

రామాలయ దర్శనానికి నిత్యం ఐదారు వేల మంది వస్తుండగా సెలవు రోజుల్లో ఇది పెరుగుతోంది. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 23.74 లక్షల మంది వచ్చారు. అదే ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 13.69 లక్షల మంది దర్శించుకున్నారు.

ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో 14.78 లక్షల మంది వచ్చారు. భక్తుల సంఖ్య రానున్న రోజుల్లో పెరిగే వీలుంది. ఇక్కడి ఆధ్యాత్మిక పర్యాటక అవసరాలను తీర్చేలా రూ.200 కోట్లతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేస్తారని సమాచారం. అవసరమైతే ఇంకొంత స్థల సేకరణ ఉంటుంది.

మాడవీధుల్లో ఎత్తుపల్లాలు లేకుండా పనులు చేయాలని నిర్ణయించారు. ఇది సాకారమైతే భద్రగిరిపై ప్రధాన ఆలయం మరింత సుందరంగా కనిపించనుంది.

**నిపుణులను పిలిపిస్తున్నాం**

రవీంద్రనాథ్, రామాలయం ఈఈ

బృహత్తర ప్రణాళిక అమలుకు నిపుణులు త్వరలోనే ఇక్కడకు రానున్నారు. నూతన నిర్మాణాల గురించి స్పష్టత రావాల్సి ఉంది. భవిష్యత్తు అవసరాలను తీర్చేలా పనులు ఉంటాయి.

# బిల్లులు చెల్లిస్తే.. మన బడులు బాగు!



పాల్వంచ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా 2022లో భారాస సర్కారు 'మన ఊరు– మన బడి' పథకాన్ని ప్రవేశపెట్టింది. భోజనశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీలు, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టింది. సింహభాగం పనులు పూర్తయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఆ పథకం స్థానంలో 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'ని తీసుకొచ్చింది. కొత్త పథకానికి 2024 మే మాసంలో శ్రీకారం చుట్టింది. పెద్ద పనులు కాకుండా చిన్నపాటి పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకం కింద పూర్తిచేశారు. 'మన ఊరు– మన బడి' పథకంలో పూర్తయిన పనులతో పాటు మిగిలిన పనులకు కొంతమేర నిధులు మంజూరు చేస్తే ప్రభుత్వ బడుల్లో సమస్యలు దూరం కానున్నాయి.

**బకాయిలు.. రూ.21 కోట్లు** 'మన ఊరు– మన బడి' పథకం కింద ఖమ్మం జిల్లాలో 426 పాఠశాలల్లో రూ.62 కోట్లతో, భద్రాద్రి జిల్లాలో 368 బడుల్లో రూ.60.18 కోట్లతో పనులు చేపట్టారు. ఉభయ జిల్లాల్లో 90 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.21 కోట్ల బకాయిలు మంజూరైతే భోజనశాలలు, మరుగుదొడ్లు, ప్రహరీలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలను పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయి. మన ఊరు– మన బడి పథకం బిల్లుల మంజూరు కోసం గుత్తేదారులు ఎదురుచూస్తున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పథకంలో ఖమ్మం జిల్లాలో 955 పాఠశాలల్లో రూ.35 కోట్లతో, భద్రాద్రి జిల్లాలో 859 పాఠశాలల్లో రూ.25 కోట్లతో ఏడాది వ్యవధిలోనే పనులు పూర్తిచేయటం విశేషం. బిల్లులు సైతం ఎప్పటికప్పుడు గుత్తేదారులకు చెల్లించారు.

'మన ఊరు– మన బడి పథకం పనుల పురోగతిపై మండలాల వారీగా ఎంఈఓల ద్వారా నివేదికలు తెప్పిస్తాం. అసంపూర్తి పనుల గురించి కలెక్టర్‌కు తెలియజేస్తాం' అని భద్రాద్రి కొత్తగూడెం డీఈఓ బి.నాగలక్ష్మి కు తెలిపారు.

# ఆరంభం అదిరింది.. అనంతరం చెదిరింది



భద్రాచలం : భద్రాచలం పట్టణంలో ప్లాస్టిక్ వాడకానికి సంబంధించిన నిబంధనలను గోదావరిలో కలిపేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు సరకులను విక్రయించే క్రమంలో పార్సిల్ చేయటానికి ప్లాస్టిక్ సంచులనే అంటకడుతున్నారు. వినియోగదారులు ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించకుండా కాలకూట విషాన్ని చేత పట్టుకుని తిరుగుతున్నారు. ప్లాస్టిక్ వాడకం రోజూ సుమారు 2వేల కిలోలు ఉంటుందని అంచనా. ఇందులో 1,500 కిలోలు రీసైక్లింగ్‌కు ఉపకరిస్తుండటంతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. మిగతా 500 కిలోల ప్లాస్టిక్ భూతం ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

**పూర్వవైభవం రావాలి** పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలం పట్టణాన్ని పర్యావరణ హిత ప్రాంతంగా చాన్నాళ్ల క్రితమే ప్రకటించారు. 2019 సెప్టెంబరు నుంచి ప్లాస్టిక్ రహిత భద్రాచలాన్ని తీర్చిదిద్దారు. కేంద్ర ప్రభుత్వం 2022 జులై 1 నుంచి ప్లాస్టిక్ వాడకంపై ఆంక్షలు విధించింది. వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. వివిధ సంస్థలు, సంఘాల ప్రతినిధులు వీధుల్లో తిరిగి ప్రచారం చేశారు. ప్లాస్టిక్ సంచి కనిపిస్తే అధికారులు జరిమానా విధించారు. అప్పట్లో ప్లాస్టిక్ సంచుల విక్రయాలతో పాటు వినియోగమూ ఆగింది. ఆ తర్వాత అధికారులు పట్టించుకోకపోవటంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. దుకాణాల్లో ప్లాస్టిక్ సంచులను విక్రయిస్తున్నారు. హోటళ్లు, పండ్ల దుకాణాలు, శాకాహారం, మాంసాహార మార్కెట్‌లో ప్లాస్టిక్ వినియోగం ఆగితేనే భద్రాచలం పట్టణానికి పూర్వవైభవం వస్తుంది.

**ప్రత్యామ్నాయాలపై అవగాహన కల్పించాలి**

రామాలయంలో ప్రసాదాలకు ఉపయోగించే కవర్లతో ఇబ్బంది లేదు. ఆలయ సమీపంలో కొందరు వ్యాపారులు పూజా ద్రవ్యాలను విక్రయించే క్రమంలో కొబ్బరికాయలు, అంగర్‌బత్తీలు కలిపి ప్లాస్టిక్ సంచిలో పెట్టి ఇస్తున్నారు. వీటిని తనిఖీ చేయాలి.

100 మైక్రాన్ల లోపు సంచులను వాడకూడదనే నిబంధనలను పట్టించుకోవటం లేదు. ఇలాంటి సంచులన్నీ డంపింగ్ యార్డుకు చేరిన తర్వాత పనికొచ్చే ప్లాస్టిక్‌ను ఏరుకుని మిగతాది కాల్చేస్తుండటంతో పొగ అలముకుని శ్వాస సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వరదల తరుణంలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు గోదావరిలో కలుస్తుండటంతో నీరు కలుషితమవుతోంది. కొన్నిరకాల ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలవటానికి కొన్ని తరాలు పడుతుంది. వీటివల్ల భావితరాలకు కలిగే ఆరోగ్య సమస్యల గురించి వివరించాలి.

గోవులు ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఆలయ పరిసరాలతో పాటు గోదావరి వద్ద వస్త్రంతో తయారుచేసిన ఫ్లెక్సీలు అమర్చి భక్తుల సహకారం కోరాలి. వస్త్రంతో తయారైన సంచులను తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావాలి. కాగితం, జనపనార, విస్తరాకులు, స్టీలు పాత్రలు వినియోగించాలని అవగాహన కల్పించాలి.

భక్తులు, భద్రాచలం పట్టణవాసులు ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నాయాలను పరిశీలించాలి. మైక్ ద్వారా ప్రచారం చేస్తూ సహకరించాలని కోరుతాం. అధికారుల ఆదేశాలతో దుకాణాలను తనిఖీ చేస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా విధిస్తాం.– శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ ఈఓ, భద్రాచలం

## మూగ వేదన.. రైతుల యాతన

బోధన్ : ఇది బోధన్ మండల పశువైద్యశాఖ కేంద్రం. ఇక్కడ రెండేళ్లుగా ఇన్‌ఛార్జి వైద్యుడే కొనసాగుతున్నారు. ఆయన కోటగిరి, పోతంగల్ పశువైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో గత కొన్నాళ్లుగా పశువైద్యులు, ఇతర సిబ్బంది కొరత ఉంది. మొత్తం నాలుగు ప్రాంతీయ పశు వైద్యశాలలు, 36 ప్రాథమిక వైద్యశాలలు, 41 ఉపకేంద్రాలు ఉన్నాయి. జిల్లా పశు వైద్యాధికారి ఉద్యోగ విరమణ చేయడంతో కొన్ని నెలలుగా ఆ పోస్టులో ఇన్‌ఛార్జి అధికారి కొనసాగుతున్నారు. మండల పశువైద్యుల పోస్టుల్లోనూ ఖాళీలు ఉండటంతో సమీప మండలానికి చెందిన అధికారులకు అదనపు బాధ్యతలు ఇచ్చారు.జిల్లాలో లక్షల్లో పశువులు, జీవాలు ఉన్నప్పటికీ పశు వైద్యశాలలకు కొన్ని నెలలుగా అవసరమైన మందులు సరఫరా కావడం లేదు. దీంతో పశువులకు, జీవాలకు సకాలంలో.. సరైన వైద్యం అందడం లేదని రైతులు వాపోతున్నారు. పశువులను చికిత్స నిమిత్తం తాము దవాఖానాలకు తీసుకెళ్తే మందులు



బయట కొనుక్కోవాలని పశువైద్యులు సూచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక ప్రైవేట్ దుకాణాల్లో కొంటున్నామని చెబుతున్నారు. కొన్నిచోట్ల సరైన సమయానికి మందులు లభించక పశువులు మృత్యువాత పడిన ఘటనలూ వెలుగుచూశాయి. ప్రస్తుతం వానాకాలం కావడంతో వాటికి వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికైనా సరిపడా మందులు అందించాలని పాడిరైతులు కోరుతున్నారు.

**వారంలో సరఫరా చేస్తాం**

**రోహిత్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి**

కొన్ని నెలల నుంచి మందులు అందుబాటులో లేవు. ఈ విషయమై ఇది వరకే ప్రభుత్వానికి నివేదించడంతో రెండు రోజుల కిందట జిల్లాకేంద్రానికి మందులు వచ్చాయి. వాటిని పరిశీలించి మండలాల వారీగా విభజించి పశు వైద్యశాలలకు సరఫరా చేస్తాం. వైద్యుల కొరత ఉన్నా పశువులకు వైద్యం అందేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. పశువైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలు ప్రభుత్వ పరిధిలో ఉంది. ఖాళీల వివరాలు సర్కారుకు నివేదించాం.

## మేల్కొంటారా.. ముప్పు తప్పిస్తారా!

సంగారెడ్డి : ఉమ్మడి మెదక్ జిల్లాలో సాగుకు, హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని అందించే సింగూరు జలాశయం భద్రతపై నీటిపారుదల శాఖ అధికారులు మేల్కోవాల్సిన తరుణమిది. ఇటీవల ప్రాజెక్టును పరిశీలించిన ఎన్‌డీఎస్‌ఏ(నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) బృందం సదరన్ రీజియన్ డైరెక్టర్.. జలాశయం హైరిస్క్‌లో ఉందని, తక్షణమే బలోపేతం చేయాలని పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం 16.5 టీఎంసీలకు మించవద్దని నిర్దేశిస్తూ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ ఆగస్టు 8న స్థానిక ప్రాజెక్టు అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మూడేళ్ల కిందటే మట్టికట్ట, రివిట్‌మెంటు దెబ్బతిన్నట్లు గుర్తించిన అధికారులు తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికతోనైనా ప్రాజెక్టు భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరముంది.

**ప్రధాన సూచనలివి..**

రిజర్వాయర్ నీటి నిల్వ ప్రాంతంలో మట్టికట్ట, రివిట్‌మెంట్ దెబ్బతిన్నాయని ఎన్‌డీఎస్‌ఏ అధికారులు నివేదికలో వెల్లడించారు. పారపెట్ గోడ, మట్టికట్ట పైభాగంలో పగుళ్లు ఉన్నట్లు తెలిపారు.

రిజర్వాయర్ అసలు(ఒరిజినల్) డిజైన్ మేరకు ఎఫ్‌ఆర్‌ఎల్ 517.8 మీటర్ల వరకే నీటిని నింపాలని అధికారులు స్పష్టం చేశారు. మిషన్ భగీరథ, సాగునీటి అవసరాల నిమిత్తం సామర్థ్యాన్ని మించి పూర్తిస్థాయి వరకు నీటిని నిల్వ చేస్తున్నారని వెల్లడించారు. ఇది ప్రమాదమని తేల్చారు. దిగువన మంజీరా, నిజాంసాగర్ ప్రాజెక్టులున్నాయని ఈ నేపథ్యంలో సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల అంశాన్ని అత్యంత కీలకంగా పరిగణించి చేపట్టాలని సూచించారు.

మూడేళ్ల క్రితమే నిధులొచ్చినా..ప్రాజెక్టు మట్టికట్ట, రివిట్‌మెంట్ మరమ్మతులకు మూడేళ్ల క్రితమే రూ.16.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాతో పాటు మిషన్ భగీరథ పథకం నిమిత్తం నీటి సరఫరాకు ఈ ప్రాజెక్టు నీటినే వినియోగిస్తున్నారు. తాగునీటి అవసరాల ప్రాజెక్టు అనే కారణంగానే నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కీలక మరమ్మతులు చేపట్టాలని నివేదికలు స్పష్టం చేస్తున్నప్పటికీ ఆ శాఖ అధికారులు ఇప్పటికీ కార్యాచరణ చేపట్టలేదు.

**ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా..**

నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాజెక్టులో నీటి నిల్వలను ఎఫ్‌ఆర్‌ఎల్ మేరకే ఉంచాలని నిర్ణయించాం. ఇందులో భాగంగానే నీటిని దిగువకు విడుదల చేస్తున్నాం. మట్టికట్టతో పాటు రివిట్‌మెంట్‌కు తాత్కాలికంగా సిమెంటు సంచులతో మరమ్మతులు చేపట్టాం. వేసవిలో పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. మరోసారి ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు భద్రతను పరిశీలింపజేస్తాం. వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపడతాం.పోచమల్లు, ఎస్‌ఈ, నీటిపారుదల శాఖ, సంగారెడ్డి

## ప్లాస్టిక్ రహితం.. మల్లన్న ఆలయం

చేర్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం గత రెండేళ్లుగా ప్లాస్టిక్ రహితంగా కొనసాగుతోంది. స్థానిక వ్యాపార వర్గాలకు ఆదర్శంగా నిలిచేలా ఆలయ వర్గాలు నిషేధిత పాలిథీన్ సంచుల వాడకాన్ని పూర్తిగా నియంత్రించారు. ఇందుకోసం జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి ఆలయ వర్గాలతో కలిసి కృషి చేశారు. చివరకు 2023 నుంచి భూమిలో త్వరగా కలిసిపోయే కంపోస్టబుల్ సంచులను వినియోగిస్తున్నారు. ప్రముఖులు, కల్యాణ, అభిషేకం చేసిన భక్తులకు లడ్డూ ప్రసాదాన్ని మాత్రం కాగితపు అట్టల్లో పంపిణీ చేస్తున్నారు. ఇక సాధారణంగా ప్రసాదాలను మాత్రమే భక్తులకు సంచుల్లో అందజేస్తారు. ఏటా ఆలయానికి సుమారు 30 లక్షల మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు.ప్రతి సంవత్సరం సుమారు 18లక్షల లడ్డూలు, 8లక్షల పులిహోర సంచులు విక్రయం అవుతున్నాయి. ఈ లెక్కన ప్రతి ఏటా 25లక్షలకు పూగా ప్రసాదాల కోసం సంచులు అవసరమవుతున్నాయి. ప్రసాదం తీసుకున్న ప్రతి భక్తుడికి సంచుల్లోనే వేసి ఇస్తున్నారు. ఆలయ పరిసరాల్లో వ్యాపారాలు చేసేవారు నిషేధిత ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే ముందుగా హెచ్చరించి, అనంతరం జరిమానా విధిస్తున్నారు. పంచాయతీ శాఖ అధికారులతో కలిసి ఆలయ ఆవరణలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ వ్యాపార వర్గాల్లోనూ పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ రహితానికి నిర్వాహకులు కృషి చేస్తున్నారు.

చురకలు



# బడి భయపెడుతోంది!

నక్కపల్లి : విద్యాబుద్ధులు నేర్పే బడుల్లో శిథిల భవనాల రూపంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వాటిపై దృష్టిసారించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా ఆ దిశగా ఇప్పటివరకు అడుగులు పడలేదు.

పాయకరావుపేట దుర్గా కాలనీ పాఠశాలలో నిర్మాణంలో ఉన్న భవనం సన్‌షేడ్ పడి రెండేళ్ల కిందట ఓ విద్యార్థి మృతి చెందారు. ఏడాది కిందట నంద్యాల జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూలి ఓ విద్యార్థి మృత్యువాత పడగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులున్న పాఠశాలలు అనకాపల్లి జిల్లాలోనూ ఉన్నాయి. చాలా పాఠశాలల్లో శిథిల గదుల్లోనే తరగతులు జరుగుతున్నాయి. నక్కపల్లి మండలం పెదబోదుగల్లం ఉన్నత పాఠశాలలో తరగతి గదులు కూలేలా ఉన్నాయి. ప్రత్యామ్నాయంగా సమీపంలోని తరగతి గదులను వినియోగిస్తున్నారు. నిరుపయోగ భవనాలతో ఎప్పటికైనా ముప్పు తప్పదని తెలిసినా అధికారులు మిన్నకుండిపోతున్నారు.

జిల్లావ్యాప్తంగా 24 మండలాల పరిధిలో 1,407 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సుమారు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. 149 పాఠశాలల్లో 200 తరగతి గదులు తొలగించాల్సి ఉందని అధికారులు గుర్తించారు. వీటిలో సగం వరకు నక్కపల్లి, రోలుగుంట, రావికమతం, మునగపాక, మాకవరపాలెం, గొలుగొండ, దేవరపల్లి, చోడవరం, బుచ్చెయ్యపేట మండలాల్లోనే ఉన్నాయి.

విద్యార్థుల భద్రత దృష్ట్యా శిథిల భవనాలు ఉంటే తొలగించాలని,



వినియోగానికి పనికి వచ్చేచోట్ల మరమ్మతులు చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ రెండు వారాల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. కూల్చివేత తర్వాత ఖాళీ స్థలాన్ని పరిశీలించి ఆటలాడేందుకు, వృత్తి నైపుణ్యం పెంపు, మధ్యాహ్న భోజన పథకం అమలుకు వినియోగించుకోవాలని సూచించింది. తొలగింపులు/మరమ్మతుల జరిగే సమయంలో విద్యార్థులకు తాత్కాలిక వసతి ఏర్పాటు చేయాలి. వీటి విషయంలో జిల్లా, విద్యాశాఖ యంత్రాంగం పర్యవేక్షణ చేయాల్సి ఉంది.

**అనుమతులు రాగానే తొలగింపు:** పాఠశాలల్లో శిథిల భవనాలను గుర్తించి ఉపాధ్యాయుడు, ఇంజినీరింగ్ సహాయకులు సంయుక్తంగా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఆ వివరాలు నేరుగా అమరావతిలోని విద్యాశాఖ కార్యాలయానికి వెళ్తాయి. జిల్లాలో 200 వరకు పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. ప్రమాదకరంగా ఉన్న భవనాల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలి. ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే భవనాల తొలగింపు చేపడతాం. ఈ నెలాఖరులోగా పూర్తి కావచ్చు.
నరసింహారావు, ఈఈ, సమగ్ర శిక్ష

# 'స్కిట్'లో తరగతులు ఎప్పుడు?

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్)ను జేఎన్‌టీయూ అనంతపురం సొంత కళాశాలగా గుర్తించింది. ప్రభుత్వ ఆదేశాలతో రెండో విడత కౌన్సెలింగ్‌లో విద్యార్థులు ఇక్కడి కళాశాలలో చేరేందుకు అవకాశం కల్పించింది. 68 మంది దరఖాస్తు చేసుకున్నారు.. ఇప్పటివరకు తరగతులు ప్రారంభం కాకపోవడం, ఫీజు ఎలా చెల్లించాలన్న విషయమై స్పష్టత లేకపోవడంతో తమ పిల్లల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనకు గురవుతున్నారు. వైకాపా పుణ్యమా అంటూ మూతపడ్డ ఈ కళాశాలకు పునర్ వైభవాన్ని తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వైకాపా అడ్డగోలుగా మూసేయగా ఎన్నో అడ్డంకులు అధిగమించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇక్కడి కళాశాలను అనంతపురం జేఎన్‌టీయూలో విలీనం చేసేలా చర్యలు చేపట్టారు. రెండో విడత దరఖాస్తుల స్వీకరణ




నేపథ్యంలో సీఎస్ఈ 33, సీఎస్ఎం 18, సీఎస్‌డీ 8, ఈసీఈ 7, ఈఈఈ 2 మొత్తం 68 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో తరగతులు జరుగుతున్నా జేఎన్‌టీయూఏ స్కిట్‌లో మాత్రం అలాంటి ఊసే కనిపించలేదు. ఫీజు చెల్లింపుపై స్పష్టత లేదు. పక్కా భవనాలతో కళాశాల ఉన్నా తరగతుల నిర్వహణ, హాస్టల్ వసతులపై స్పష్టత లేకపోయింది.

**కొరవడిన స్పష్టత**

సోమవారం నుంచి మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో కళాశాల జేఎన్‌టీయూఏలో విలీనమైందని, ఇక తమ పరిధి కాదని శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా ఆదేశాలు వస్తే తప్ప తరగతులు ప్రారంభించలేమని జేఎన్‌టీయూఏ అధికారులు అంటున్నారు. ఇంకా సీఎంవోలో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. సత్వర నిర్ణయం తీసుకోకుంటే మూడో విడత కౌన్సెలింగ్ దృష్ట్యా కొత్తగా చేరడం అటుంచితే వచ్చిన దరఖాస్తులు వెనక్కి వెళ్లే ప్రమాదముంది.

# ప్రభుత్వ స్థలంలోనే మురుగు-శుద్ధి!



పుత్తూరు : పుత్తూరు పట్టణంలోని పుత్తూరు చెరువు, గోవిందమ్మగుంట, నేషనూరు సమీపంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలు నిర్మించాలని అధికారులు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడంతో రూ.13 కోట్ల నిధులు కేటాయించారు. భూసేకరణకు ప్రకటన కూడా జారీ చేశారు. అయితే భూసేకరణకు రూ.13 కోట్లు అవసరమని తేల్చడంతో ప్రభుత్వ భూములు చూడాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. దీంతో ప్లాంట్ల నిర్మాణం మళ్లీ మొదటికొచ్చింది.

**కూటమి ప్రభుత్వం వచ్చాకే కదలిక..**

వైకాపా హయాంలో నిధులు విడుదల చేసినా పనులు చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూసేకరణ ప్రక్రియకు అడుగులు పడ్డాయి. భూసేకరణకు అధిక మొత్తంలో నిధులు వ్యయం చేయాల్సి రావడంతో ప్రభుత్వ భూములు సేకరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు పరిశీలిస్తున్నామని కమిషనర్ మంజునాథగౌడ్ తెలిపారు.

**ఇప్పటికీ కలుషిత నీటితోనే..**

పురపాలికలో 27 వార్డులు ఉండగా.. 20 వార్డుల నుంచి వచ్చే మురుగు నీరంతా పట్టణ పరిధిలోని మూడు చెరువుల్లోనే కలుస్తోంది. ఈ నీటినే పంటలకు వాడుతుండటం గమనార్హం.

వివరాలిలా..
పుత్తూరులో ప్రతిపాదిత నీటిశుద్ధి ప్లాంట్లు: 3
ప్లాంట్లతో శుద్ధి చేయనున్న నీరు: 11 ఎంఎల్‌డీలు
కేటాయించిన నిధులు: రూ.13 కోట్లు

# రంగులు పూసి.. దస్త్రాలు మార్చేసి!!



విశాఖపట్నం :పెద్దరుషికొండ సమీపంలో రూ.కోట్ల విలువైన పార్కు స్థలంపై అక్రమార్కుల కన్నుపడింది. లే-అవుట్‌కు ఎప్పుడో భూములిచ్చిన కుటుంబాల వారసులను తెరపైకి తెచ్చి నకిలీ పత్రాలతో అమ్మేందుకు అడుగులు వేస్తున్నారు. స్థానిక వైకాపా నాయకులు కొందరు తెరవెనకుండి ఈ తతంగాన్ని నడిపిస్తున్నారు. ఇటీవల నకిలీ పత్రాలతో భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై పీఎంపాలెం స్టేషన్ పరిధిలో నాలుగు కేసులు నమోదయ్యాయి. ఆ తరహా మాయగాళ్లే ఇక్కడా అవకాశం కోసం కాచుక్కూర్చున్నారు.

రౌడీమూకల పహారా: సత్యసాయి నగర్‌లో కృష్ణా కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఉంది. దీని ఎల్‌పీ నెంబరు 22/84. పెద్దరుషికొండ పంచాయతీగా ఉన్న సమయంలో ఈ లేఅవుట్‌లోని 50 సెంట్ల పార్కు స్థలంలో ప్రజావసరాలకు వాటర్ ట్యాంకు నిర్మించారు. గత వైకాపా ప్రభుత్వంలో 2020లో పార్కు స్థలంలో కొందరు పాగా వేశారు. ఇది తమకు తాతల నుంచి వచ్చిందని, దస్త్రాలున్నాయని చెప్పుకొచ్చారు. అందులో ఓ షెడ్డు నిర్మాణం చేపట్టి, పార్కులోకి ఎవరూ రాకుండా రౌడీ మూకలను పహారాగా పెట్టడం కలకలం రేపింది. స్థానికుల ఫిర్యాదుతో జీవీఎంసీ అధికారులు పార్కు స్థలం చుట్టూ సిమెంట్ స్తంభాలతో రక్షణ కంచె ఏర్పాటు చేశారు. వీటిపై జీవీఎంసీ స్థలం అని రాశారు. ఎవరైనా ఆక్రమిస్తే శిక్షార్హులంటూ వాటర్ ట్యాంకుపైనా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. **విక్రయించే పన్నాగం:** ప్రస్తుతం 2,400 గజాల పార్కు స్థలం విలువ దాదాపు రూ.20కోట్లకు పైగానే ఉంటుంది. రికార్డుల ప్రకారం పార్కు స్థలం అని ఉన్నా...సొంత స్థలంగా చూపించేందుకు స్థానిక వైకాపా నాయకుడు ఒకరు ప్రయత్నాలు సాగిస్తున్నాడు. ఇక్కడి పరిస్థితిపై జోన్-2 ఏసీపీ శాస్త్రి సబ్నాన్‌తో మాట్లాడగా... సచివాలయ కార్యదర్శులను క్షేత్రస్థాయికి పంపి విచారణ చేయించగా... పార్కు స్థలమని నిర్ధారణ అయిందన్నారు.

**జీవీఎంసీ పేరు కనిపించకుండా:** సాధారణంగా భూసేకరణ జరిగిన తర్వాతే హద్దులు నిర్ణయించి లే-అవుట్ మ్యాప్ సిద్ధం చేసి ప్లాట్లుగా విభజిస్తారు. అయితే చిత్రంగా.. లేఅవుట్‌లో పార్కుకు వదిలిన 50 సెంట్ల స్థలం మేం అమ్మలేదంటూ, అప్పట్లో భూములిచ్చిన వారి వారసుల పేరుతో కొందరు తెరపైకి వచ్చారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. విలువైన స్థలం కబ్జాకు పావులు కదిపారు. రక్షణ కంచె స్తంభాలపై రాసిన 'జీవీఎంసీ స్థలం' అనే అక్షరాలు కనిపించకుండా రంగులు వేయడం గమనార్హం.

# నారీ.. పట్టు సాధించు..!



విశాఖపట్నం: విశాఖ తీరంలో సముద్రపు నాచు పెంపకంతో మత్స్యకార మహిళలకు ఉపాధి కల్పించేలా మత్స్యశాఖ చేపట్టిన ప్రాథమిక ప్రయత్నాలు ఫలించాయి. నాచు పెంపకంలో ఇప్పటికే గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. ఆ విధానాలను రాష్ట్రంలోనూ అమలు చేయనున్నారు.

**సాంకేతిక దన్నుతో..** ఆర్కేబీచ్‌లో ప్రయోగాత్మకంగా రాఫ్ట్ ఏర్పాటు చేసి సముద్రపు నాచు పెంపకం ప్రారంభించారు. ఈ ప్రక్రియలో రెండు మహిళా సంఘాలకు అవకాశం కల్పించారు. త్వరలోనే మంగమారిపేట, కోస్టల్ బ్యాటరీ వద్ద సముద్రపు నాచు పెంపకం ప్రారంభించనున్నారు. కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ (సీఎంఎఫ్ఆర్ఐ), కేంద్ర సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎస్ఎంసీఆర్ఐ) సాంకేతిక సహకారం అందించనున్నాయి.

**పెంపకం విధానం..!**

చతురస్రాకారంలో ఉన్న రాఫ్ట్‌కు తాళ్లు కట్టి వలతో కలిపి సీవీడ్ (సముద్రపు నాచు) మొక్కలు వేస్తారు. 45 రోజుల వ్యవధిలో పంట చేతికొస్తుంది. ఏ కాలంలోనైనా ఈ పంట వేసుకోవచ్చు.

9 మీటర్ల పరిధిలో నిర్మించే రాఫ్ట్‌లో 50 కిలోల సీవీడ్ వేస్తారు. 200 కిలోల వరకు పంట వస్తుంది. కిలో ధర రూ.21 నుంచి రూ.22 వరకు పలుకుతోంది. ఒక్కసారి పంట వేస్తే రూ.42 వేల వరకు ఆదాయం వస్తుంది. 50 కిలోల మొక్కలు వేసేందుకు రూ.11 వేల వరకు ఖర్చు అవుతుంది. రాఫ్ట్ అటూ, ఇటూ కదలకుండా.. బరువులు కిందకు వేలాడదీసి యాంకర్ పాయింట్‌లో ఉంచడం వల్ల గాలుల తీవ్రతను తట్టుకొని నిలబడుతుంది. రాఫ్ట్ పైభాగంలో సోలార్ లైట్లు, బాయ్స్‌ను అమర్చుతారు. బోట్లు అటు వైపు వెళ్లనీయకుండా అవి నిరోధిస్తాయి.
హెచ్‌డీపీఈ 9 సెంటీమీటర్ల మందంతో కూడిన ఫైబర్ పైపులను రాఫ్ట్ కోసం వినియోగిస్తారు. పైపుల కింద 150 కిలోల కాంక్రీట్ రాళ్లను వేలాడదీస్తారు.

**వినియోగం ఇలా..**

ప్రొటీన్లు, మిటమిన్లు, మినరల్స్ అధికంగా ఉండే సముద్రపు నాచును ఔషధాలు, బిస్కెట్లు, కేకులు, ఐస్‌క్రీమ్స్, జెల్స్, సాఫ్ట్ డ్రింక్స్‌లో వినియోగిస్తారు. పారిశ్రామిక అవసరాలకు కొన్ని రసాయనాల్లోనూ ఉపయోగిస్తారు. ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా దేశాల్లో ఈ పంట అధికంగా పండిస్తున్నారు.

**ప్రత్యేక శిక్షణ ఇచ్చాం** ప్రభుత్వ ఆదేశాలతో ప్రయోగాత్మకంగా చేపట్టిన పెంపకంలో 30 మంది మత్స్యకార మహిళలకు శిక్షణ ఇచ్చాం. తర్వాత మరికొందరికి ఇస్తాం. ప్రస్తుతం 'కప్పా ఫైకస్' అనే రకం పండించాం. రెండోదశలో 'గ్రాస్ లేరియా' రకం వేస్తాం. ఒక్కసారి నిర్మించిన రాఫ్ట్ పదేళ్లు పనికొస్తుంది. మహిళల ఉపాధి దృష్ట్యా దివీస్ లేబొరేటరీ సీఎస్ఆర్ కింద 30 రాఫ్ట్‌లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది.
పి.లక్ష్మణరావు, మత్స్యశాఖ జేడీ

# తీర గ్రామాలకు బహుళార్థక వరం

పాయకరావుపేట: ఆక్వారంగం మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మత్స్యకారులు జీవన స్థితిగతులు మార్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా కేంద్ర మత్స్యశాఖ ప్రధాని మత్స్య సంపద యోజన కార్యక్రమంలో భాగంగా (పీఎంఎంఎస్‌వై) సుమారు రూ.నాలుగు కోట్లు వెచ్చించి జిల్లాలోని పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం, పాయకరావుపేట మండలం పెంటకోట తీరాల్లో బహుళార్థక సాధక కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించింది. ఒక్కో కేంద్రానికి రూ.రెండు కోట్లు కేటాయిస్తున్నారు. వీటిని అత్యంత వెనుకబడిన, తీరానికి అతి సమీపంలో ఉండే గ్రామాల్లో నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా హోంమంత్రి అనిత ఈ పనులకు ఇటీవలే శంకుస్థాపన చేశారు. ప్రధానంగా సముద్రంపై వేటతో జీవనోపాధి పొందే మత్స్యకారులకు అన్ని రకాల సౌకర్యాలతోపాటు వాణిజ్య, ఉపాధి రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేలా అందుబాటులోకి తెస్తున్నారు. తీరంలో పర్యావరణ హితంగా అన్ని వసతులు ఉండేలా ప్రణాళికలు చేపట్టారు.

**ప్రయోజనాలు ఇలా...**

ఈ కేంద్రాల వద్ద చేపలు ఎండబెట్టుకోవడానికి వీలుగా విశాలమైన పర్యావరణహితమైన ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టనున్నారు.
మత్స్యసంపద శుభ్రంచేసి మార్కెట్ చేసుకునేందుకు అనుగుణంగా నీటి వసతి.. ఉత్పత్తులు నేరుగా తరలించేందుకు రవాణా సౌకర్యం అందుబాటులోకి తెస్తారు. వాతావరణంలో ముందుగానే తెలుసుకునే శాటిలైట్ పరికరాలు, సముద్రంలో చేపలు ఎక్కువగా లభించే ప్రాంతాలను గుర్తించే ఆధునిక సమాచార వ్యవస్థ ఏర్పాటు చేస్తారు. చేపలు నిల్వ చేసుకునేందుకు వీలుగా ఐస్ తయారీ కేంద్రంతోపాటు భారీ శీతల గది, వలలు భద్రపర్చుకునేందుకు అనువైన గదుల నిర్మాణం. తీరంలో నిరంతరం వాణిజ్యం జరిగేలా 250 హైమాస్ట్ సోలార్ దీపాలు అమరుస్తారు. మత్స్యకార యువత, మహిళలకు మత్స్య ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, హేచరీల నిర్వహణ, పెంపకం వంటి



అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు. సముద్రంలో ప్రమాదాలు జరిగితే తక్షణ వైద్య సాయం అందించేందుకు ప్రాథమిక చికిత్స పరికరాలు ఉంటాయి.

జనవరి నాటికి అందుబాటులోకి: వచ్చే జనవరి నాటికి బహుళార్థక సాధక కేంద్రాలు జిల్లాలో అందుబాటులోకి రానున్నాయి. కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందనేందుకు ఇదే నిదర్శనం. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు అనుగుణంగా మత్స్య ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు చేసేలా శిక్షణ కేంద్రంతోపాటు అన్ని సౌకర్యాలతో వీటిని నిర్మిస్తున్నాం. జిల్లాలో మరిన్ని చోట్ల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. వంగలపూడి అనిత, హోంమంత్రి

# ఆక్రమణదారుల అనుభవం

నంద్యాల: కొలిమిగుండ్ల మండల కేంద్రంలో రూ.లక్షల విలువైన ప్రభుత్వ భూములకు బేరం పెట్టారు. ఇటిక్యాల గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న కాలనీకి ఆనుకొని వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. అవన్నీ కొండలు, గుట్టలతో కూడుకొని ఉన్నాయి. వాటిని చదును చేసి రెండున్నర సెంట్ల చొప్పున ప్లాట్లు వేశారు. ఒక్కో ఇంటి స్థలాన్ని రూ.లక్ష లోపే విక్రయిస్తున్నారు. ధర తక్కువగా ఉండటంతో చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే 40 ప్లాట్ల వరకు అమ్మేశారు. వాటిని కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు. వెయ్యి వరకు ప్లాట్లు చేసి విక్రయించాలన్న ఆలోచనలో ఆక్రమణదారులు ఉన్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

**పుట్టుకొస్తున్న పట్టాలు**

ఆక్రమణదారులు ఏకంగా అనుభవదారు పట్టాలు పుట్టించి ఇస్తున్నారు. అనుభవదారు పట్టాలు ఇవ్వాలంటే ముందుగా వీఆర్వో ఆ దరఖాస్తును పరిశీలించాలి.. దరఖాస్తుదారు అక్కడ ఉంటున్నారా? ఉంటే ఎంతకాలం నుంచి నివాసం ఉంటున్నారు? ఆ స్థలం ఎంత విస్తీర్ణంలో ఉంది? తదితర వివరాలతో తహసీల్దారుకు నివేదిక ఇవ్వాలి. దాని ప్రకారం పట్టాలు పంపిణీ చేస్తారు.. ఇక్కడ వీఆర్వోలు అందినకాడికి దండుకుని తప్పుడు నివేదికలు ఇస్తున్నారు.

ఉప్పలపాడు గ్రామంలో ఓ వ్యక్తి ఇంట్లో పోలీసులు తనిఖీ చేయగా అక్కడ విక్రయించడానికి సిద్ధం చేసిన 80 అనుభవదారు పట్టాలు దొరికాయి. ఇటిక్యాల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని విక్రయించడానికి వీలుగా వాటిని సిద్ధం చేసి పెట్టినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వాటిని స్వాధీనం చేసుకొన్న పోలీసులు



కొలిమిగుండ్ల మండల తహసీల్దారుకు సమాచారం ఇచ్చారు.

**విచారణలో ఆలస్యం ఎందుకో**

ఇటిక్యాల వీఆర్వో చెన్నయ్య నిబంధనలకు విరుద్ధంగా పలువురికి నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీలు) ఇవ్వడంతో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. మళ్లీ ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన సస్పెన్షన్‌కు దారితీసిన పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసి అక్రమార్కులను గుర్తిస్తే భారీ భూకుంభకోణం వెలుగులోకి వచ్చేది. కానీ ఎలాంటి విచారణ చేయలేదు. అనుభవదారు పట్టాలకు సంబంధించి పోలీసులు సాక్ష్యాధారాలతో సహా కొలిమిగుండ్ల తహసీల్దారుకు ఇచ్చినా నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. తహసీల్దారు కార్యాలయ సీళ్లు, కొందరి సంతకాలు ఉన్నట్లు సమాచారం. నిగ్గుతేల్చాల్సిన రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. కనీసం కేసులు కూడా పెట్టకుండా అంతులేని తాత్సారం చేస్తున్నారు. "ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. వారిచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని" తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

# వ్యాపారుల సిండికేటు.. ప్రభుత్వానికి 'ఉల్లి'పోటు

కర్నూలు : ఉల్లి రైతుకు క్వింటాకు రూ.1200 ధర తగ్గకుండా చూస్తాం. రైతులు తక్కువకు అమ్ముకుంటే ఆ మేరకు ప్రభుత్వం తరపున వారికి వ్యత్యాస ధర చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఇదే అదనుగా కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని వ్యాపారులు సిండికేట్‌గా మారి.. దోపిడీకి తెరలేపారు. నాణ్యతను సాకుగా చూపి అతి తక్కువకు ఉల్లి దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. క్వింటా రూ.100 నుంచి రూ.600 లోపే కొంటున్నారు. రూ.1200 మద్దతు ధర ప్రకారం మిగతా మొత్తాన్ని ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుంది. వ్యాపారులు తెలివిగా కనిష్ఠ ధరలకు కొనుగోలు చేస్తుండటంతో ప్రభుత్వంపై గరిష్ఠ భారం పడుతోంది. మద్దతు ధరతో ఉల్లి రైతులకు కాస్త ఊరట లభిస్తుండగా.. వ్యాపారులు మాత్రం భారీగా లాభపడుతుండటం గమనార్హం.

**క్వింటా రూ.వందకే కొట్టేశారు**

సోమవారం 192 లాట్లలో 8,011 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌కు వచ్చింది. మొదట నిర్వహించిన టెండరులో 20 లాట్లకే ఈ–నామ్‌లో ధరలు రాశారు. ఆ తర్వాత రెండోసారి నిర్వహించిన టెండరు నిర్వహించారు. రెండు టెండర్లలో కలిపి మొత్తం మీద 4,978 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేశారు. క్వింటా కనిష్ఠ ధర రూ.100, మధ్యస్త ధర రూ.634తో వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ రూ.1,200 గరిష్ఠ ధరతో 3,033 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసింది.

మంగళవారం 301 లాట్లలో 14,324.85 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి. ఉదయం నిర్వహించిన టెండరు ప్రక్రియలో 100 లాట్లకే ధరలు రాశారు. మరో 25 లాట్లకు మార్క్‌ఫెడ్ క్వింటాకు రూ.1200 ధర కోట్ చేసింది. మిగిలిన 176 లాట్లకు ఉల్లి వ్యాపారులు ధరలు రాయలేదు. సరకు బాగున్నా సరే కనీసం రూ.100, రూ.200 ధర కూడా రాలేదు. సరకు నాణ్యంగా లేదని కొనుగోలుకు నిరాకరించారు. ఎట్టకేలకు రెండుసార్లు టెండరు నిర్వహించగా అతికష్టం మీద 6,749



క్వింటాళ్ల ఉల్లిని కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా 7,576 క్వింటాళ్ల సరకును రూ.1200 ధరతో కొనుగోలు చేశారు.

**ధరలు రాయకుండా తకరారు**

వ్యాపారులు ఉల్లి లాట్లకు ధరలు రాయకపోవడంతో అధికారులు మంగళవారం హుటాహుటిన కర్నూలు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. 175 లాట్ల ఎందుకు టెండరు ధరను కోట్ చేయలేదు.. సరకు నాణ్యంగా లేదా అని ఆరా తీశారు. 70 శాతం సరకు నాణ్యంగా ఉన్నట్లు గుర్తించారు. అయినాసరే వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంపై జిల్లా అధికారులు అసహనం వ్యక్తం చేశారు.

పది రోజులుగా వర్షాలు పడలేదు. సరకు నాణ్యత బాగుంది. వ్యాపారులు ఉద్దేశపూర్వకంగా ధరలు రాయడం లేదని రైతులు మొరపెట్టుకున్నారు. చివరకు 175 లాట్లను మార్క్‌ఫెడ్ ద్వారానే కొనుగోలు చేశారు. "మాది సి.బెళగల్ మండలం పోలకల్. 30 మంది కూలీలను పెట్టి గ్రేడింగ్ చేయించా.. రెండు లాట్ల సరకును వేర్వేరుగాకుప్పలు పోయగా ఒక లాట్‌కు క్వింటా రూ.765 ధర రాసిన వ్యాపారులు... మరో లాట్‌కు రూ.100 కూడా రాయలేదని" రైతు తిరుమలేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

**కొనేది రూ.1.. అమ్మేది రూ.10**

గత మూడు రోజుల్లో 18,437 క్వింటాళ్ల కొనుగోలు చేశారు. క్వింటాకు రూ.100 నుంచి రూ.700 లోపే ధరలు చెల్లించారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుకు క్వింటాకు రూ.1200 గిట్టుబాటయ్యేలా మిగతా వ్యత్యాస మొత్తాన్ని చేస్తుంది కదా.. అని తక్కువ ధరలు రాస్తున్నారు. రైతుల నుంచి కిలో రూ.1– 6లోపు కొనుగోలు చేసిన ఉల్లిని బయట వ్యాపారులకు కిలో రూ.10, రూ.12తో విక్రయిస్తూ లాభపడుతున్నారు.

# ముక్కంటి.. సేవల్లో మేటి!

శ్రీకాళహసి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆరు ఆలయాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తుల సేవలపరంగా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి రెండు, మూడు స్థానాల్లో ఉన్న ఆలయం ఆగస్టు నెలలో ప్రథమ స్థానానికి చేరింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక భక్తుల సేవలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని నిర్ణయించింది. అందులో భాగంగా దేవాదాయ శాఖ ప్రధాన ఆలయాల్లోని వసతులు, అక్కడి ఇబ్బందులు తదితర అంశాలకు సంబంధించి భక్తుల నుంచి అభిప్రాయాలు సేకరించి ర్యాంకులు ప్రకటిస్తోంది. ప్రధానంగా దర్శనం, మౌలిక వసతుల కల్పన, ప్రసాదాల తయారీ, పారిశుద్ధ్య నిర్వహణపై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఇందుకోసం ఆలయంలోని ప్రధాన ప్రవేశ గోపురాలు, ప్రసాదాల కౌంటర్లు, అతిథిగృహాలు తదితర ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌లను అందుబాటులోకి తెచ్చారు. ఇలా ఐవీఆర్ సర్వే, క్యూఆర్ కోడ్ ద్వారా సమాచారం సేకరించడం, వాటిపై ఆయా ఆలయాల పురోగతి, పెంపొందించాల్సిన సేవలపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తరచూ అధికారులతో సమీక్షిస్తూ సేవలు విస్తృతం అయ్యేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రెండు, మూడు స్థానాల్లో ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయం ఆగస్టు నెలకు సంబంధించి ప్రథమ స్థానంలో నిలవడంతో ఉన్నతాధికారులు స్థానిక అధికారులకు కితాబు ఇచ్చారు. రెండు, మూడు స్థానాల్లో శ్రీశైలం, ద్వారకా తిరుమల ఆలయాలు ఉన్నాయి.

# ముందుకు సాగని పీఎం సూర్యఘర్



కొత్తచెరువు : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోన్న పీఎం సూర్యఘర్ పథకం ముందుకు సాగడం లేదు. దీనిపై లబ్ధిదారుల్లో అవగాహన కొరవడింది. సొంతిల్లు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా, మిగిలిన వర్గాల వారికి సోలార్ యూనిట్‌పై రాయితీ కల్పిస్తూ ఈ పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో వేసవితో పాటు ఏడాది పొడవునా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం సోలార్ కరెంటు ఉత్పత్తికి అనుకూలం. ఈ పథకంతో విద్యుత్తు బిల్లులు తగ్గి ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుంది.

**ఎస్సీ, ఎస్టీలకు వందశాతం రాయితీ**

ఈ ప్రాజెక్టు కింద ఎస్సీ, ఎస్టీలకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం రాయితీ భరించనున్నాయి. రెండు కిలోవాట్ల సౌర పలకలను ఉచితంగా ఏర్పాటు చేయనున్నారు. ఇతర వర్గాలకు ఒక కిలోవాటు నుంచి మూడు కిలోవాట్ల సామర్థ్యం వరకూ ప్రభుత్వం రాయితీ అందించనుంది. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణం ద్వారా ఏర్పాటు చేసుకునేలా వెసులుబాటు కల్పించి వినియోగదారుడి ఖాతాకు రాయితీ సొమ్ము జమ చేయనున్నారు. ఆపైన ఎంత సామర్థ్యం ఉన్న యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నా మూడు కిలోవాట్ల రాయితీ మాత్రమే వర్తిస్తుందని విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**వినియోగదారుల్లో స్తబ్దత..**

సౌర యూనిట్ల ఏర్పాటుపై విద్యుత్తుశాఖ అధికారులు ప్రారంభంలో వినియోగారులకు అవగాహన కల్పించారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్తును ఇంటికి వినియోగించగా మిగిలిన విద్యుత్తును నెట్ మీటరింగ్ విధానంతో గ్రిడ్‌కు అనుసంధానించనున్నారు. దీంతో విద్యుత్తు బిల్లు భారం తగ్గడంతో పాటు కొందరికి నెలవారీగా ఆదాయం సమకూరనుంది. అయితే ప్రారంభంలో సౌర యూనిట్‌పై సొంతంగా పెట్టుబడి పెట్టడం, లేదంటే బ్యాంకు రుణం మంజూరు, తరువాత కంతుల చెల్లింపుపై వినియోగదారులకు అవగాహన కొరవడింది. ఈ నేపథ్యంలో యూనిట్ల ఏర్పాటుకు వినియోదారులు ఆసక్తి కనబరచడం లేదన్న అభిప్రాయాలు వ్యకమవుతున్నాయి.

**సద్వినియోగంతో ఎన్నో ప్రయోజనాలు: సంపత్‌కుమార్, ఎస్‌ఈ, విద్యుత్తుశాఖ** ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఎక్కువ శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. స్థానికంగా నివాసం లేని వారి వివరాలు సిబ్బంది సేకరించి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. త్వరలో వందశాతం రాయితీ యూనిట్లు ఏర్పాటు చేయనున్నాం. ఇతర వర్గాల వినియోగదారులు మొదట పెట్టుబడి భారంగా భావిస్తున్నారు. ఇళ్లపై సోలార్ ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ రాయితీపై అవగాహన కల్పిస్తున్నాం.

# కరవు సీమకు కృష్ణాజలాలు



తలుపుల : కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిన్నరలోనే వరుసగా రెండోసారి కృష్ణాజలాలు బిరబిరా ప్రవహిస్తుండడంతో అన్నదాతలు మురిసిపోతున్నారు. తలుపుల మండలంలో హంద్రీనీవా కాలువ దాదాపు 30 కి.మీ.లకు పైగా ప్రవహిస్తోంది. దీంతో చాలా గ్రామాలు సస్యశ్యామలం కానున్నాయి. కాలువ గట్టుకు ఇరువైపులా బోర్లు, బావుల్లో భూగర్భ జలం పెరగడంతో పాటు ఎండిపోతున్న మామిడి తోటలకు ప్రాణం పోస్తాయని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఎన్నో అడ్డంకులను అధిగమించి..**

గత వైకాపా పాలనలో 15వ ప్యాకేజీలోని 100 మీటర్ల సొరంగం తవ్వడానికి 3 ఏళ్లు పట్టింది. 14వ ప్యాకేజీలోని కల్వర్టులు, వంతెనలు, లైనింగ్ తదితర అసంపూర్తిగా ఉన్న పనులన్నింటిని కూటమి ప్రభుత్వం చక్కబెట్టింది. గతేడాది కొండారెడ్డిచెరువును సగానికి పైగా నింపగలిగింది. దీంతో చెరువుకింద ఉన్న వందలాది బోర్లు, బావుల్లో భూగర్భజలం పెరిగింది. ప్రస్తుతం ఈ చెరువుకు నీటిని నింపడం వల్ల తలుపుల మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాదు.

**ప్రధాన చెరువులు నింపాలి**

ప్రధాన చెరువులు కొండారెడ్డి చెరువు, కొత్తచెరువు, పులిగుండ్లపల్లి చెరువు, యర్రచెరువు, బట్రేపల్లిలోని తంబళ్లపల్లి చెరువు తదితర వాటిని నింపుకోగలిగితే కరవు ఉండదు.

**నేడు కొండారెడ్డి చెరువులోకి..: వనజ, డీఈ హంద్రీనీవా 14వ ప్యాకేజీ**

ప్రధాన చెరువులన్నీ నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. మొదట కొండారెడ్డి చెరువును నింపుతాం. మిగతా చెరువులపై, ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. తలుపుల పంచాయతీ కొరుగుట్టపల్లి వరకు కృష్ణాజలాలు ప్రవహించాయి. బుధవారం తెల్లవారుజామకంతా కొండారెడ్డి చెరువులో జలాలు చేరే అవకాశం ఉంది.

# పైప్‌లైన్ విస్తరణ పనుల్లో జాప్యం



గుత్తి: గుత్తిపురపాలికలో అధికారులు సిమెంట్ రహదారుల నిర్మాణాలను నిరవధికంగా ఆపేశారు. ఫలితంగా పట్టణంలోని అనేక కాలనీల్లో రోడ్లులేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. శివారు కాలనీల్లో రోడ్లతో సహా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ఆయా ప్రాంతాల ప్రజలు పుట్టెడు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో రూ.241 కోట్లతో గుత్తి, పామిడి పట్టణాలకు బృహత్తర తాగునీటి పథకం కింద పనులు జరగాల్సి ఉంది. గుంతకల్లు ప్రజారోగ్యవిభాగం ఇంజినీర్ల పర్యవేక్షణలో పనులు జరుగుతాయి. గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ నుంచి గుత్తి వరకు 52 కిలోమీటర్ల మేర పైపులైన్‌ను ఏర్పాటు చేసి.. పామిడి, గుత్తి, సూరశింగనపల్లిలలో ట్యాంకులను నిర్మించనున్నారు.

**రోడ్లు నిర్మించొద్దని ఆదేశం**

ఈ పథకం కింద గుత్తి పురపాలికలోని అన్నివార్డుల్లో కొత్త పైపులైన్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న సిమెంట్‌రోడ్లు ధ్వంసం చేయాల్సి ఉంది. నూతన రోడ్లు నిర్మిస్తే రూ.కోట్ల నిధులకు సార్థకత ఉండదని అధికారులు భావిస్తున్నారు. పురపాలికలో వీరారెడ్డి కాలనీతోపాటు తాడిపత్రిరోడ్డు, అనంతపురం రోడ్డు, చంద్రప్రియనగర్, తోళ్లషాపుకాలనీ, సుందరయ్యకాలనీ, పత్తికొండరోడ్డు, చెట్నేపల్లిలలోని శివారు కాలనీలకు రోడ్లులేవు. ఆ ప్రాంతాలకు రూ.2 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో సిమెంట్‌రోడ్లు, మురుగుకాలవలను నిర్మించేందుకు కౌన్సిల్ అమోదం తీసుకున్నారు. దీంతో పైపులైను పనులు చేయాలకున్న తరుణంలోనే కొత్తగా రోడ్లు నిర్మించకూడదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి.

**టెండర్ల దశలో..**

గార్లదిన్నె ఎంపీఆర్ డ్యామ్ నుంచి గుత్తికి తాగునీటిని అందించే భారీ నీటిపథకం పనులకు ఇంకా టెండర్లు నిర్వహించాల్సి ఉంది. కొత్తరేట్లతో కొత్తవారికి పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గార్లదిన్నె నుంచి గుత్తి వరకు పైపులైన్ ఏర్పాటుకు గుంతలు తవ్వితే రోడ్డు పాడవుతుందని హైవే అధికారులు అంగీకరించడంలేదు.

**పూర్తయితేనే పనులు..: జబ్బార్‌మియా, కమిషనర్, గుత్తి**

గుత్తి పురపాలికలో తాగునీటి పైపులైన్ విస్తరణ పూర్తయితేనే సీసీ రోడ్ల నిర్మాణం మొదలుపెడతాం. ఇప్పుడే రోడ్లు వేస్తే పైప్‌లైన్ ఏర్పాటులో అవి పాడవుతాయి. అందుకే ఉన్నతాధికారులు రోడ్ల పనులను మంజూరు చేయడంలేదు.

# భూచోళ్ల 'ఎత్తు'గడలు

ఆదోని : డిమాండ్ ఉన్న భూములు గుర్తించడం.. వాటి చుట్టుపక్కల ఉన్నవి చౌకగా కొనుగోలు చేయడం.. సమస్య సృష్టించడం.. నయానో భయానో డిమాండ్ ఉన్న ఆ భూములను తక్కువ ధరకు దక్కించుకొంటున్నారు. నాడు 'అధికార' అండదండలతో రెచ్చిపోయిన వైకాపా 'భూ'తాలు నేడూ తమ పంథాను కొనసాగిస్తున్నాయి. ఆదోని పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిలో వైకాపా నాయకుడి నిర్వాకం వల్ల వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయి.

**కర్షకుల గగ్గోలు**

"వ్యవసాయమే తమ జీవనాధారం.. పత్తి, వాము, శనగ, పొద్దుతిరుగుడు తదితర పంటలు సాగు చేస్తున్నాం.. వచ్చిన దాంతో కుటుంబాలు పోషించుకుంటున్నాం. వైకాపా నాయకుడు పొలం కొనుగోలు చేశాక గత ఐదేళ్లుగా మా భూములు నీటిలో నానుతున్నాయి. ఫలితంగా పంటలు సాగు చేసుకోలేక అర్ధాకలితో జీవనం సాగిస్తున్నాం.. నీటి మళ్లింపునకు మేము ఏర్పాటు చేసిన పైపులు బలవంతంగా తొలగించారని" రైతులు రమేష్, మహబూబ్‌బాషా, విఠల్, గంగన్న, మల్లికార్జున తదితరులు వాపోయారు. ఆ నాయకుడిని ప్రశ్నిస్తే భూములు అమ్మాలని బెదిరింపులకు దిగుతున్నారు.. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో అక్కడ ఎకరా రూ.కోటి వరకు పలుకుతోంది.. తమకు న్యాయం చేయాలని రైతులు విన్నవిస్తున్నారు.



**వంక పూడ్చి.. రైతులను ముంచి**

ఆదోని పట్టణ శివారు మీదుగా 167వ జాతీయ రహదారి వెళ్తోంది. రహదారి నుంచి జగనన్న కాలనీ వైపు వెళ్లే మార్గంలో వైకాపా నాయకుడు ఒకరు సర్వే నంబరు 750లో రెండెకరాలు కొనుగోలు చేశారు. ఆ భూమి వంకకు ఆనుకుని ఉండటంతో అడ్డుగా ఎత్తుగా మట్టిపోశారు. అడ్డుకట్ట వేయడంతో వర్షం నీరు పారే దారిలేక వెనుకున్న వ్యవసాయ పొలాలు ముంపునకు గురవుతున్నాయి.

సర్వే నంబరు– 190, 191లో సుమారు 50 మంది రైతులకు సంబంధించి వంద ఎకరాల సాగు భూమి ఉంది. వర్షం నీరు పారేందుకు వీలుగా ఎప్పటినుంచో వంక ఉంది. ఆ వంకను వైకాపా నాయకుడు పూడ్చేసి తన భూమిలో కలిపేసుకోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. గతంలో జగనన్న కాలనీకి నిర్మించిన రహదారి ఆనవాళ్లు లేకుండా పోయింది.

# పట్టణాల్లో జలధార

పార్వతీపురం : రానున్న 30 ఏళ్లలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఏఐబీ ప్రాజెక్టు పనుల్లో కూటమి ప్రభుత్వం కదలిక తెచ్చింది. ఇటీవల మిగులు పనుల ప్రారంభానికి అవసరమైన అంచనాలను ప్రజారోగ్య శాఖ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించింది. వీటికి అనుమతులు జారీ చేయడంతో పాటు టెండర్లకు నివేదికలు సిద్ధం చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. అన్నీ సక్రమంగా జరిగితే నవంబరులో పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. గత తెదేపా కాలంలో ప్రారంభమైన పనులకు తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం మరోసారి భూమి పూజ చేసింది. గుత్తేదారులకు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ఆపేశారు. ప్రస్తుతం ఆ అంచనాలు భారీగా పెరిగాయి. బొబ్బిలిలో నామమాత్రంగా పనులు జరగ్గా, విజయనగరంలో ముషిడిపల్లి పథకం పైపులైను మార్చాల్సి ఉంది.

**కొత్తగా టెండర్లు..**

పార్వతీపురం, బొబ్బిలిలో పనులు చేసిన గుత్తేదారులకు గత ప్రభుత్వంలో బిల్లులు చెల్లించక పనులు అసంపూర్తిగా నిలిచాయి. అక్కడ జరిగిన పనుల మేరకు బిల్లులు చెల్లించి కొత్తగా టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించి ంది. ఈ రెండు ప్రాజెక్టుల పూర్తికి పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి



నిధి (యూఐడీఎఫ్) బ్యాంకు రుణం మంజూరుకు అనుమతించింది.

**సవరించిన అంచనాలకు ఆమోదం..**

ఉమ్మడి జిల్లాలో సాలూరు, పాలకొండ, నెల్లిమర్ల పట్టణాల్లో పనులకు సంబంధించి అంచనాలు సవరించారు. ఈ మూడు పట్టణాల్లో రూ.46 కోట్ల మేర భారం పడనుంది. గతంలో రూ.171 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించగా ప్రస్తుతం రూ.217 కోట్లకు అంచనాలు చేరాయి. వీటిని ప్రభుత్వం ఆమోదించి డీపీఆర్‌లకు అనుమతులు మంజూరు చేసింది. ఇక్కడ ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి వచ్చిన నిధులతో పనులు చేయనున్నారు. విజయనగరం, రాజాంలో అమృత్ 2.0 పథకంలో భాగంగా నిర్మించనున్నారు. త్వరలో పనుల ప్రారంభం..: జ్యోతి, ప్రజారోగ్య శాఖ, ఈఈ విజయనగరం తాజాగా పంపించిన డీపీఆర్‌లకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. పార్వతీపురం, బొబ్బిలి పట్టణాల్లోని పథకాలకు యూఐడీఎఫ్ నుంచి రుణం పొందేలా అనుమతులు వచ్చాయి. ఏఐబీ ప్రాజెక్టులకు త్వరలో టెండర్లు పిలుస్తాం.

# నిలువ నీడే కాదు.. నీరూ ఇస్తోంది!

బొబ్బిలి సాధారణంగా బస్టాప్ అంటే.. వాహనాలు వచ్చే వరకు నిరీక్షించడం, ఎండ, వానకు తడవకుండా ఉండటం. బొబ్బిలి పట్టణంలోని పాత బొబ్బిలి కూడలిలో ఈ బస్టాప్ మాత్రం ప్రత్యేకం. ఇక్కడ సేద తీరడమే కాకుండా 24 గంటలపాటు తాగునీటి వసతి కల్పించారు. అందుకే అంతా వాటర్ బస్టాప్ అని పిలుస్తుంటారు. ఈ దారిలో సుమారు 25 గ్రామాలున్నాయి. ముఖ్యమైన ఈ కూడలిలో ఎలాంటి బస్టాప్, నీటి వసతి లేక ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని గుర్తించిన పాత బొబ్బిలికి చెందిన పాల వ్యాపారి మోదీ శంకరరావు వినూత్నంగా ఆలోచించారు. సొంత నిధులు సుమారు రూ.2 లక్షలతో మూడు నెలల క్రితం బస్టాప్‌ను నిర్మించారు. 1,000 లీటర్ల ట్యాంకును పైన అమర్చారు. కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రయాణికులే కాకుండా పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు దాహార్తి తీర్చుకుంటున్నారు. తీర్థయాత్రలు, దూర ప్రాంతాల నుంచి వచ్చినవారు ఆగి స్నానాలు చేసి వెళ్తున్నారు. 'ట్యాంకును రోజుకు అయిదుసార్లు నింపుతున్నా. నెలకు రూ.వేయి విద్యుత్తు బిల్లు వస్తోంది. పదిమందికీ ప్రయోజనం కలుగుతోందనే సంతృప్తితో దీన్ని నిర్వహిస్తున్నా.' అని చెబుతున్నారు శంకరరావు.

# నిధుల అరగదీత.. నాణ్యత కరగదీత

కర్నూలు : నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు వెక్కిరిస్తున్నాయి. పనులు పూర్తైన కొద్ది నెలల్లోనే లోపాలు వెలుగుచూస్తున్నాయి. క్షేత్రస్థాయిలో నగరపాలక ఇంజినీరింగ్ విభాగ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అధికారులు పట్టించుకోకపోవడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారు.
కర్నూలు నగరంలో 52 వార్డులు ఉండగా 6.5 లక్షలకుపైగా జనాభా ఉంది. మౌలిక సదుపాయాల కల్పన కోసం నగరపాలక నిధులతో పలు ప్రాంతాల్లో సీసీ రహదారులు, కాలువలు నిర్మించారు. దీనికిగాను రూ.కోట్లు వెచ్చించారు. పలువురు గుత్తేదారులు టెండర్లలో పాల్గొని లెస్‌కు వేసి పనులు దక్కించుకున్నారు. కొందరు సిబ్బంది కమీషన్లకు అలవాటు పడి నాణ్యతను పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. గత మూడేళ్ల కాలంలో నగరంలోని పలు కాలనీల్లో రూ.30 కోట్లకుపైగా విలువైన పనులు చేశారు. చాలా ప్రాంతాల్లో పరిశీలిస్తే రహదారులు అధ్వానంగా మారాయి. కాలువ పనుల్లోనూ నాణ్యత కొరవడింది. ఈ పనులపై విజిలెన్స్ విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయని



పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల విశ్వేశ్వరయ్య కూడలి నుంచి రైతుబజారు వెళ్లే మార్గంలో సీసీ రహదారి ఏర్పాటు చేశారు. దీనికిగాను రూ.50 లక్షలు వెచ్చించారు. విద్యుత్తు స్తంభాలు, ఇతరత్రా కట్టడాలు అడ్డంగా ఉన్నప్పటికీ తొలగించకుండానే పనులు చేసేశారు. ప్రస్తుతం ఆ మార్గంలో పలుచోట్ల నెర్రెలుండటం గమనార్హం.

**సీసీ దారిపై కంకర తేలి..**

కల్లూరు 31వ వార్డులోని రాఘవేంద్ర నగర్‌లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టారు. గతేడాది ఆగస్టు 13న శంకుస్థాపన చేశారు. కొన్ని నెలల తర్వాత పనులు ప్రారంభించారు. దీనికిగాను సుమారు రూ.70 లక్షలు వెచ్చించారు. ప్రస్తుతం పరిశీలిస్తే సీసీ రహదారిపై కంకర తేలి అక్కడక్కడా గుంతలు పడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో నెర్రెలిచ్చాయి.

# వాగులో వాలిన అక్రమార్కులు

డోన్ : డోన్ పట్టణంలో ప్రాధాన్యమున్న పెద్ద వంక చిన్న కాల్వగా మారిపోతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. ఏటా వాగు ఆక్రమణకు గురవుతోంది. పట్టణ ప్రాంతం మీదుగా జగదుర్తి, ఉడుములపాడు చెరువులకు నీరు చేర్చే వాగు కబ్జాలకు గురై పట్టణానికి ముప్పువాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. వాగుకు ఆనుకుని మట్టితో పూడ్చివేసి మరీ నిర్మాణాలు చేపడుతున్నారు. అప్పట్లో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించినా ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు బరితెగిస్తున్నారు. చిన్న నీటి పారుదల, రెవెన్యూ అధికారులు మిన్నకుండి పోవటంతో వాగు విస్తీర్ణం తగ్గి నిర్మాణాలు పెరిగిపోతున్నాయి.

**సెంటు స్థలం రూ.10 లక్షలు**

డోన్ మండలంలోని కొచ్చెర్వు నుంచి పెద్దవాగు ద్వారానే అబ్బిరెడ్డిపల్లె, ఉడుములపాడు చెరువుకు వర్షం నీరు చేరుతుంది. డోన్ సమీపంలో ఈ వాగు 3 కి.మీ.లకు పైగా వెళ్తుంది. డోన్ పట్టణం వేగంగా విస్తరించటంతో వాగుకు అవతలివైపు నిర్మాణాలు ఊపందుకున్నాయి. వాగుపక్కన ఉన్న పొలాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో వాగుకు ఆనుకుని ఉన్న స్థలాలను కొందరు కబ్జాచేశారు. గతంలో 20- 40 మీటర్ల వెడల్పుతో ఉన్న వాగు విస్తీర్ణం ప్రస్తుతం 10- 20 మీటర్లకు తగ్గిపోయింది. వాగుకు సంబంధించి 14 ఎకరాల వరకు పోరంబోకు



భూమి ఉంది. సర్వే నంబరు 292లో 6.54 ఎకరాల వరకు భూమి ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. 291, 270, 322, 289, 169తో పాటు కొన్ని సర్వేనంబర్ల పరిధిలోకి వాగువస్తుంది. ఇక్కడ సెంటు స్థలం దాదాపు రూ. 10లక్షల వరకు పలుకుతుంది.

**మట్టివేసి..మాయ చేసి**

పెద్దవాగుకు సమీపంలో కేతు కృష్ణమూర్తినగర్ ఎదురుగా ఉన్న వెంచర్ వద్ద వాగులోకి మట్టిని పెద్దఎత్తున వేశారు. ఉడుములపాడుకు వెళ్లే వాగు పెద్దఎత్తున ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉడుములపాడుకు వెళ్లే కాల్వ పక్కన వాగు పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని, కాల్వ చిన్నదైతే తమ చెరువుకు నీరు ఎలా వస్తుందని ఉడుములపాడు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సమీపంలో ఓ భవనం వాగులోకి నిర్మించగా అడిగేవారే కరవయ్యారు. కొన్నిచోట్ల బఫర్‌జోన్ నిబంధనలు పాటించకుండానే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. "వాగు ఆక్రమణల విషయం మా దృష్టికి రాలేదని, ఒక వేళ జరిగితే సర్వే చేయించి చర్యలు తీసుకుంటామని" డోన్ ఆర్‌డీఓ నరసింహులు తెలిపారు.

# వసతి గృహాల్లో ప్రవేశాల సందడి

డోన్ : పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు సంక్షేమ వసతి గృహాలు బాసటగా నిలుస్తున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన హాస్టళ్లు.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటిని మరపించే సౌకర్యాలు కల్పించారు. ఈ నేపథ్యంలో పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచే వసతి గృహాల్లో ప్రవేశాల సందడి నెలకొంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, ఓసీ, మైనారిటీ విద్యార్థులను వసతి గృహాల్లో చేర్చుకునేందుకు వార్డెన్లు దరఖాస్తులను ఆహ్వానించారు. ఇప్పటికే ఎస్సీ హాస్టళ్లలో సీట్లు భర్తీకాగా.. బీసీ వసతి గృహాల్లో కొన్ని సీట్లు భర్తీ కావల్సిఉంది.నంద్యాల జిల్లాలో 46 ప్రీమెట్రిక్, 25 పోస్టు మెట్రిక్ బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లు ఉన్నాయి. ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ ఎస్సీ వసతి గృహాల్లో 3,800 సీట్లకు గాను 4,592 మందికి ప్రవేశాలు పొందారు. అదే ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ బీసీ వసతిగృహాల్లో 4,700 సీట్లకు గాను 3,890 మంది చేరారు. ఇంకా 810 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ నెల చివరి వరకు మరింత మంది చేరే అవకాశం ఉంది.

# సరుగుడు.. నష్టాలకు విరుగుడు



అనకాపల్లి :సరుగుడు, సుబాబుల్ ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రంలో కొత్తగా ప్లైవుడ్ తయారుచేసే పరిశ్రమలు రావడంతో పాటు ఉన్న పరిశ్రమలు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాయి. దీంతో కర్రకు మంచి డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో 1.6 లక్షల ఎకరాల్లో సరుగుడు, 70 వేల ఎకరాల్లో సుబాబుల్ సాగు చేసేవారు. సుబాబుల్, సరుగుడు దీర్ఘకాలిక పంటలు. నాటిన తర్వాత నాలుగు నుంచి అయిదేళ్లకు కోతకు వస్తుంది. గత ప్రభుత్వ హయాంలో సరైన ధరలు లభించక చాలామంది తోటలు వేయడం మానేశారు. దీంతో ఇప్పుడు సరుగుడు లక్ష ఎకరాలకు లోపే ఉంది. సుబాబుల్ ఒకసారి నాటితే దాదాపు 25 నుంచి 30 ఏళ్లు పంట వస్తుంది. అయినా చాలా ప్రాంతాల్లో దీన్ని తొలగించి జీడిమామిడి తోటలు వేసుకున్నారు. ప్రస్తుతం 50 వేల ఎకరాల లోపే తోటలున్నాయి. నీటి వసతిలేని మెట్ట ప్రాంతాలైన బుచ్చెయ్యపేట, పరవాడ, అచ్యుతాపురం, మాకవరపాలెంతోపాటు నిత్యం సాగునీరు లభించే మునగపాక, నాగులాపల్లి, తిమ్మరాజుపేట, జగన్నాథపురం, చూచుకొండ వంటి ప్రాంతాల్లోనూ సాగు చేస్తున్నారు. పేపరు తయారీకి సరుగుడు, సుబాబుల్ ముక్కలు వినియోగిస్తారు. ప్లైవుడ్ తయారీకి సుబాబుల్ ఎక్కువగా వాడతారు. ఇప్పుడు సరుగుడు ముక్కలు కొనుగోలు చేస్తున్నారు. బాదులను నిర్మాణ రంగంలో ఎక్కువగా వినియోగిస్తారు. జిల్లాలో అనకాపల్లి, రావికమతం, కన్నూరుపాలెం, గోవాడ, వడ్డాది, కొత్తపేట, తట్టబంద ప్రాంతాల నుంచి సరకు ఎగుమతి అవుతుంది.

**కర్రకు కొరత**

పూర్వం మెట్ట ప్రాంతాల్లోనే వీటిని సాగు చేసేవారు. ఆహార పంటలు గిట్టుబాటు కానందున పుష్కలంగా సాగునీరున్న ప్రాంతాల్లో సరుగుడు, సుబాబుల్ తోటలను రైతులు పెంచడం ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి ధరలు పతనమయ్యాయి. ప్రభుత్వం వారికి గిట్టుబాటు ధర కల్పించలేదు. దీంతో చాలామంది తోటలు తీసేశారు. కొత్త తోటల జోలికి పోలేదు. ఫలితంగా ప్రస్తుతం జిల్లాలో కర్ర కొరత ఏర్పడింది. దీంతో కంపెనీలు ధరలు పెంచాయి.

**టన్ను ధర రూ. 9,500**

గతంలో సుబాబుల్ టన్ను ధర రూ. 3,800 ఉంటే... ప్రస్తుతం రూ. 6,500 పలుకుతుంది. సరుగుడు టన్ను రూ. 4,500 ఉంటే ఇప్పుడు ఏకంగా రూ. 9,500 కొనుగోలు చేస్తున్నారు. ముక్కలు టన్ను గత ఏడాది రూ. 3,500 ఉంటే ఇప్పుడు రూ. 7,000 పలుకుతుంది. అన్ని ఖర్చులు పోను ఎకరాభూమిలో సరగుడు విక్రయిస్తే నికరంగా రూ.లక్ష ఆదాయం వస్తున్నట్లు రైతులు తెలిపారు.
సబ్బవరం, ఆనందపురం, పరవాడ ప్రాంతాల్లో దాదాపు అయిదు వరకు ప్లైవుడ్ తయారీ పరిశ్రమలు ఉన్నాయి. అచ్యుతాపురం, రాంబిల్లి ప్రత్యేక ఆర్థిక మండలిలో ఒక పరిశ్రమ ఉండగా మరొకటి కొత్తగా వస్తోంది. అచ్యుతాపురంలోని పరిశ్రమకు రోజుకు వెయ్యి టన్నుల సరకు అవసరమని వ్యాపారులు తెలిపారు.

# ఆస్తులు తా'కొట్టే'శారు'



కర్నూలు : ఇంటి రుణాల పేరుతో మహీంద్రా హెూం ఫైనాన్స్ సంస్థ సంబంధం లేని వ్యక్తుల భూములను తాకట్టు పెట్టింది. కల్లూరు మండలం బొల్లవరానికి చెందిన సుమారు 33 మంది నగరంలోని బళ్లారి చౌరస్తాలో ఉన్న మహీంద్రా హెూం ఫైనాన్స్ సంస్థలో వివిధ సంవత్సరాల్లో ఇంటి రుణాలు తీసుకున్నారు. సాధారణంగా ఎవరైనా రుణం తీసుకుంటే వారి ఇల్లు, ఆస్తి తాకట్టులో ఉన్నట్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రికార్డుల్లో నమోదు చేయిస్తారు. రుణం మొత్తం చెల్లించిన తర్వాత రుణం తీసుకున్నవారికి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇవ్వడంతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆయా ఎన్‌వోసీలను సమర్పించి తాకట్టు నుంచి తొలగించినట్లు రికార్డులు మారుస్తారు. బొల్లవరం రైతులకు సంబంధించిన విషయంలో మాత్రం సదరు సంస్థ ప్రతినిధులు ఆ ప్రక్రియను తుంగలో తొక్కారు. రుణం తీసుకున్నవారి నుంచి చట్టపరంగా పత్రాలు తీసుకున్నప్పటికీ వారి భూమి పత్రాలుకాక ఇతరుల భూముల పత్రాలు తాకట్టులో ఉన్నట్లు చూపించారు. గ్రామంలోని సర్వే నంబర్లు 100, 123 పరిధిలోని భూమిలో నివసిస్తున్నవారు రుణాలు తీసుకోగా.. సర్వే నంబరు 150లో భూములు తాకట్టులో ఉంచినట్లు చూపారు.

**అక్రమాలు బయటపడినా**

సర్వే నంబరు 150 పరిధిలో 16 ఎకరాల విస్తీర్ణంలో పదకొండు మంది రైతులకు సంబంధించిన భూములను వారికి తెలియకుండానే మహీంద్రా హెూం ఫైనాన్స్ సంస్థ తాకట్టులో ఉంచింది. వాస్తవానికి రుణం ఇచ్చే ముందు బ్యాంకు ప్రతినిధులు రుణాలు తీసుకునేవారి ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం ఆ పత్రాలను న్యాయవాదికి పంపి విచారణ చేయిస్తారు. వాస్తవానికి రుణాలు తీసుకున్నవారు తమ ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఇచ్చారు. అయినప్పటికీ వాటితో సంబంధం లేకుండా ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు ఇతరుల సర్వే నంబర్లను రికార్డుల్లో నమోదు చేసి వారికి రుణాలిచ్చారు. ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు అక్రమాలకు పాల్పడినట్లు 2018లోనే వెలుగుచూసింది. తప్పిదాన్ని సవరిస్తామంటూ పలుమార్లు తిప్పించుకున్నా ఇప్పటికీ పట్టించుకోలేదు. ఓర్వకల్లు, వెల్దుర్తి, డోన్ తదితర ప్రాంతాల్లోనూ కొన్ని ఫైనాన్స్ సంస్థలు రుణాలిస్తామని చెప్పి వారి ఆస్తులకు బదులు ఇతరుల భూములను తాకట్టులో పెట్టుకున్నారన్న ప్రచారం జరుగుతోంది. రుణం తీసుకున్నవారికి ఆస్తులు లేకపోవడంతో ఇతరుల ఆస్తులను తాకట్టులో ఉంచినట్లు సమాచారం.

**ఆస్తుల బదిలీకి వెళ్తే విషయం తెలిసింది**వీరన్న, బొల్లవరం గ్రామం గ్రామంలోని సర్వే నంబరు 150లో నాకు 2.04 ఎకరాలు ఉంది. దానిని నా ఇద్దరు కుమార్తెలకు రాసిచ్చేందుకుగాను ఐదేళ్ల కిందట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే అది తాకట్టులో ఉందని తెలిసి షాక్‌కు గురయ్యా. నాకు తెలియకుండానే సదరు సంస్థ నా భూమిని ఇతరులు తీసుకున్న రుణానికి తాకట్టులో ఉంచినట్లు తేలింది. కొన్ని నెలలపాటు వారి చుట్టూ తిరిగిన తర్వాత ఆ భూమి నాపేరుతో మార్చింది. దీంతో పిల్లలిద్దరికీ ఆస్తుల పంపకాలు చేయగలిగా.

# తాగు'నిధి' కోత



నంద్యాల : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మంచినీటి పథకాల(సీపీడబ్ల్యూ) నిర్వహణ అధ్వానంగా ఉంది. అవసరమైన నిధులు కేటాయించకపోవడం.. పర్యవేక్షణ కరవవడంతో గుత్తేదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జడ్పీకి 14వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించలేదు. 15వ ఆర్థిక సంఘం అమల్లోకి వచ్చాక 2020-21 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాకు సీపీడబ్ల్యూ పథకాల నిర్వహణకు రూ.140.73 కోట్లు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు రూ.53.97 కోట్లు అవసరమని ప్రతిపాదించగా రూ.28.58 కోట్లు వచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికం ప్రారంభమైనప్పటికీ నిధులు మంజూరవలేదు. దీంతో నీటిని శుద్ధి చేయకనే సరఫరా చేస్తున్నారు.

**పెరుగుతున్న బకాయిలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 70 సీపీడబ్ల్యూ పథకాలున్నాయి. రెండేళ్లుగా పథకాలకు సంబంధించి విద్యుత్తు బిల్లులకు చెల్లింపులు లేవు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.52.12 కోట్లు కావాలని ప్రతిపాదించారు. ఇందులో పథకాల నిర్వహణకు రూ.28.16 కోట్లు, విద్యుత్తు బిల్లులకు రూ.23.96 కోట్లు కేటాయించారు. ఇప్పటివరకు ఒక్క పైసా నిధులు రాలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత రెండేళ్లుగా విద్యుత్తు బకాయిలే రూ.18 కోట్ల వరకు ఉండటం గమనార్హం. జిల్లాలో 351 గ్రామాలకు శుద్ధ జలం అందడం లేదు.

**అవసరం రూ.55 కోట్లు**


కర్నూలు జిల్లాలో 33, నంద్యాల జిల్లాలో 27 సమగ్ర రక్షిత తాగునీటి పథకాలున్నాయి. వీటిని ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షిస్తున్నప్పటికీ నిర్వహణ, నిధులను విడుదల చేసేది జడ్పీనే. ఈ పథకాల నిర్వహణ కోసం సగటున ఏటా రూ.55 కోట్ల వరకు ఖర్చవుతుంది. కానీ జడ్పీ నుంచి వస్తున్నది రూ.32 కోట్లు మాత్రమే.
2024-25 ఆర్థిక సంవత్సరంతో 15వ ఆర్థిక సంఘం ముగిసింది. 16వ ఆర్థిక సంఘం అమల్లోకి వచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో పంచాయతీలకు 70 శాతం, మండల, జడ్పీకి మిగిలిన నిధులు కేటాయించారు.

# చేరువలో ఉన్నా.. సేవలు దూరం!

పాలకొల్లు : జిల్లాలో అయిదు పట్టణాల్లో గత ప్రభుత్వ హయాంలో వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయగా నిర్వహణను మాత్రం గాలికొదిలేసింది. వివిధ విభాగాలకు సంబంధించి సిబ్బందిని నియమించినా వారు పనిచేయడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం పట్టణాల్లోని సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయక సేవలు నామమాత్రంగా మారాయి.

**90 శాతం మూలకే..**

ప్రతి వార్డు సచివాలయానికి రెండు చొప్పున కంప్యూటర్లు, ఒక ప్రింటర్ అందజేశారు. అనంతరం వాటి నిర్వహణ పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో జిల్లాలోని 90 శాతం కంప్యూటర్లు మూలకు చేరాయి. కొన్నిచోట్ల మాత్రం మరమ్మతులకు సిబ్బంది సొంత సొమ్ము వెచ్చించడంతో పనిచేస్తున్నాయి. నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో పరిశీలిస్తే కొన్ని చోట్ల కంప్యూటర్లు బల్లపై అలంకార ప్రాయంగా కనిపిస్తున్నాయి. ఇంకొన్ని వార్డుల్లో పనిచేయని వాటిని బీరువాల్లో, ఫర్నిచర్ గదుల్లో



భద్రపరిచారు.

**తప్పని అదనపు వ్యయం**

వివిధ ధ్రువపత్రాల నిమిత్తం వచ్చే విద్యార్థులు, ప్రజలు అక్కడ సేవల నిమిత్తం రుసుములు చెల్లించినా వాటి ప్రింట్ల కోసం అదనంగా చెల్లించాల్సిన దుస్థితి కొనసాగుతోంది. పాలకొల్లు 1, 2, 3 వార్డు సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయకపోవడంతో వచ్చిన వారు వెనుదిరుగుతున్నారు. సమీప మీసేవా కేంద్రాలకు వెళ్లి అవసరమైన పత్రాలు పొందుతున్నారు. నరసాపురం పట్టణంలో 16 సచివాలయాలుండగా ఏఒక్క చోటా తగిన పరికరాలు, స్టేషనరీ అందుబాటులో లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పురపాలిక సంఘాలు సచివాలయాల నిర్వహణ బాధ్యతను తీసుకునే అవకాశం ఉన్నా అలా జరగడం లేదు. ఈ అంశంపై సచివాలయాల పర్యవేక్షణాధికారి దోసిరెడ్డి స్పందిస్తూ పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. పాలకొల్లు హౌసింగ్‌బోర్డుకాలనీలో 24, 25 వార్డులకు సంబంధించి సచివాలయంలో కంప్యూటర్ సీపీయూ మరమ్మతులకు గురికావడంతో ఇలా అటకెక్కించేశారు. ఇక్కడ సరిపడే సిబ్బంది ఉన్నా నిర్వహణ సామగ్రి, పరికరాలు లేకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు.తాడేపల్లిగూడెం, భీమవరం పట్టణాల్లోని పలు వార్డు సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయడం లేదు. సిబ్బంది జారీ చేసే ధ్రువపత్రాలను ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి కాపీలు తీసుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

# క్యాన్సరుపై పోరు!

ఒంగోలు : క్యాన్సరుపై పోరుకు వైద్య,ఆరోగ్యశాఖ మరోసారి ఇంటింటి సర్వేకు సిద్ధమవుతోంది. ఎన్‌సీడీ 3.0 పేరుతో గతంలో చేపట్టిన సర్వే రెండు నెలల కిందట ముగిసింది. దీనిలో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రమాణాలకనుగుణంగా సమాచారం రాకపోవడంతో 4.0 పేరుతో సెప్టెంబరు నుంచి మరో సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే వైద్యులకు శిక్షణ పూర్తయింది. ఏటా అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సరుపై సాధారణ సర్వే జరుగుతోంది. క్షేత్రస్థాయి సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి వ్యాధులపై తూతూమంత్రంగా సమాచారం సేకరిస్తుండడంతో వివరాలు పక్కాగా ఉండడంలేదు. క్యాన్సరు వ్యాధిగ్రస్థులు పెరుగుతున్నా సర్వేలో వెలుగు చూడడంలేదు. ఎక్కువమంది వ్యాధి బారిన పడినా చెప్పడానికి ఇష్టపడడంలేదు. పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి చూపడంలేదు. ఈ సారి పక్కాగా సర్వే చేసి ప్రారంభ దశలోనే క్యాన్సరును గుర్తించాలని వైద్య, ఆరోగ్యశాఖ ప్రణాళిక రూపొందించింది.

**ముందుకు రాని రోగులు**

మూడు రకాల క్యాన్సర్లు అధికంగా వస్తున్నట్లు గుర్తించారు. సర్వైకల్, బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో చేసే ప్రాథమిక పరీక్షలో అనుమానితులను గుర్తిస్తారు. పీహెచ్‌సీ వైద్యులు పరీక్షించాక వారిని పూర్తిస్థాయిలో పరీక్షించి వ్యాధి నిర్ధారణకు ఒంగోలు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రానికి తరలిస్తారు. అక్కడ వ్యాధి నిర్ధారణ అనంతరం రోగి బంధువులకు తెలియజేసి చికిత్స చేయించుకోవాలని సూచిస్తారు. క్యాన్సరు బారిన పడినవారు చికిత్సకు రావడంలేదు. వీరికి అవగాహన కల్పించి ఆసుపత్రులకు తీసుకురావాల్సిన వైద్యసిబ్బంది ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సారి చేపట్టే సర్వేలో వ్యాది నిర్ధారణ అయినవారందరికీ తప్పనిసరిగా చికిత్స చేయించాలని నిర్ణయించారు.

# చెరువుల్లా చేలు.. ముంపులోనే ఆలయాలు

పెనుమంట్ర : భారీ వర్షాల ప్రభావంతో గోస్తనీ కాలువలోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఎగువ నుంచి ప్రవాహం శుక్రవారం మరింత పెరగడంతో ముంపు మరికొన్ని ప్రాంతాలకు విస్తరించింది. గోస్తనీ పరీవాహక ప్రాంతమైన సోమరాజు ఇల్లింద్రపర్రులో వరి చేలు



ముంపులో చిక్కి చెరువులను తలపిస్తున్నాయి. మల్లిపూడి, జుత్తిగ, నత్తారామేశ్వరం, మాముడూరు ప్రాంతాల్లో మరో 3 వేల ఎకరాల్లో సైతం ముంపు ప్రభావం పడింది. నత్తారామేశ్వరంలో రామేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ముంపులోకి ఉంది. ఆలయ ప్రాంగణంలోకి వచ్చే అవకాశం లేకపోవడంతో మహిళలు ప్రవేశమార్గం, గోపురం వద్ద పూజలు చేసుకుంటున్నారు. జుత్తిగలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోకి తొలిసారిగా వరద నీరు చేరింది. ప్రస్తుతం స్వామి మూల విరాట్ నీళ్లలో ఉండగా అలాగే పూజలు చేస్తున్నారు. పెనుమంట్రలోని చిన్నపైడావ పుంతదారిలోకి మరింత నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెనుమంట్ర రాజీవ్ కాలనీ వెనుక పేదల లేఅవుట్ ముంపులో చిక్కుకోవడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

# కంచేసుకో.. పంచేసుకో!!

విశాఖపట్నం : గెడ్డలపై కొందరు గద్దల్లా వాలిపోతున్నారు. భవన వ్యర్థాలతో తొలుత గెడ్డలు, వాగులను పూడ్చి ఆపై చదును చేస్తున్నారు. కొన్ని చోట్ల చుట్టూ రక్షణ కంచెలు నిర్మించి కబ్జాదారులు గుప్పిట్లో పెట్టుకుంటున్నారు. మరికొన్ని చోట్ల పునాదులు వేసి నిర్మాణాలు చేస్తున్నా... కట్టడి చేసే అధికారులు కరవయ్యారు. ఫలితంగా రూ.కోట్ల విలువైన స్థలాలు ఆక్రమణల్లో చిక్కుకున్నాయి. వర్షాలు కురిసి గెడ్డలు పొంగితే పెను ప్రమాదమే సంభవిస్తుంది.

ఎండాడ వద్ద సర్వే నెంబరు 100లో ఉన్న వాగు ఆక్రమణలతో బక్కచిక్కిపోతోంది. ఆక్రమించిన వాగు స్థలంలో రహదారులు, పశువుల షెడ్లు, మొక్కలు నాటి రక్షణ కంచె వేశారు. కార్తికవనం హొటల్ సమీపంలో ఆక్రమణలు గుర్తించి గతంలో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయగా, వాటిని తొలగించి మరీ కబ్జాదారులు పాగా వేశారు. రూ.కోట్ల విలువైన వాగు స్థలం అడుగడుగునా కబ్జాకు గురవుతున్నా అధికారులు సర్వేచేసి, అక్రమార్కులపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సాగర్‌నగర్ సమీపంలో తాటిచెట్లపాలెం గెడ్డ ఆక్రమణలకు గురైంది. భవన వ్యర్థాలతో గెడ్డ స్థలం చదును చేసి సుమారు రూ.కోటిన్నర విలువైన 300 గజాలపైగా ఆక్రమించేశారు. సొంత స్థలాల్లా చుట్టూ ప్రహరీ, ఫెన్సింగ్‌లు నిర్మించారు. జూపార్కు కొండలు, కంబాలకొండ నుంచి వచ్చే వర్షపు నీరు ఈ గెడ్డలోనే ప్రవహిస్తుంది. ఈ వ్యవహారంలో స్థానిక వైకాపా నాయకుడు ఒక చక్రం తిప్పుతున్నారు. ఈయనతో



పాటు ఓ ప్రభుత్వ అధికారి కుటుంబ సభ్యులు సైతం ఈ గెడ్డ ఆక్రమణలో ఉన్నట్లు ఆరోపణలున్నాయి. నగరంపాలెం గెడ్డపై అడుగడుగునా ఆక్రమణలే దర్శనమిస్తున్నాయి. 15 అడుగులుండాల్సిన గెడ్డ కొన్నిచోట్ల 5 అడుగులే ఉంది. మొత్తంగా పిల్లకాల్వలా మార్చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గెడ్డకు మరో వైపు ఉన్న స్థలాలకు ప్లాట్‌ఫామ్‌లు నిర్మించేశారు. దీంతో పూడికతీతకు అవకాశంలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎనిమిది కాలనీలు, మూడు గ్రామాల నుంచి వచ్చే వాడుక నీరు, వర్షపు నీరు ఈ గెడ్డలోనే ప్రవహించాలి. వరదనీరు పోటెత్తితే ఇక్కడ ప్రమాదకరమే. పీఎంపాలెం చివరి బస్‌స్టాప్ నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీ మీదుగా బక్కన్నపాలెం ప్రాంతాలకు వెళ్లే గెడ్డను ఆక్రమించేశారు. ప్రధానంగా హెచ్‌పీసీఎల్ లేఅవుట్ వద్ద నిర్మాణాలు గెడ్డలోకి చొచ్చుకువచ్చాయి. ఈ గెడ్డలో ప్రహరీలు, నిర్మాణాలు ఆరు చోట్ల జరిగాయి. సుమారు రూ. 3.50 కోట్ల విలువైన 600 గజాల మేర గెడ్డ స్థలం ఆక్రమణలపాలైంది.

# బోర్డు ఛైర్మన్ పదవి ఎవరిని వరించునో..!

పుంగనూరు : కూటమి ప్రభుత్వం ప్రముఖ ఆలయాల్లో పాలక మండళ్ల నియామకానికి ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగానే చౌడేపల్లె మండలం బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5 కోట్ల నుంచి రూ.20 కోట్ల వార్షిక ఆదాయం ఉన్న ఆలయాలకు ట్రస్టు బోర్డుల ఏర్పాటుకు దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో దక్షిణాది రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన బోయకొండ గంగమ్మ ఆలయ ట్రస్టు బోర్డులో స్థానం దక్కించుకోవడానికి తెదేపా, జనసేన, భాజపాల నుంచి కొందరు ముమ్మర యత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పుంగనూరు నియోజకవర్గంలో పేరొందిన పుంగనూరు, సోమల, రొంపిచెర్ల మార్కెట్



కమిటీల ఛైర్మన్ల నియామకం పూర్తయింది. అలాగే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బోయకొండ ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పదవికి పోటీ నెలకొంది. దీంతో ఆశావహులు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. అమ్మవారి వార్షిక ఆదాయాన్ని గుర్తించి 13 మందితో ట్రస్టు బోర్డు సభ్యులను నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరిలో ఎస్సీ వర్గం నుంచి ఒకరు, ఎస్టీ-ఒకరు, బీసీ-ఐదుగురు, ఇతరులు ఆరుగురికి అవకాశం ఉంది.

**దరఖాస్తులు స్వీకరిస్తున్నాం..- ఏకాంబరం, ఈవో, బోయకొండ**

బోయకొండ ఆలయ కమిటీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 27లోపు బోయకొండ ఈవో కార్యాలయం లో దరఖాస్తులు అందించాలి.

# నీటి బొట్టు.. ఒడిసి పట్టు..!

పుంగనూరు : కరవు నివారణ, భూగర్భ జలాలను పెంచేందుకు ఈ ఏడాది కూటమి ప్రభుత్వం పంట సంజీవని(నీటి కుంటలు)కి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీరు కుంటల్లోకి వచ్చి చేరడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 18 వేల పంట సంజీవని కుంటలు ప్రభుత్వం మంజూరు చేసింది. కష్టపడి తవ్వుకున్న రైతులకు ఫలితాలు కళ్లముందే కనిపిస్తుండటంతో పంటల సాగుకు ఉపక్రమించారు. జిల్లాలోని 31 మండలాల్లో 18వేల ఫారం ఫండ్లు మంజూరు కాగా ఇప్పటికి వరకు 6,577 పూర్తయ్యాయి. రైతులకు ఉన్న భూమి విస్తీర్ణం పరిగణలోకి తీసుకుని అత్యధికంగా 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతు, అత్యల్పంగా ఐదు మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు, రెండు మీటర్ల లోతుతో పంట సంజీవని తవ్వుతున్నారు.

**లక్ష్యాలు సాధిస్తాం.. - రవికుమార్, పీడీ, డ్వామా, చిత్తూరు**

జిల్లాలో పంట కుంటల నిర్మాణ లక్ష్యాలు సాధిస్తాం. మెట్ట భూములు అధిక విస్తీర్ణంలో ఉన్న రైతులు తవ్వుకున్న కుంటల్లో ప్రస్తుతం వర్షపు నీరు చేరుతోంది. పంటల సాగుకే కాదు భూగర్భ జలాలు పెంపొందేందుకు దోహదపడుతోంది. రైతులు త్వరితగతిన తవ్వకాలు పూర్తి చేయాలి. అందుకు పూర్తి సహకారం అందిస్తాం.

# హంద్రీనీవా.. గుంతకల్లుకు అందేనా?



గుంతకల్లు: హంద్రీనీవా కాలువ రూపకల్పన సమయంలో గుంతకల్లు నియోజకవర్గంలో ఎకరా భూమి కూడా కాలువ కింద ఆయకట్టుగా పొందుపర్చలేదు. దీంతో ఇక్కడి రైతులు హంద్రీనీవా నీటికి దూరమయ్యారు. కాలువను ప్రభుత్వం కర్నూలు జిల్లా నుంచి కసాపురం, గుంతకల్లుకొట్టాల, రాగులపాడు మీదుగా ఏర్పాటు చేసింది.

**పూర్తయితేనే ప్రయోజనం**

రైతుల విన్నపంతో కాలువను సరిదిద్దడానికి రాగులపాడు గ్రామం వద్ద తూము ఏర్పాటు చేసి... కాలువ నిర్మించి 14 చెరువులు, కుంటలకు నీటిని సరాఫరా చేసే ప్రణాళికను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఆయా పనులు పూర్తయితే దాదాపు 4 వేల వ్యవసాయ, తాగునీటి బోర్లలోనూ భూగర్భ జలం పెరుగుతుంది.

**భూమిపూజతో సరిపెట్టారంతే..**

కాలువ పనులకు గత తెదేపా ప్రభుత్వం 2018లో పరిపాలనా ఆమోదం తెలిపింది. రూ.40 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం 2021లో కాలువ పనులకు టెండర్లను నిర్వహించింది. అప్పటి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి పనులకు భూమిపూజ చేశారు. నిధులివ్వకపోవడంతో పనులు సాగలేదు. ప్రసుత్తం కూటమి ప్రభుత్వం పనులు చేయడానికి అంగీకారం తెలిపింది.

**సీఎం ప్రకటించినా...**

ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు నెలల కిందట ఉరవకొండ నియోజకవర్గ పర్యటన సమయంలో జరిగిన బహిరంగ సభలో కాలువ పనులు చేపడతామని ప్రకటించారు. మొత్తం 20 కి.మీ.ల పొడవునా నిర్మించాల్సి ఉంది. కాలువ తవ్వకానికి 240 ఎకరాల భూసేకరణకు గాను రూ.40 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. **నిధులు రాగానే పనులు చేపడతాం: శ్రీనివాసనాయక్, ఈఈ, హంద్రీనీవా గుంతకల్లు డివిజన్**

కాలువ పనులకు రూ.40 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదిక పంపాం. గతంలోని టెండర్లు రద్దు చేయలేదు. ప్రభుత్వ నిర్ణయం మేరకు కాలువ పనులు కొనసాగుతాయి.

# వణుకుతున్న గురుకులం!



హిందూపురం : గ్రామీణ మండలం మలగూరులోని అంబేడ్కర్ గురుకుల బాలుర సంక్షేమ పాఠశాలలో విద్యార్థులను వైరల్ ఫివర్ వారం రోజులుగా వణికిస్తోంది. జ్వరాల భారిన పడిన విద్యార్థులకు పాఠశాల నర్సు సునిత మందులు అందించి మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహించగా ఈ లక్షణాలు బయటపడక పోవటం, మందులు వినియోగిస్తున్నా జ్వరం తగ్గుముఖం పట్టక పోవడంతో శుక్రవారం దాదాపు ఆరుగురు విద్యార్థులను 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో వరుణ్‌సందేశ్‌నాయక్ (9వ తరగతి)తోపాటు 8వ తరగతి చదువుతున్న కౌసిర్, అఖిర, వరుణ్‌కుమార్‌లు చికిత్స పొందుతున్నారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులకు జ్వరం తగ్గుముఖం పట్టడంతో ఇంటికి పంపారు. ఇప్పటికే జ్వరం భారిన పడిన కొంతమంది విద్యార్థులకు ఇంటికి వెళ్లి పోయారు. వాతావరణంలో మార్పులు, పరిసరాల ప్రభావంతో విద్యాలయం విద్యార్థులకు జ్వరాలు సోకినట్లు వైద్యులు తెలిపారు. జ్వరాల భారిన పడిన విద్యార్థులకు తగిన వైద్యసేవలు అందిస్తూ మరొకరికి సోకకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నామని పాఠశాల ప్రిన్సిపల్ నూరుల్లా తెలిపారు.

**జేసీ, డీఎంహెచ్‌వో సందర్శన**

విద్యార్థులు విషజ్వరాల భారిన పడిన విషయం తెలుసుకొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎంహెచ్‌వో ఫైరోజ్‌బేగం శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఎంత మంది విద్యార్థులకు ఎప్పటి నుంచి జ్వరాలు వస్తున్నాయి. వైద్యసేవలు ఎలా అందుతున్నాయనే విషయంపై ఆరా తీశారు. వెంటనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను జేసీ ఆదేశించారు.

**చుట్టూ ముళ్లకంపలు, కిటికీలకు చిరిగిన తెరలు**

గురుకుల పాఠశాల విద్యార్థుల నివాస భవనం శిథిలావస్థకు చేరుకొంది. 510 మంది విద్యార్థులు పాఠశాలల్లో ఉన్నారు. విద్యాలయం చుట్టూ ముళ్లకంపలు ఏపుగా పెరిగిపోవటంతో రాత్రుళ్లలో విద్యార్థులు తీవ్ర దోమలబెడదను ఎదుర్కొంటున్నారు. దోమలు గదుల్లోకి ప్రవేశించకుండా కిటికీలకు అమర్చిన తెరలు పలుచోట్ల చిరిగి పోవటంతో రాత్రుళ్లలో విద్యార్థులు దోమల బెడద ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని దెబ్బతిన్న కిటికీలకు మరమ్మతులు చేయించి, గదుల్లోకి దోమలు రాకుండా కొత్తగా మెష్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

# మబ్బులే.. వర్షాల్లేవు!



విశాఖపట్నం: 'నైరుతి' రుతుపవనాలు ప్రవేశించి రెండు నెలలు దాటినా విశాఖ నగర ప్రజలకు ఎదురుచూపులు తప్పలేదు. జూన్ తర్వాత ఇప్పటివరకు శివారు ప్రాంతాల్లో మినహా నగరంలో చెప్పుకోదగ్గ వర్షాలు కురవలేదు. జూన్, జులై నెలల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అయిదు రోజుల క్రితం వరకు వేసవి తరహా పరిస్థితులు నెలకొన్నాయి. పగలు ఏసీలు, కూలర్లు లేకపోతే ఇళ్లు, కార్యాలయాల్లో ఉండలేని పరిస్థితి.

అల్పపీడనం ఏర్పడినా: అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ముందుగా ప్రకటించింది. మూడు రోజులుగా ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయి. నగరంలో చిరుజల్లులు మినహా వర్షాలు లేవు. శుక్రవారం పెందుర్తి పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దాదాపు గంట వ్యవధిలో 86.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పద్మనాభం, విశాఖ గ్రామీణం, ఆనందపురం తదితర ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురవగా.. గాజువాక, సీతమ్మధార, భీమునిపట్నం, పెదగంట్యాడ, మహారాణిపేట తదితర ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగింది. జూన్ నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో ఆరిలోవ, మధురవాడ, ఎండాడ తదితర ప్రాంతాల్లో భూగర్భ జల మట్టాలు పడిపోయాయి.

ఉదయం నుంచి రాత్రి 7 గంటల వరకు వర్షపాతం ఇలా (మి.మీ.)
జోనల్ కార్యాలయం (పెందుర్తి) 86.5
పోలీస్ స్టేషన్ (పెందుర్తి) 61.5
కణమాం (ఆనందపురం) 50
శిల్పారామం (కొమ్మాది) 49.5
ఎండాడ 27 పద్మనాభం 18.5.

ఇప్పటివరకు 206.6 మి.మీ. వర్షం: జిల్లాలో మూడు నెలలుగా వర్షాభావ పరిస్థితులు కొనసాగు తున్నాయి. నైరుతి రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 40 శాతం లోటు వర్షపాతం నెలకొంది. ఇది రాష్ట్రంలోనే అత్యధికం. జూన్ తర్వాత ఇప్పటివరకు జిల్లాలో 344.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 206.6 మి.మీ. మాత్రమే నమోదైంది. ఎక్కువ లోటు వర్షపాతమున్న జాబితాలో విశాఖ అర్బన్, విశాఖ గ్రామీణం, గాజువాక, పద్మనాభం, పెదగంట్యాడ, పెందుర్తి మండలాలున్నాయి.

# ఏనుగులకూ ఉందో మార్గం..!

తిరుపతి : వన్యప్రాణులకు ఎలాంటి అడ్డంకి లేకుండా సంచరించేం దుకు ఎక్స్‌ప్రెస్ వే అధికారులు ప్రత్యేక మార్గాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం చెన్నై-బెంగళూరు 258 కి.మీ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి రూ.17,930 కోట్లతో పనులు చేపట్టారు. ఈ హైవే జిల్లాలో చిత్తూరు పలమనేరు అడవి మార్గం గుండా వెళ్తుంది. చిత్తూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు 65 కి.మీ దూరం పనులు జరుగుతున్నాయి. ఈ మార్గం అడవి గుండా సాగుతుంది. ఇక్కడ ఏనుగుల సంచారం ఉండటంతో వాటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్మాణాన్ని చేపట్టాలని ఎక్స్‌ప్రెస్ వే అధికారులు ఆలోచించారు. చిత్తూరు నుంచి కర్ణాటక సరిహద్దు వరకు ఈ మార్గంలో ఏనుగులు సంచరించడానికి వీలుగా 12 అండర్‌పాస్‌లను నిర్మిస్తున్నారు. ఎత్తైన పిల్లర్లు నిర్మించి



దానిమీద రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అలాగే తిరుపతి జిల్లాలోని కాలూరు నుంచి పీలేరు వరకు ఎన్‌హెచ్-71ను భాకరాపేట రక్షిత అడవిలో నిర్మించాల్సి ఉంది. కనుమదారిలో మొత్తం 11 కి.మీ. ఉండగా నిర్మాణంలో భాగంగా ఏనుగులు, ఇతర వన్యప్రాణుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నాలుగుచోట్ల 15 అడుగుల ఎత్తులో అండర్‌పాస్‌లు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. తిరుపతి జిల్లా పరిధిలో 30, చిత్తూరు పరిధిలో వందకుపైగా గజరాజులు సంచరిస్తుండటంతో అభివృద్ధి పనుల్లో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అటవీ అధికారులు వెల్లడిస్తున్నారు.

# విద్యాలయంలో పెరటి సేద్యం

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలం బీటీ ప్రాజెక్టులోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో విద్యార్థినులు చదువుతోపాటు పెరటి సేద్యంపై అవగాహన పెంచుకుంటున్నారు. వసతిగృహంలోని వంటశాలలో నిత్యం స్థానికంగా పండే ఆకుకూరలు, కూరగాయలతోనే వంటకాలు చేస్తుండటం గమనార్హం. ఇక్కడ 280 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నిత్యం సాయంత్రం అరగంట పాటు పెరటి సాగులో భాగంగా కలుపు మొక్కలు తొలగించడంతోపాటు నీరు పెట్టడం, పాదులు చేయడం తదితరాలు సిబ్బంది సాయంతో చేస్తుంటారు. ప్రతిరోజూ వంటకాలకు అవసరమయ్యే కూరగాయలు ఇక్కడే సాగవుతుండటం విశేషం.

**సేంద్రియ ఎరువులతోనే..**

విద్యాలయం ఆవరణలోని ఎకరం విస్తీర్ణంలో సేంద్రియ పద్ధతిలో పెరటి సాగు చేస్తున్నారు. తోటకూర, గోంగూర, చుక్కాకు, మెంతాకు,



సబ్బాక్షి, కొత్తిమీర, కరివేపాకుతోపాటు ముల్లంగి క్యారెట్, బెండ, చిక్కుడుకాయలు పండిస్తున్నారు. ప్రతి శనివారం సాయంత్రం విద్యార్థినులకు తోట పనిపై అధ్యాపకులు అవగాహన కల్పిస్తారు.

**పోషకాహార లోపం అధిగమిస్తున్నాం: షబానా, ప్రత్యేకాధికారిణి, గుమ్మఘట్ట కేజీబీవీ**

ఇక్కడ చదివేవారిలో ఎక్కువ శాతం కౌమార దశలో ఉన్నవారే. రక్తహీనతతోపాటు ఇతర రుగ్మతలు అధిగమించడానికి పనికొచ్చే పోషకాహారం ఇక్కడే పండిస్తున్నాం. ఉద్యానశాఖ అధికారులు సహకరిస్తే మరిన్ని కూరగాయలు సాగు చేస్తాం.

# ఆధార్‌కు 'బాలా'రిష్టాలు

కర్నూలు : ఆధార్ అన్నింటికీ ప్రామాణికంగా మారింది. పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకు ప్రతిఒక్కరికి ఈ గుర్తింపు పత్రం తప్పనిసరి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించాలన్నా.. ఆసుపత్రుల్లో ఓపీ కావాలన్నా ఇదే కీలకం. పిల్లలు బడిలో చేరాలన్నా ఆధార్‌పత్రం కావాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఆరేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా నమోదు చేయాలని ఆదేశించింది. కానీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇది అమలుకావడం లేదు. ప్రజలు ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

**నవీకరణలోనూ నాన్చుడే**

పిల్లలకు 6, 15 ఏళ్లు దాటగానే ఆధార్ అప్‌డేషన్ చేసుకోవాలి. బయోమెట్రిక్ వివరాలు నవీకరించుకోవాలి. ఇలాంటి పిల్లలు కర్నూలు జిల్లాలో 5.55 లక్షలు, నంద్యాల జిల్లాలో 2.76 లక్షల మంది ఉన్నారు. వీరిలో లక్షమంది కూడా ఆధార్ నవీకరణ చేయించుకోలేని పరిస్థితి నెలకొంది.

**1.19 లక్షల మంది ఎదురుచూపు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతేడాది డిసెంబరు వరకు ఆధార్ నమోదు చేసుకోని ఆరేళ్లలోపు చిన్నారులు 1,37,272 మంది ఉన్నారు. గడిచిన 7 నెలల్లో మాసాల్లో 17,542 మంది చిన్నారులకు మాత్రమే ఆధార్ నమోదు చేశారు. ఈనెల 14వ తేదీ నాటికి ఇంకా 1.19 లక్షల మంది చిన్నారులకు ఆధార్ లేదు. వీరిలో 29,493 మందికి ఇదివరకే ఆధార్ నమోదు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 96,565 మంది చిన్నారుల వివరాలు నమోదు చేయించాల్సి ఉంది.

**నత్తనడకన ప్రక్రియ**

ఉమ్మడి జిల్లాలో చిన్నారుల ఆధార్ నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది చివరికి కూడా ఇది పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయాల సంచాలకులు ఎం.శివప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. కానీ ఎక్కడా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ జరగడం లేదు. ఉమ్మడి జిల్లాలో 1,188 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. 234 ఆధార్ నమోదు కేంద్రాలున్నట్లు అధికారులు చెబుతున్నా వీటిలో 78 కేంద్రాలు పనిచేయడం లేదు. ప్రస్తుతం సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని చెబుతున్న 156 కేంద్రాల్లో ఆధార్ కేంద్రాల్లో కూడా 80 పనిచేయడం లేదు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు కిట్లు పనిచేయకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు వ్యయ ప్రయాసలకోర్చి ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయించి అధిక మొత్తం చెల్లించి ఆధార్ నమోదు చేయించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

## షోలకు ధనశ్రీ వర్మ రైజ్- ఫాల్ చాలా అవసరం

వివాదాస్పదులు లేదా జీవితంలో ఎదురు దెబ్బ తిన్న వ్యక్తులు రియాలిటీ షోలకు కీలకం. ఇలాంటి సెలబ్రిటీలు మాత్రమే టీఆర్పీలను పెంచగలరు. వారి జీవితాలే షోలకు గొప్ప ముడిసరుకు. అలాంటి వివాదాస్పద వ్యక్తులు లేదా జీవితంలో పెద్ద ఘటనతో దెబ్బ తిన్న వారిపై ప్రజల ఫోకస్ ని ఎన్ క్యాష్ చేసుకోవడానికి రియాలిటీ షోల నిర్వాహకుల ఎత్తుగడలు మహాదాద్భుతం. వీళ్ల బుర్రల్లోని ఐడియాలకు శతకోటి వందనాలు. ఇలాంటి మహా మేధో రియాలిటీ షోలు దేశానికి, దేశంలోని ప్రజలకు అవసరం. ఎవరు ఏం చేసినా ప్రజలకు వినోదం పంచడం చాలా ముఖ్యం. ప్రజల ఫోకస్ ఎలాంటి వివాదాస్పదులు లేదా విధివంచితలపై ఉందో పసిగట్టి, వారిని ఒక చోట పోగేసి తెరమీద పందేరం వేయడం ముఖ్యం. బిగ్ బాస్ షో థీమ్ ఎప్పుడూ దీనికి అతీతం కాదు. ఇప్పుడు అష్నీర్ గ్రోవర్ రియాలిటీ షో రైజ్ అండ్ ఫాల్ కొంచెం అటూ ఇటూగానే ఇలాంటి థీమ్ తోనే కొంత వెరైటీ స్క్రిప్టుతో ముందుకు సాగుతోంది. భర్త చాహల్ నుంచి విడిపోయిన ధనశ్రీ వర్మపై ప్రజలకు చాలా ఆసక్తి ఉంది. అందుకే రైజ్ అండ్ ఫాల్ షోలో పార్టిసిపెంట్ గా ధనశ్రీకి జాక్ పాట్ తగిలింది.



ఈ వేదిక మీద ప్రజలు ఏం చూడాలనుకుంటున్నారంటే భార్య భర్తల తగాదాను లేదా విడాకుల ప్రాసెస్ ఎలా జరిగిందో తెలుసుకోవాలనుకుంటున్నారు. గత వారం ఈ షో ప్రీమియర్ అయినప్పటి నుండి, క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ నుండి తన హై ప్రొఫైల్ విడాకుల గురించి ధనశ్రీ మరిన్ని వివరాలను వెల్లడిస్తుందా అని అందరూ ఎదురుచూసారు. షోలో ధనశ్రీ కదలికలను అందరూ పరిశీలిస్తున్నారు. తన జీవితంలో ఆ ఉద్విగ్న ఘటన కారణంగా, తనను తాను కూడా ఎగతాళి చేసుకునే అవకాశాలను ధనశ్రీ వదులుకోవడం లేదు. తద్వారా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. రైజ్ అండ్ ఫాల్ షోలో ధనశ్రీ వర్మ ఎక్కువగా చర్చించబడే పోటీదారుగా మారింది. రైజ్ అండ్ ఫాల్లో పోటీదారులతో ధనశ్రీ ఘర్షణ ఆసక్తికరం. విడాకుల సంగతి ఎలా ఉన్నా కానీ కెరీర్ పరంగా ఎదగాలంటే మెరిట్, హార్డ్ వర్క్ చాలా ముఖ్యమని ఆమె పేర్కొంది. కలత చెందినా కానీ తనకు అభిమానుల అండ ఉంది. ఇక ధనశ్రీ వాస్తవంగా విడాకుల సమయంలో చాలా ఆవేదనకు గురైన సంఘటనలు ఉన్నాయి. వాటన్నిటిపైనా షోలో చెబుతుందేమో చూడటానికి ఫ్యాన్స్ వెయిటింగ్. విడాకుల తర్వాతే తన కెరీర్ రంజుగా సాగడానికి కారణాలను కూడా చెబుతుందేమో జస్ట్ వెయిట్!!

## శ్రీలీలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు?

సోషల్ మీడియా యుగంలో నెటిజనుల అనైతిక ప్రవర్తన గురించి ఎంత చెప్పినా తక్కువే. అయినదానికి కానిదానికి ట్రోలింగ్ చేయడం రెగ్యులర్ వ్యాపకంగా మారింది. ఇక సెలబ్రిటీలకు ఇది తీవ్ర ఇబ్బందికర పరిణామంగా మారుతోంది. సోషల్ మీడియాల్లో దిగజారి కామెంట్లు చేసే అపరిపక్వ సమాజం, అందులో వ్యక్తుల గురించి ఏమని చెప్పాలి. విలువలకు తిలోదకాలిచ్చి తీవ్రమైన పదజాలంలో దూషించే లేదా ద్వేషించే మనుషులు సామాజిక మాధ్యమాల్లో పరిచయమవుతారు. కథానాయికలు లేదా నటీమణులను బూతు పదాలతో తిట్టే అలవాటు, సామాజిక మాధ్యమాల్లో చూస్తూనే ఉన్నాం. ఇలాంటి అనైతిక వ్యక్తులను నియంత్రించే వ్యవస్థ లేకపోవడం



కూడా పెను సమస్య. ఇటీవలి కాలంలో అందాల కథానాయిక, డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలను విమర్శించే లేదా తీవ్ర పదజాలంతో దూషించే, అసభ్యకరంగా తిట్టే ఒక వర్గం రెడీగా ఉంటోంది. సదరు నటీమణి గురించి అగౌరవంగా, అవమాన కరంగా మాట్లాడే వ్యక్తులు సోషల్ మీడియాల్లో ఉన్నారు. వారు ఉపయోగించే భాష అత్యంత నీచమైనది. జూనియర్% సినిమాలోని కిరీటితో శ్రీలీల వైరల్ సాంగ్ నుండి స్క్రీన్‌షాట్‌లు, క్లిప్‌లను వైరల్ చేస్తూ పలువురు అసభ్యకర కామెంట్లను పోస్ట్ చేస్తున్నారు. శ్రీలీల డబ్బు కోసం అందాల్ని ఆరబోసేందుకు సిద్ధంగా ఉంటుందని ఒక నెటిజన్ కామెంట్ చేసాడు. చాలామంది అసభ్యకరమైన, అభ్యంతరకరమైన భాషను కూడా ఉపయోగించారు. నిజానికి ఐటమ్ పాటల్లో చాలా మంది అగ్ర నాయికలు అందాల్ని ఆరబోసారు. కత్రిన కైఫ్, సమంత, తమన్నా, త్రిష లాంటి అగ్ర నాయికలు అందాల ఆరబోతలో ఎక్కడా తగ్గలేదు. కానీ ఇప్పుడిలా శ్రీలీలను మాత్రమే టార్గెట్ చేయడం తగునా? అని అభిమానులు ప్రశ్నిస్తున్నారు. శ్రీలీల ప్రస్తుతం బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ సరసన నటిస్తోంది. అట్లీ తదుపరి చిత్రంలో శ్రీలీల నటిస్తుందని కథనాలొస్తున్నాయి. ఇటు టాలీవుడ్ లోను పలువురు ఫిలింమేకర్స్ వినిపించిన కథల్ని ఫైనల్ చేసే అవకాశం ఉందని తెలిసింది.




## పొంగల్ ఫైట్.. ఈసారి హీరోలే కాదు ఈ భామలది కూడా



టాలీవుడ్ లో సంక్రాంతికి ఎప్పుడూ హెవీ కాంపిటీషనే. గతకొన్నేళ్లుగా ఇది మరీ ఎక్కువైంది. అయితే ఈసారి కాంపిటీషన్ లిమిటెడ్ గా ఉంటుందనుకుంటే అది కూడా అన్ లిమిటెడ్ అయ్యింది. ఈ పొంగల్ కు చిరంజీవి, నవీన్ పోలిశెట్టి సినిమాలు ఇప్పటికే పండుగపై కన్నేస్తే, ప్రభాస్, శర్వానంద్, రవితేజ ఇటీవల జాయిన్ అయ్యారు. మరి హీరోల మధ్య ఈ కాంపిటీషన్ ఉంటే, హీరోయిన్స్ మధ్య ఉండదా? ఎందుకు ఉండదు కచ్చితంగా ఉంటుంది. రాజాసాబ్ తో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ది కుమార్ ముందుగా ప్రేక్షకుల ముందుకు రానున్నారు. జనవరి 9న ఈ సినిమా రిలీజ్ కానుంది. ఈ ముగ్గురు కెరీర్స్ కు ఇది చాలా ఇంపార్టెంట్ సినిమా. వాళ్ల కెరీర్ కు ఇది సక్సెస్ అవ్వడం అవసరం. ఇక ఫ్యామిలీ ఆడియెన్స్ నాడి పట్టేసిన అనిల్ రావిపూడి ఈసారి మెగాస్టార్ చిరంజీవితో సినిమాతో వస్తున్నారు. మన శంకర వరప్రసాద్ సినిమాతో చిరు రానున్నారు. ఇందులో చిరుకు జోడీ నయనతార నటిస్తుంది. ఇక మీనాక్షి చౌదరికి సంక్రాంతి సెంటిమెంట్ బాగానే కలిసొచ్చింది. సంక్రాంతికి వచ్చిన ప్రతిసారీ సక్సెస్ అందుకుంటుంది. గతేడాది సంక్రాంతికి గుంటూరు కారంతో, ఈసారి సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో మంచి విజయాలు అందుకుంది. ఇక వచ్చే ఏఢాది నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజుకు సినిమాతో రానుంది. నారీ నారీ నడుమ మురారీ అనే శర్వానంద్ సినిమా సంక్రాంతికి వచ్చే ఛాన్స్ ఉందని సమాచారం. ఈ సినిమాలో సంయుక్త , సాక్షి వైద్య హీరోయిన్లు. పొంగల్ బరిలో ఈ ముద్దుగుమ్మలు కూడా దిగబోతున్నారు. వీరికి తోడు రవితేజ– కిషోర్ తిరుమల సినిమాలో లో ఆషికా రంగనాథ్ తో పాటు మరో హీరోయిన్ కూడా ఉంది.

టాలీవుడ్ లోనే ఈ రేంజ్ పోటీ ఉంటే.. డబ్బింగ్ సినిమాలు జననాయగన్ పూజా, మమితా, కరుప్పుతో త్రిష, పరాశక్తి సినిమాలో శ్రీలీల వచ్చే ఛాన్స్ ఉంది. ఇలా 2026 సంక్రాంతి హీరోలకే కాదు హీరోయిన్స్ కు కూడాపోటీ ఉండనుంది.

## కవర్ స్టిల్‌తో మంట పెట్టిన రకుల్




తెలుగు ప్రేక్షకులకు కెరటం సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్‌కి 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో హిట్ దక్కింది. సందీప్ కిషన్ హీరోగా నటించిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ కమర్షియల్‌గా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో వెంటనే రకుల్ ప్రీత్ సింగ్‌కి టాలీవుడ్‌లో స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు దక్కాయి. మెల్ల మెల్లగా స్టార్ హీరోల సినిమాలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచిన రకుల్ ప్రీత్ సింగ్ ఐదేళ్ల పాటు వరుస సినిమాలు చేసింది. ఒకానొక సమయంలో స్టార్ హీరోల సినిమాలకు సైతం డేట్లు ఇవ్వలేని స్థాయిలో బిజీగా సినిమాలు చేసింది. కానీ కాలం ఎప్పుడూ ఒకలా ఉండదు కదా, తెలుగులో ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. టాలీవుడ్‌లో ఆఫర్లు తగ్గిన సమయంలో ఈ అమ్మడికి బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది.

**దే దే ప్యార్ సీక్వెల్‌తో ప్రేక్షకుల ముందుకు...** బాలీవుడ్‌లో ఈమె చేసిన సినిమాలు సైతం నిరాశను మిగిల్చాయి. ఒకటి రెండు తప్ప పెద్దగా సినిమాలు ఆమెకు గుర్తింపును తెచ్చి పెట్టలేదు. రెండు మూడు ఏళ్ల పాటు అక్కడ వరుస సినిమాలు చేసినా పెద్దగా గుర్తింపు రాలేదు. దాంతో అక్కడ కూడా ఆఫర్లు తగ్గుతూ వచ్చాయి. గత రెండేళ్లుగా రకుల్ ప్రీత్ సింగ్ సినిమాలు చాలా అరుదుగా వస్తున్నాయి. ఈ ఏడాది మేరే హస్బెండ్ కీ బివి సినిమాతో వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది. అయినా కూడా లక్కీగా రకుల్ కి దే దే ప్యార్ దే సినిమా సీక్వెల్ లో నటించే అవకాశం వచ్చింది. అప్పట్లో దే దే ప్యార్ దే మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అందుకే ఈ సినిమా లో ఆమెకు నటించే అవకాశం దక్కింది. ఈ సీక్వెల్ త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సినిమా విడుదల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

**బ్రైడ్స్ టుడే కవర్ పేజ్‌పై రకుల్ ప్రీత్ సింగ్...** రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ ఆరంభం నుంచి సినిమాలతోనే కాకుండా అందమైన ఫోటోలతోనూ ఆకట్టుకుంటూ వస్తోంది. తాజాగా మరోసారి ఇన్‌స్టాగ్రామ్‌లో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ వార్తల్లో నిలిచింది. ఈసారి ప్రముఖ మ్యాగజైన్ బ్రైడ్స్ టుడే కవర్ పేజ్ పై రకుల్ ప్రీత్ సింగ్ మెరిసిపోయింది. నడుము అందం చూపిస్తూ అందమైన నాభి అందాలను చూపించడం ద్వారా రకుల్ ప్రీత్ సింగ్ చూపు తిప్పనివ్వడం లేదు. ఆకట్టుకునే అందంతో పాటు, కన్నుల విందు చేసే విధంగా రకుల్ ప్రీత్ సింగ్ మేకోవర్ ఉంది. ఇంతటి అందమైన రకుల్ ప్రీత్ సింగ్‌కు ఇంత త్వరగా ఇండస్ట్రీ ఉద్వాసన పలకడం ఏ మాత్రం బాగా లేదు అంటూ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కుర్రాళ్ల గుండెలో గుబులు...** తెల్లటి డ్రెస్‌లో రకుల్ ప్రీత్ సింగ్ మెరిసి పోతున్న ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. కవర్ పేజ్‌కే అందం వచ్చిందని, పేరుకు తగ్గట్లుగా భలే ఉందని రకుల్ ప్రీత్ సింగ్ కవర్ ఫోటోకు కామెంట్స్ వస్తున్నాయి. సాధారణంగానే రకుల్ ప్రీత్ సింగ్ చాలా అందంగా ఉంటుంది. స్కిన్ షో చేసినా, చేయకున్నా కూడా చాలా అందంగా రకుల్ ప్రీత్ సింగ్ ఉంటుంది. అలాంటి రకుల్ ప్రీత్ సింగ్ ను ఈ అందమైన కవర్ పేజ్‌లో చూస్తూ ఉంటే కుర్రాళ్ల గుండెలో మంట పెట్టినట్లు ఉందని చాలా మంది అంటున్నారు. కవర్ స్టిల్‌తో ఇంత అందంగా కనిపించవచ్చు అని ఈమెను చూస్తే అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ అమ్మడి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇంత అందంగా ఉన్న రకుల్ ప్రీత్ సింగ్‌కి మరో ఐదేళ్ల పాటు సినిమా ఆఫర్లు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.

## మోస్ట్ అవైటెడ్ మూవీ.. ఓటీటీలోకి

ఈ రోజుల్లో స్టార్లు లేకుండా ఒక సినిమాకు థియేటర్లను ప్రేక్షకులను రప్పించడమంటే సవాలే. కానీ ఒక కొత్త హీరో, ఒక కొత్త హీరోయిన్ కలిసి నటించిన సినిమా కోసం ఆడియన్స్ ఉత్కంఠతో ఎదురు చూడడం.. అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా జరగడం.. తొలి రోజు స్టార్ల సినిమాల రేంజిలో ఓపెనింగ్స్ రావడం అంటే చిన్న విషయం కాదు. సైయారా అనే చిన్న సినిమా ఇలాంటి సంచలనమే రేపింది. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిలిమ్స్ బేనర్లో ఆషిఖి-2, ఏక్ విలన్ ఫేమ్ మోహిత్ సూరి రూపొందించిన లవ్ స్టోరీ ఇది. అహాన్ పాండే, అనీత్ పడ్డా అనే కొత్త హీరో హీరోయిన్లు నటించిన ఈ చిత్రం జులై 18న రిలీజై బాక్సాఫీస్ దగ్గర సంచలనం రేపింది. కొన్ని వారాల పాటు హౌస్ ఫుల్ కలెక్షన్లతో రన్ అయిన ఈ సినిమా.. ఉత్తరాదిన వందల సంఖ్యలో థియేటర్లలో 50 డేస్ రన్ పూర్తి



చేసుకుంది. ఈ చిన్న సినిమా వసూళ్లు రూ.500 కోట్ల మార్కును దాటడం విశేషం. థియేటర్లలో సంచలనం సృష్టించిన ఈ సినిమా.. ఓటీటీలో ఎప్పుడు రిలీజవుతుందా అని చాలామంది ఎదురు చూస్తున్నారు. హిందీలో 8 వీక్స్ ఓటీటీ విండో ఉంటుంది కదా. దాని ప్రకారమే ఈ చిత్రం డిజిటల్ ఎంట్రీ ఇస్తోంది. గురువారం అర్ధరాత్రి నుంచే స్ట్రీమింగ్ జెయింట్ నెట్‌ఫ్లిక్స్‌లోకి సైయారా రాబోతోంది. ఆల్రెడీ థియేటర్లలో చూసిన వాళ్లు కూడా ఈ క్లాసిక్ లవ్ స్టోరీని ఆన్ లైన్లో చూస్తారనడంలో సందేహం లేదు. ఈ సినిమాలో అంత విశేషం ఏముందో చూడాలని అన్ని భాషల వాళ్లూ ఎదురు చూస్తున్నారు. కాబట్టి వ్యూయర్‌షిప్ గొప్పగానే ఉంటుందనడంలో సందేహం లేదు. మరోవైపు సూపర్ స్టార్ రజినీకాంత్ చిత్రం 'కూలీ' విడుదలైన నెల రోజుల్లోపే ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో రిలీజైన రోజు నుంచి సరిగ్గా నాలుగు వారాలకే ఈ సినిమాను అమేజాన్ ప్రైమ్ స్ట్రీమ్ చేస్తోంది. నిన్న అర్ధరాత్రి నుంచే 'కూలీ' స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. డిజిటల్ ప్రేక్షకుల నుంచి స్పందన ఏమంత గొప్పగా లేదు. దీంతో పాటే రిలీజైన 'వార్-2' మాత్రం రిలీజైన 8 వారాల తర్వాతే ఓటీటీలోకి రానుంది.

## ప్రణీతా సుభాష్ గ్లామర్ ఎటాక్.. మైండ్ బ్లోయింగ్!

పెళ్లి అయ్యి తల్లి అయిన తర్వాత కూడా గ్లామర్ పరంగా తానేమీ తగ్గలేదని మరోసారి నిరూపించింది నటి ప్రణీతా సుభాష్. ఈ మధ్య గ్లామర్ డోస్ తక్కువ చేసినా.. తాజాగా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆమె వేసిన రెడ్ గౌన్ లుక్ ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ స్లిట్‌తో, డీప్ నెక్ డిజైన్‌తో ఉన్న ఈ ఔట్‌ఫిట్‌లో ప్రణీతా నవ్వుతూ ఇచ్చిన పోజులు అభిమానులనే కాదు, నెటిజన్లను కూడా ఆకట్టుకుంటున్నాయి. శాంతను-నిఖిల్ డిజైన్ చేసిన ఈ ఎగ్జాటిక్ గౌన్ స్టైల్‌తో, ప్రణీతా అందం ఒక డిఫరెంట్ లెవెల్‌కు వెళ్లిపోయింది. ఇంతగానూ ఈ గ్లామర్ షోకి సోషల్ మీడియా నుంచి విపరీతమైన స్పందన వస్తోంది. " వావ్", "ప్రణీతా ఎవర్‌గ్రీన్ బ్యూటీ", "ఇంత గ్లామర్ తో కళ్లకు కనిపించటం మొదటిసారి" అంటూ కామెంట్లు



గుప్పిస్తున్నారు ఫ్యాన్స్. ఆమె రీల్ మీదనే కాకుండా స్టిల్స్ పైనా భారీగా లైక్స్, షేర్లు రావడం విశేషం. తెలుగులో బావ, అత్తారింటికి దారేది వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రణీతా, తమిళం, కన్నడలో కూడా వరుసగా అవకాశాలు అందుకుంది. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చిన ఆమె, ఇటీవల కొన్ని స్పెషల్ ఈవెంట్లలో మళ్లీ పబ్లిక్ అపియరెన్స్ ఇస్తోంది. తాజాగా ఆమె కాన్స్ 2025లో పాల్గొన్న లుక్‌తో మళ్లీ ఫిలిం క్రిటిక్స్ దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫొటోల్లో కనిపించిన ప్రణీతా కాన్ఫిడెంట్, స్టన్నింగ్ లుక్ చూసిన తరువాత.. ఆమెను మళ్లీ తెరపై చూడాలని కోరుకుంటున్నారు అభిమానులు. "గ్లామర్ పరంగా ఇంతగా ఆకట్టుకునే విధంగా మళ్లీ రీ ఎంట్రీ ఇస్తే బాగుంటుంది" అంటూ కామెంట్లు చేస్తున్నారు. వయసు, జీవిత పరిస్థితులు ఎంత మారినా.. గ్లామర్‌ను కాపాడుకోవడం తనకు ఎంత సులువు అనేది.. ప్రణీతా ఈ ఫోటోలతో మరోసారి ప్రూవ్ చేసింది.. ఇకపోతే ప్రణీతా మరోసారి సినిమాల్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నట్టు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536